www.truepointnews.com
ESTD 2024
PointNewsDaily
pointnewsdaily
ARN No: T/TG/2024/1040
Vol.I ISSUE 273
*Air Surcharge Extra Applicable

# పాయింట్

Published From : Hyderabad - Vijayawada - Delhi - Bengaluru
సోమవారం 14, జూలై, 2025 | పేజీలు :12



ఘనంగా ఉజ్జయినీ మహంకాళీ అమ్మవారి బోనాలు..! 4



కేసీఆర్ విజన్‌కు సీతారామ ప్రాజెక్టే సజీవ సాక్ష్యం : కేటీఆర్ 3



తెలంగాణలో ఇక కల్లు దొరకటం కష్టమే..! 2





## తీన్మార్ మల్లన్న ఆఫీస్‌పై కవిత అనుచరుల దాడి..!

- **తెలంగాణలో బీసీల చుట్టూ రాజకీయం**
- **కవితపై తీన్మార్ మల్లన్న వ్యాఖ్యల దుమారం**
- **ఆగ్రహంతో ఆఫీసులపై జాగృతి కార్యకర్తల దాడి**
- **కాల్పులు జరిపిన మల్లన్న గన్ మెన్**

**టీపీఎన్, హైదరాబాద్ :**

ఎమ్మెల్సీ చింతపండు నవీన్ అలియాస్ తీన్మార్ మల్లన్న మరోసారి తన నోటిదురుసు వ్యాఖ్యలతో తెలంగాణ రాజకీయాల్లో రచ్చకు కారణమయ్యారు. తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితపై మల్లన్న చేసిన వ్యాఖ్యలు పెద్ద దుమారమే రేపాయి. ఓ మీటింగ్ లో మల్లన్న మాట్లాడుతూ.. రేవంత్ రెడ్డి ప్రభుత్వం బీసీలకు 42శాతం రిజర్వేషన్లు ఇస్తోందని.. ఈ విషయంలో ఎమ్మెల్సీ కవితకు ఏం సంబంధమని ప్రశ్నించారు. ఆమె బీసీనే కాదు.. మరి ఆమెకు బీసీలతో 'కంచం పొత్తు ఉందా..? మంచం పొత్తు ఉందా?' అంటూ మల్లన్న వ్యాఖ్యానించారు. నిజానికి మల్లన్న చట్ట సభల్లో ప్రతినిధిగా ఉంటూ ఇలాంటి వ్యాఖ్యలు చేయడం చాలా అభ్యంతరకరం. ఒక మహిళా నాయకురాలిని ఉద్దేశించి ఇంత దారుణంగా వ్యాఖ్యానించడం తప్పు. అసలే మల్లన్నపై తీవ్ర ఆగ్రహంతో ఉన్న తెలంగాణ జాగృతి కార్యకర్తలు, కవిత అనుచరులు హైదరాబాద్ మేడిపల్లిలోని మల్లన్న చానల్ ఆఫీసుపై దాడికి దిగారు. గట్టిగా నినాదాలు చేస్తూ కార్యాలయ గేట్లు ధ్వంసం చేసి లోపలికి చొచ్చుకుపోయారు. కార్యాలయంలోని ఫర్నిచర్ ధ్వంసం చేశారు. ఈ ఘటన జరుగుతున్న సమయంలో తీన్మార్ మల్లన్నకు సెక్యూరిటీగా ఉన్న గన్‌మెన్ ఐదు రౌండ్ల కాల్పులు జరపడంతో ఉద్రిక్తత మరింత పెరిగింది. దాడి ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు మల్లన్న కార్యాలయం దగ్గరకు చేరుకొని పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. గన్ మెన్ కాల్పులతో మల్లన్న ఆఫీస్ కార్యాలయమంతా రక్తసిక్తమైంది. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు.. అటు మల్లన్న గన్‌మెన్ కాల్పుల అంశాన్నీ పరిశీలిస్తున్నట్టు సమాచారం.

**తన వ్యాఖ్యలను సమర్థించుకున్న మల్లన్న**

మరోవైపు దాడి ఘటనపై ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న స్పందించారు. హత్యాయత్నాలతో బీసీ ఉద్యమాన్ని అణచలేరన్నారు. కవిత కుటుంబం మాపై హత్యాయత్నానికి పాల్పడిందని మల్లన్న ఆరోపించారు. ఇక నుంచి మేం కూడా ఊరుకునే ప్రసక్తే లేదు. మీరో, మేమో తేల్చుకోవాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. తెలంగాణలో కంచంమంచం అనేది ఊతపదం అన్నారు. తాను చేసిన వ్యాఖ్యలకు ఇంకా కట్టుబడే ఉన్నానని.. ఏం తప్పు మాట్లాడానో ప్రజలు నిర్ణయిస్తారన్నారు. ఇలా రౌడీల్లా దాడి చేయడమే కాకుండా.. నామీదే కేసు పెట్టారు. నా ఆఫీస్‌లో నా రక్తం కళ్లజూశారు. ఈ రక్తం మరకలతోనే ప్రజల్లోకి వెళ్తామని మల్లన్న ప్రకటించారు. కవిత అనుచరుల దాడిలో తన చేతికి గాయమైందని.. గన్‌మెన్ నుంచి తుపాకీ లాక్కుని కాల్పులు జరిపేందుకు వారు ప్రయత్నించారని మల్లన్న ఆరోపించారు.



## చిత్ర పరిశ్రమలో పెను విషాదం..!

### విలక్షణ నటులు కోట శ్రీనివాసరావు ఇక లేరు..!

తెలుగు చలన చిత్ర పరిశ్రమలో పెను విషాదం. ప్రముఖ నటుడు కోటా శ్రీనివాసరావు (83) కన్నుమూశారు. గత కొన్నిరోజులుగా అస్వస్థతతో బాధపడుతున్న ఆయన ఆదివారం తెల్లవారుజామున ఫిల్మ్‌నగర్లోని తన నివాసంలో ఉదయం 4గం.ల సమయంలో తుదిశ్వాస విడిచారు. తన కొడుకు మరణం తర్వాత ఆయన మానసికంగా చాలా కుంగిపోయారు. కొంతకాలంగా ఆయన సినిమాల్లో కూడా అంతగా కనిపించట్లేదు. ఎప్పుడైనా కనిపించినా.. తన పాత్ర చాలా చిన్నగా ఉండేలా ఎంచుకుంటున్నారు. 1942 జులై 10న కృష్ణాజిల్లా కంకిపాడులో కోటా శ్రీనివాసరావు జన్మించారు. 1978లో "ప్రాణం ఖరీదు"తో సినీరంగంలోకి అరంగ్రేటం చేశారు. 4 దశాబ్దాల సినీ ప్రయాణంలో ఎన్నో విలక్షణ పాత్రలు పోషించారు. సినిమాల్లో రాక ముందు ఆయన బ్యాంకులో పనిచేసేవారు. ఐతే.. సినిమాల్లో రాక ముందే ఆయన 20 ఏళ్లపాటూ రంగస్థలంలో నటించిన అనుభవాన్ని పొందారు. సినిమాల్లో ఎంట్రీ ఇచ్చిన కొత్తలో కోట శ్రీనివాసరావు తనదైన శైలిలో.. కామెడీ చేస్తూ.. పెద్దపెద్ద డైలాగులను చకచకా పలుకుతూ..దానికి తగ్గట్లే అద్భుతంగా అభినయిస్తూ ప్రేక్షకుల్ని ఆకట్టుకున్నారు. తన అద్భుత నటనతో అలరించిన ఆయన్ని 9 రాష్ట్ర నంది అవార్డులు, కృష్ణం వందే జగత్ గురు సినిమాకి సైమా అవార్డు, పద్మశ్రీ అవార్డు కూడా కోట శ్రీనివాసరావును వరించాయి. ఇలా 4 దశాబ్దాల పాటూ.. ఆయన సినీ ప్రజలను అలరించారు. 750కి పైగా చిత్రాల్లో నటించారు. తెలుగులోనే కాకుండా మలయాళం, కన్నడ, హిందీ, తమిళం ఇలా అన్ని భాషల్లో కూడా నటించారు కోటా శ్రీనివాసరావు. 1978లో ప్రాణం ఖరీదు సినిమాతో ఇండస్ట్రీలోకి వచ్చారు కోట శ్రీనివాసరావు. 2015లో పద్మశ్రీ అవార్డు కూడా దక్కించుకున్నారు. ఆయనకు మొత్తం తొమ్మిది నంది అవార్డులు వచ్చాయి. 19992004 వరకు విజయవాడ తూర్పు ఎమ్మెల్యేగా ఆయన పనిచేశారు. కోట శ్రీనివాసరావుకు ఇద్దరు కుమార్తెలు, కుమారులు కూడా ఉన్నారు. తెలుగు సినీ పరిశ్రమలో.. కోట శ్రీనివాసరావు చాలా ప్రత్యేకం. విలన్ గానే కాకుండా.. ఎన్నో మంచి కేరక్టర్లకు ఆయన ప్రాణంశారు. తనదైన నటనా శైలితో ఆకట్టుకున్నారు. కామెడీ, సీరియస్, సెంటిమెంట్.. ఇలా ఎన్నో రకాల హావభావాలు అలవోకగా పలికించారు. ముఖ్యంగా.. బాబూ మోహన్ తో కలిసి.. దాదాపు 60 సినిమాల్లో నటించారు. వారిద్దరి కామెడీ టైమింగ్.. ప్రజలందరికీ నచ్చేది. రావుగోపాల రావు లాంటి నటుల తర్వాత.. వారి వారసత్వాన్ని తీసుకొని.. వెండి తెరపై తన ముద్ర వేసుకున్న కోట శ్రీనివాస రావు ఇక లేరు అనే వార్తను ఆయన అభిమానులు, సినీపరిశ్రమలోనివారు జీర్ణించుకోలేకపోతున్నారు. తెలుగుతోపాటూ.. తమిళం, హిందీ సినిమాల్లో కూడా ఆయన నటించారు.



## మండలి చైర్మన్ గుత్తాకు ఎమ్మెల్సీ కవిత ఫిర్యాదు..!

**టీపీఎన్, హైదరాబాద్ :**

ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న చేసిన వ్యాఖ్యలపై శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డికి ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఫిర్యాదు చేశారు. మండలి చైర్మన్ ఇంటికెళ్లి మరీ ఎమ్మెల్సీ ఫిర్యాదు చేశారు. అనంతరం కవిత మీడియాతో మాట్లాడారు. ఇష్టానుసారంగా మాట్లాడితే ఊరుగోబోమని తీన్మార్ మల్లన్నను ఈ సందర్భంగా కవిత హెచ్చరించారు. మహిళలు రాజకీయాల్లో మాట్లాడకూడదా? అంటూ ప్రశ్నించారు.

ప్రజలపై కాల్పులు జరిపేంత క్రూరత్వం ఏంటి..? అని ఎమ్మెల్సీ కవిత ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆడబిడ్డను ఇష్టమొచ్చినట్లు మాట్లాడి.. మాండలికం అంటే ఎట్లా? అని కవిత ప్రశ్నించారు. ఆడబిడ్డలను గౌరవించడం నేర్చుకోండన్న కవిత.. తీన్మార్ మల్లన్న తనపై దారుణంగా మాట్లాడారని చెప్పుకొచ్చారు. వెంటనే అతన్ని అరెస్ట్ చేయాలని ఆమె డిమాండ్ చేశారు. బాధ్యతాయుతమైన పదవిలో ఉన్న వ్యక్తి విచక్షణతో మాట్లాడాలని తీన్మార్ మల్లన్నకు కవిత సలహా ఇచ్చారు.

**మల్లన్నకు కవిత వార్నింగ్**

బీసీ అయినంత మాత్రాన.. మల్లన్న ఏది పడితే అది మాట్లాడితే కుదరదని కవిత అన్నారు. 'నన్ను బయట తిరగనివ్వను అనటానికి మల్లన్న ఎవరు?. ఈరోజు ఏం జరిగిందో చూశారు కదా.. పరుష పదజాలాన్ని తెలంగాణ ప్రజలు క్షమించరు. వెంటనే తీర్మార్ మల్లన్నను అరెస్ట్ చేయాలని ముఖ్యమంత్రిని డిమాండ్ చేస్తున్నాం. ముఖ్యమంత్రి ఇంటి బిడ్డలకు ఒక న్యాయం. ఇతరులకు మరొక న్యాయమా? మల్లన్నను అరెస్ట్ చేయకుంటే.. మల్లన్న వెనుక ముఖ్యమంత్రి ఉన్నారుకోవాల్సి ఉంటుంది. మల్లన్నపై జాతీయ మహిళా కమిషన్ కు ఫిర్యాదు చేస్తాం. శాసనమండలి చైర్మన్ తన విచక్షణ ఉపయోగించి మల్లన్నను ఎమ్మెల్సీగా డిస్ క్వాలిఫై చేయాలి. ఆడబిడ్డలు అనుకుంటే మల్లన్న ఇంట్లో నుంచి బయటకురారు. ఆవేశం వచ్చి జాగృతి కార్యకర్తలు ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన తెలిపారు. అంతమాత్రాన కాల్పులు జరుపుతారా?' అని కవిత ప్రశ్నల వర్షం కురిపించారు. రాజకీయాలంటే.. మేకప్ వేసుకుని చేసే డ్రామా కాదని మల్లన్న గుర్తుంచుకోవాలని కవిత ఆక్షేపించారు. 'నేను బీసీ ఉద్యమం చేస్తుంటే మల్లన్న తట్టుకోలేకపోతున్నారా? ఏదైనా ఉంటే.. ఇష్యూ మీద మాట్లాడాలి. ఆడబిడ్డలు రాజకీయాల్లోకి రావొద్దా?. నేను ఏనాడు మల్లన్నను ఒక్క మాట కూడా అనలేదు. నన్ను ఎందుకు టార్గెట్ చేస్తున్నారు? బీసీల కోసం ఆయన మాదిరే నేను పోరాటం చేస్తున్నా. ఘటనపై విచారణ జరపాలని డీజీపీని డిమాండ్ చేస్తున్నా' అని కవిత స్పష్టం చేశారు.



## భాయ్ బచ్చా ఆ గయా.. ఈ కోడ్ లాంగ్వేజ్ మీకు తెలుసా..!

- **అందులో దాగి ఉన్న సీక్రెట్‌ను రట్టు చేసిన ఈగల్**
- **వాట్సప్ గ్రూప్‌తో నడుస్తున్న బడా డ్రగ్ రాకెట్**
- **కస్టమర్లలా డెకాయ్ ఆపరేష్ చేసిన పోలీసులు**
- **14 మంది అరెస్ట్.. 86 మంది కోసం గాలింపు**

**కృష్ణకుమార్, టీపీఎన్, స్పెషల్ డెస్క్ :**



భాయ్ బచ్చా ఆగయా (అన్న పిల్లగాడు వచ్చాడు)... ఈ మాట వినడానికి కొత్తగా ఉంది కదా.. ఇందులో ఏముంది అనుకుంటున్నారా.. చాలా పెద్ద సీక్రెట్ దాగి ఉంది. ఆ మాటలో చాలా మర్మం కూడా ఉంది. అది వింటే మీరు కుడా కంగుతింటారు. ఎస్ ఈ విషయం తెలిసి నార్కోటిక్ కంట్రోల్ బ్యూరో.. ప్రస్తుతం ఈగల్.. సైతం బిత్తరపోయింది. ఈ భాయ్ బచ్చా ఆగయా అంటే ఏంటో తెలుసుకునే పనిలో పడింది. ఓ డెకాయ్ ఆపరేషన్ చేసింది. ఆ తరువాత భాయ్ బచ్చా మిల్ గయా అంటూ ఈగల్ సిబ్బందిపై అధికారులకు పోస్టు పెట్టారు. ఏంటీ ఈ తికమక అనుకునేరు.. అసలు వివరాల్లోకి వెళితే.. ఈగల్‌కి అందిన సమాచారం మేరకు సాఫ్ట్ వేర్ ఉద్యోగులు, ఐటీ కంపెనీలు, చోటా, బడా వ్యాపారులతో కలిసి మహా రాష్ట్రకు చెందిన సందీప్ అనే ఓ డ్రగ్ పెడ్లర్.. ఓ వాట్సప్ గ్రూప్ క్రియేట్ చేశాడు. అందులో వీకెండ్ సమయంలోనే కాదు.. మిగతా రోజుల్లో గంజాయి, డ్రగ్స్ కావాలంటే ముందుగా ఓ కోడ్ లాంగ్వేజ్ ద్వారా సమాచారం అందించాలి. ఆ తరువాత గంజాయి స్పాట్‌కు చేరుకోగానే, వాట్సప్ గ్రూప్ అడ్మిన్ భాయ్ బచ్చా ఆగయా అంటూ మేసేజ్ పెడతాడు. అంతే కావాల్సి వారు ఆయా స్పాట్‌లకు వెళ్లి గంజాయి కొనుగోలు చేస్తారు. ఇది చాలా రోజులుగా జరుగుతున్న తంతు. ఈ విషయం తెలుసుకున్న ఈగల్ స్టాఫ్ కూడా ఆ గ్రూప్‌లో మెంబర్లుగా జాయిన్ అయ్యారు. పక్కా ప్లాన్ ప్రకారం గంజాయి కావాలంటూ ఆర్డర్ పెట్టారు. వీకెండ్ అందులోను ఆదివారం కదా, గచ్చిబౌలిలోని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ వద్ద డెన్ డిక్లరేషన్ ఇచ్చారు. స్పాట్‌కు రీచ్ కాగానే అనుకున్న ప్రకారం మేసేజే వచ్చింది. ఇంకేముంది డెకాయ్ ఆపరేషన్‌లో భాగంగా అతడిని అదుపులోకి తీసుకున్నారు. అలా పట్టుబడిన వ్యక్తి నుండి ఒకరు కాదు ఇద్దరు కాదు ఏకంగా 14 మందిని అదుపులోకి తీసుకున్నారు. వీరిలో ఓ దంపతుల జంట తమ నాలుగేళ్ల కుమారుడితో కలిసి గంజాయి కొనుగోలు కోసం వచ్చారు. పారిపోవాలని ప్రయత్నించిన ఫలితం లేకుండా పోయింది. పట్టుబడిన వారికి ఈగల్ పరీక్షలు చేయగా వారికి రిపోర్ట్ పాజిటివ్ రావడంతో అందిరినీ అదుపులోకి తీసుకున్నారు.

**పట్టుబడిన వారి వివరాలు..**

ఆన్ లైన్ ట్రేడర్ నవీన్, విద్యార్థి ఆయుష్, రేసింగ్ ఇంజనీరింగ్ నిఖిల్, ఆర్కిటెక్ట్ సింధూర, ప్రాపర్టీ మేనేజర్ హాసన్, ఐటీ ఉద్యోగి క్రాంతి, డెంటర్ టెక్నీషియన్ అఖిల్, బిజినెస్ రిలేషన్ షిప్ మేనేజర్ శివ, రిలాన్స్ అడ్వర్టైజింగ్ ఏజెన్సీ సందేష్, రియల్ ఎస్టేట్ సేల్స్ ఎగ్జిక్యూటివ్ సాయి రాజ్, ట్రావెల్ ఏజెన్సీ నిర్వహకుడు అఖిల్, డ్రైవర్ స్వామీ, ఐటీ ఉద్యగులు తుషార్, అర్పిత్‌లను అదుపులోకి తీసుకున్నారు. వీరంతా రూ. 3 వేల నుంచి గంజాయి కొనుగోలు చేశారు. వీరి వద్ద నుండి 5 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. వాట్సప్ గ్రూప్‌లో ఉన్న మిగతా 86 మంది కోసం ఈగల్ గాలిస్తోంది. సో ఇప్పుడు అర్థమైంది కదా భాయ్ బచ్చా ఆగయా అంటే.. ఇలాంటి కోడ్ బాషలో చాలా డ్రగ్స్ గ్రూపులు ఉన్నట్లు అధికారులు భావిస్తున్నారు. వీటన్నింటిపై సైబర్ క్రైమ్ నిపుణులతో కలిసి దాడి చేయాలని సంకల్పించారు. ఈ డెకాయ్ ఆపరేషన్‌లో ఈగల్ ఎస్పీ రూపేష్ ఆధ్వర్యంలో డీఎస్పీ హరిశ్చంద్రరెడ్డి పర్యవేక్షణలో సీఐ రమేష్ రెడ్డి ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## పటాన్‌చెరు పారిశ్రామికవాడలో
# మరో అగ్నిప్రమాదం..!

**టీపీఎన్, సంగారెడ్డి :**



పటాన్‌చెరులోని పాశమైలారం పారిశ్రామికవాడలో ఇటీవల జరిగిన అగ్నిప్రమాద ఘటన మరువకముందే, తాజాగా మరో అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ఎన్విరో వేస్ట్ మేనేజ్‌మెంట్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్‌లో సంభవించిన ఈ ప్రమాదం అధికారుల నిర్లక్ష్యాన్ని, పారిశ్రామిక వాడల్లో భద్రతా ప్రమాణాల అమలుపై పలు ప్రశ్నలను లేవనెత్తుతోంది. వివరాల్లోకి వెళ్తే, పాశమైలారం పారిశ్రామికవాడలోని ఎన్విరో వేస్ట్ మేనేజ్‌మెంట్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్‌లో భారీగా మంటలు ఎగిసిపడ్డాయి. పరిసర ప్రాంతాల్లో దట్టమైన పొగ కమ్ముకుంది. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని పలు ఫైర్ ఇంజిన్లతో మంటలను అదుపులోకి తీసుకొచ్చేందుకు శ్రమించారు. ఈ ప్రమాదానికి గల కారణాలు, ఆస్తి నష్టం వివరాలు ఇంకా పూర్తిగా తెలియాల్సి ఉంది. అయితే, ఒక అగ్నిప్రమాదం జరిగిన కొద్ది రోజులకే అదే పారిశ్రామికవాడలో మరో ప్రమాదం జరగడం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. ఇది పరిశ్రమల్లో భద్రతా నిబంధనల ఉల్లంఘనను, వాటిని పర్యవేక్షించడంలో అధికారుల నిర్లక్ష్యాన్ని స్పష్టంగా సూచిస్తోంది. పారిశ్రామిక భద్రతపై కఠిన చర్యలు తీసుకోకపోతే ఇలాంటి ఘటనలు పునరావృతమయ్యే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్లు వెల్లువెత్తుతున్నాయి. ఈ ప్రమాదానికి సంబంధించి మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది. అయితే ఈ పరిశ్రమంలో అగ్ని ప్రమాదం జరగడం ఇది రెండోసారి.

# యుద్ధప్రాతిపదికన పాలేరు సాగర్ యూటీ పనులు పూర్తి..!

- **ఇవాళ నీటిని విడుదల చేయనున్న మంత్రి పొంగులేటి**

**టీపీఎన్, హైదరాబాద్ :**



ఖమ్మం జిల్లాలో సుమారు నాలుగు లక్షల ఎకరాలకు సాగునీటిని అందించే పాలేరులోని నాగార్జున సాగర్ ఎడమ ప్రధాన కాలువ అండర్ టన్నెల్ (యూటీ) నిర్మాణ పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేసి రేపటి (సోమవారం )నుంచి 1500క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఉదయం 10గంటలకు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క తో కలిసి ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తామని పేర్కొన్నారు.ఆదివారం నాడు ఆయన కూసుమంచి మండలం జుజ్జులరావుపేటలో జరుగుతున్న పాలేరు సాగర్ కాలువ పనులను ఆకస్మికంగా జిల్లా కలెక్టరు అనుదీప్ దురిశెట్టి తో కలిసి తనిఖీ చేశారు ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. గత ఏడాది కురిసిన భారీ వర్షాలకు సెప్టెంబర్‌లో పాలేరు నియోజకవర్గంలోని కూసుమంచి మండలం జుజ్జులరావు పేట సమీపంలో పాలేరు రిజర్వాయర్ దగ్గర ప్రధాన కాలువపై అండర్ టన్నెల్ (యూటీ) కొట్టుకపోయిందన్నారు. రైతులకు ఇబ్బంది కలగకూడదన్న ఆలోచనతో అప్పట్లో తాత్కాలిక ఏర్పాట్లు చేసి సాగునీటిని అందించడం జరిగిందని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచన మేరకు, రాష్ట్ర ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సహకారంతో యూటీ పనులు పూర్తి చేసినట్లు తెలిపారు. శాశ్వత ప్రాతిపదికన రూ 14.20 కోట్లతో ఈ యూటీ కాలువ మరమ్మతులను ప్రారంభించడం జరిగిందని ఖమ్మం జిల్లాలో వ్యవసాయ రంగానికి జీవనాధారమైన ఈ కాలువ మరమ్మతులను పూర్తి చేసి సాగునీరు అందిస్తాం. దీనివలన ఖమ్మం జిల్లాలో సుమారు నాలుగు లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుండగా ఒక్క పాలేరు నియోజకవర్గంలో 1.33 లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుందని తెలిపారు. వానాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని అత్యంత ప్రాధాన్యతా క్రమంలో రోజుకు రెండు షిఫ్ట్‌ల క్రమంలో పనిచేసి గడువులోగా నిర్మాణ పనులను పూర్తి చేయడం జరిగిందన్నారు.



## కల్లు దుకాణాలపై కొనసాగుతున్న
# ఎక్సైజ్ దాడులు..!

ఎక్సైజ్ స్టేట్ టాస్క్ ఫోర్స్ (ఎస్టీఎఫ్) ఏ మరియు డీ టీమ్‌లు కలిసి కల్లు డిపోలపై దాడులు నిర్వహించాయి. ఎస్టీఎఫ్ ఏ టీం లీడర్ అంజిరెడ్డి ఆధ్వర్యంలో మూడు కేసులు నమోదు చేసి, ఆరు బైక్‌లను స్వాధీనం చేసుకొని, 420 లీటర్ల అక్రమ కల్లును నాశనం చేశారు. నల్లచెరువు, ఉప్పల్ ప్రాంతంలో ఎలాంటి అనుమతులు లేకుండా ముగ్గురు వ్యక్తులు టూవీలర్‌లపై 25 లీటర్ల కల్లును తీసుకువస్తుండగా, వారిని అడ్డుకున్నారు. వారి వద్ద ఎటువంటి లైసెన్స్ లేకపోవడంతో కల్లును నాశనం చేసి, రంగ శ్రీకాంత్, లోడి అనిల్, బడిగా నవీన్‌లను అరెస్ట్ చేశారు. ఘట్కేసర్ పరిధిలో 82 లీటర్ల కల్లును రవాణా చేస్తున్న లోడి సందీప్‌ను అరెస్ట్ చేసి, అతని వద్ద ఉన్న 82 లీటర్ల కల్లును నాశనం చేశారు. మరో కేసులో 124 లీటర్ల కల్లును స్వాధీనం చేసుకొని, లోడి మహేందర్, మాడ రమేష్‌లను అరెస్ట్ చేశారు. వారు తీసుకువస్తున్న 124 లీటర్ల కల్లును నాశనం చేసి, శాంపిల్‌స్‌ను సేకరించి పరీక్షల కోసం పంపించారు. ఎస్టీఎఫ్ డీ టీం లీడర్ నాగరాజు ఆధ్వర్యంలో సరూర్‌నగర్, రామంతపూర్, ఉప్పల్ ప్రాంతాల్లో మూడు చోట్ల కల్లు డిపోలపై దాడులు నిర్వహించి, ముగ్గురి వద్ద నుండి శాంపిల్స్ సేకరించి పరీక్షల కోసం పంపించినట్లు తెలిపారు.




# ఒక రాజకీయ నాయకుడిగా సిగ్గుపడుతున్నా: ఈటల రాజేందర్

**టీపీఎన్, హైదరాబాద్ :**

డాక్టర్ దీప్తిరావు గోరుకంటి రాసిన “A DOCTOR'S GUIDE TO FINANCIAL HEALTH” అనే పుస్తకావిష్కరణ కార్యక్రమంలో ఎంపీ ఈటల రాజేందర్ పాల్గొన్నారు. బీజేపీ సీనియర్ నాయకులు ఎక్కా శేఖర్ జీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఈటల మాట్లాడుతూ.. “నేను ఆర్థిక మంత్రిగా ఉన్నప్పుడు జీఎస్టీ కోసం ప్రధానమంత్రిగారితో కలిసి పనిచేసే అవకాశం లభించింది. ధనం మూలం ఇదం జగత్.. ఈ సమాజం డబ్బు మీద నడుస్తోంది. కూలీ చేసుకునే వారు కూడా సెల్‌ఫోన్ వాడుతున్నారు. నెలకు కనీసం వెయ్యి రూపాయలు సెల్‌ఫోన్ కోసం ఖర్చు చేసే స్థితికి సమాజం మనల్ని నెట్టివేసింది. గతంలో పొలందగ్గరికి నడిచి వెళ్ళేవాళ్ళం, కానీ ఇప్పుడు టూవీలర్ వాడుతున్నాం, దానికోసం పెట్రోల్ ఖర్చు చేస్తున్నాం. తమ పిల్లలు కష్టపడకూడదని కాన్వెంట్ స్కూళ్లకు పంపిస్తున్నాం, దానికి ఖర్చు చేస్తున్నాం. ఇవన్నీ కాకుండా, హఠాత్తుగా వచ్చే హాస్పిటల్ ఖర్చుల వల్ల కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. ఈ ఖర్చుల కోసం అప్పులు చేయాల్సి వస్తోంది. ఇలా ఆర్థిక విషవలయంలో చిక్కుకుపోతున్నాం.”

మోదీ నీతి ఆయోగ్ ఏర్పాటు చేసిన తర్వాత ఒక మాట చెప్పారు: “రాష్ట్రాల అభివృద్ధిలోనే దేశాభివృద్ధి ఉంది. అలాగే, కుటుంబాల ఆర్థిక పరిస్థితి మెరుగుపడకుండా రాష్ట్రాలు, దేశం బాగుపడదు. ప్రభుత్వ ఖర్చులను మాత్రమే లెక్కిస్తున్నారు, కానీ కుటుంబాల ఖర్చులను లెక్కకట్టడం లేదు. సమాజం ఎటు వెళ్తోంది? విద్యార్థులు అనేకమంది డ్రగ్స్‌కు బానిసలవుతున్నారు. ఈ సమస్యలను అరికట్టలేకపోతున్నామని ఒక రాజకీయ నాయకుడిగా నేను సిగ్గుపడుతున్నాను. ఎన్నికల కోసం డబ్బు సంపాదించడంపైనే దృష్టి పెట్టేవారు ఎక్కువైపోయారు, కానీ సమాజాన్ని బాగు చేయాల్సిన బాధ్యత తమదేనని మర్చిపోతున్నారు. రాజకీయాలు గొప్ప సేవ కావాలి, కానీ సమాజ హితం కొరవడుతోంది. ఆన్‌లైన్ గేమ్‌ల వల్ల ఎంతోమంది చనిపోతున్నారు. రైతులు కూరగాయలు, పాలు పట్టణంలో కొనుక్కునే పరిస్థితి వచ్చింది. రక్త సంబంధీకులైన అన్నదమ్ములు ఆస్తి కోసం ప్రాణాలు తీసుకుంటున్నారు. తాగుడికి బానిసై డబ్బులు ఇవ్వలేదని అమ్మను హత్య చేస్తున్నారు. ఇది సమాజానికి మంచిది కాదు. ఒకప్పుడు పిల్లలే ఆస్తిగా ఉండేవారు, కానీ ఇప్పుడు ఒక్క సంతానాన్ని కూడా సాధలేకపోతున్నారు. పంట దిగుబడి పెరిగినా రైతులు అప్పుల్లో కూరుకుపోతున్నారు. నిరుద్యోగుల సంఖ్య పెరిగిపోతోంది. యువశక్తి గల దేశం మనది. ఆ యువతను దేశ పురోగమనంలో భాగస్వాములను చేయాలి. అమెరికాలో బతికే వారికి డబ్బు ఉండవచ్చు, కానీ తృప్తి లేదు. సంపద మానవ జీవితానికి సూచిక కాదు, తృప్తి మరియు విలువలే నిజమైన సూచికలు. సంపద పెరిగినా అంతరాలు తగ్గలేదు. పేదవారు మరింత పేదవారిగా మారుతున్నారు. ఏకీకృత సంపద పేదరికానికి మూల కారణం. ఎక్కడో తప్పు జరుగుతోంది. అంబేద్కర్ గారు చెప్పినట్లు మార్పు రావాలి. బడ్జెట్ అంటే లాభనష్టాల పట్టిక కాకూడదు. ప్రజల్లో కూడా ఆర్థిక క్రమశిక్షణ చాలా అవసరం” అని చెప్పారు.





# తెలంగాణలో ఇక కల్లు దొరకడం కష్టమే...?

- **కల్లును నిషేధించాలని పలువురి డిమాండ్**
- **ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో ఒత్తిడి**
- **నిషేధం విధించేందుకు ఆలోచనలో పడ్డ సర్కార్..**

**కృష్ణకుమార్, టీపీఎన్, స్పెషల్ డెస్క్ :**

కల్లు.. తెలంగాణ సంప్రదాయాల్లో ఒకటి. రాష్ట్ర సంస్కృతిలో భాగం కల్లు. తరాలు మారినా తరగని క్రేజ్ ఒక్క కల్లుకే ఉంది. ఇప్పటికీ గ్రామాల్లో పొద్దటి కల్లు తాగందే.. ఏ పనీ చేయరు. అంతలా మన జీవన సంస్కృతిలో కల్లు ఓ భాగంగా వస్తోంది. కానీ ఇటీవల కాలంలో కల్లు అంటే కేవలం కల్లు మాత్రమే కాదు అదో రసాయనం. అదో కెమికల్ మిశ్రమంగా మారిపోయింది. ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన మిస్ వరల్డ్ అందాల పోటీల్లో సుందరీమణులు మన తెలంగాణ తాటి కల్లు తాగి సూపర్ ఉంది అని మెచ్చుకున్నారు. అలా ఓ వైపు మన రాష్ట్ర ప్రభుత్వం మన సంస్కృతి, సంప్రదాయ వంటకాలను ప్రపంచానికి పరిచయం చేస్తోంది. గత బీఆర్ఎస్ హయాంలోనూ హైదరాబాద్ లాంటి నగరాల్లో నీరా కేఫ్‌లు పెట్టి మరీ అప్పటి ప్రభుత్వం కల్లును ప్రోత్సహించింది. కానీ ఇటీవల కొందరు మాత్రం డబ్బు కోసం స్వచ్ఛమైన కల్లును విషపూరితంగా మారుస్తున్నారు. రసాయనాలు కలిపి కల్లు అని పేరు పెట్టి అమ్మేస్తున్నారు. అటు నగరాల్లోనూ.. ఇటు పల్లెల్లోనూ ఇప్పుడు ఇదే దందా నడుస్తోంది. ముచ్చటపడి తెలియక ఈ రసాయన కల్లు తాగి.. ఏకంగా ప్రాణాలే కోల్పోతున్నారు. ఇందుకు నిదర్శనమే ఇటీవల కూకట్ పల్లిలో జరిగిన ఘటన. హైదరాబాద్ కూకట్పల్లి లో ఇటీవల కల్తీ కల్లు ఘటన రాష్ట్రంలో సంచలనంగా మారింది. కల్తీ కల్లు తాగి ప్రాణాలు విడిచిన వారి సంఖ్య 9 కి చేరింది. ఇక మరో 50 మందికి పైగా తీవ్ర అస్వస్థతకు గురై ఆస్పత్రుల్లో ఇంకా చికిత్స పొందుతూ ఉన్నారు. మృతుల సంఖ్య పెరుగుతుండటం తీవ్ర ఆందోళనకు గురి చేస్తోంది.

మరోవైపు తెలంగాణ వ్యాప్తంగా కల్లు కాంపౌండ్ లపై ఎక్సైజ్ శాఖ అధికారులు దాడులు నిర్వహిస్తున్నారు. కల్లు కాంపౌండ్ ల నిర్వహణ, కల్లు అమ్మకాలపై పరిశీలన చేస్తున్నారు. జీహెచ్ఎంసీ పరిధిలో 3 కల్లు కాంపౌండ్ లపై ఇప్పటికే కేసులు నమోదు చేశారు. అటు ముషీరాబాద్ లో అనుమతులు లేని కల్లు కాంపౌండ్ ను అధికారులు సీజ్ చేశారు. ఇదిలా ఉంటే తెలంగాణలో కల్తీ కల్లు విచ్చలవిడిగా విక్రయిస్తున్న నేపథ్యంలో కల్లును బ్యాన్ చేయాలని పలు సంఘాలు పట్టుబడుతున్నాయి. ప్రజల ప్రాణాలు తీస్తున్న ఈ కల్లును రాష్ట్రంలో నిషేధించాలని ప్రభుత్వానికి డిమాండ్ చేస్తున్నారు. మరి తాజా పరిణామాల దృష్ట్యా రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో వేచి చూడాలి.



## కేసీఆర్ ముందుచూపుతో ఖమ్మం జిల్లా సస్యశ్యామలం : హరీష్‌రావు

కేసీఆర్ ముందుచూపుతో గోదావరి జలాలను ఖమ్మం జిల్లాకు తరలించి సస్యశ్యామలంగా చేయాలన్న సంకల్పంతో నిర్మించిన సీతారామ ప్రాజెక్టు ఫలాలు రైతులకు అందడం సంతోషంగా ఉందని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు తెలిపారు. ఎట్టకేలకు సీతారామ ఎత్తిపోతల ప్రాజెక్టు మోటార్లు ఆన్ చేసి నీళ్లు అందించడంతో రైతులు కేసీఆర్ కృషిని గుర్తు చేసుకుంటున్నారని చెప్పుకొచ్చారు. గోదావరి జలాలను కృష్ణా జలాలతో అనుసంధానం చేసే ఈ ప్రాజెక్టు విలువ ఏమిటో ఇప్పుడు అనుభవంలోకి వచ్చిందని అన్నారు. నదీ జలాల సద్వినియోగానికి కేసీఆర్ చిత్తశుద్ధితో చేసిన కృషికి సీతారామ ప్రాజెక్టు ఓ సజీవ సాక్ష్యమని ఉద్ఘాటించారు. సీతారామ ప్రాజెక్టు మోటార్లు ఆన్ చేసినట్లే, కన్నెపల్లి పంప్ హౌస్ మోటార్లు ఆన్ చేసి సాగు నీటి కోసం ఎదురుచూస్తున్న రైతాంగాన్ని రేవంత్ ప్రభుత్వం ఆదుకోవాలని హరీష్‌రావు కోరారు.



## కవితపై తీన్మార్ మల్లన్న వ్యాఖ్యల్ని ఖండించిన మధుసూదనా చారి..!

**టీపీఎన్, హైదరాబాద్ :** ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న ఎమ్మెల్సీ శ్రీమతి కల్వకుంట్ల కవితపై చేసిన అనుచిత, అసభ్యకర వ్యాఖ్యలను నేను తీవ్రంగా ఖండిస్తున్నట్లు మధుసూదనా చారి తెలిపారు.. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. "మహిళల గౌరవాన్ని కాపాడటం మన సంస్కృతి. వ్యక్తిగత దూషణలు, మహిళలను కించపరిచే వ్యాఖ్యలకు రాజకీయాల్లో చోటు లేదు. బాధ్యతాయుతమైన పదవుల్లో ఉన్న ప్రజాప్రతినిధులు మాట్లాడే భాష మహిళలను కించపరిచేలా ఉండకూడదు. ఆడబిడ్డల గురించి మాట్లాడేటప్పుడు సంయమనంతో, సభ్యతతో మాట్లాడితే మంచిది. తీన్మార్ మల్లన్న వెంటనే ఎమ్మెల్సీ కవితకు బేషరతుగా క్షమాపణ చెప్పాలి" అన్నారు.



## జీహెచ్ఎంసీ ఎన్నికల్లో మేయర్ పీఠం బీజేపీదే

**టీపీఎన్, హైదరాబాద్ :** త్వరలో జరగబోయే జీహెచ్ఎంసీ (GHMC) ఎన్నికల్లో మేయర్ పీఠం బీజేపీనే కైవసం చేసుకుంటుందని తెలంగాణ అధ్యక్షుడు రాంచందర్ రావు ధీమా వ్యక్తం చేశారు. గోల్కోండ జిల్లా అధ్యక్షుడు ఉమా మహేందర్ ఆధ్వర్యంలో అధ్యక్షుడిగా ఎన్నికైనందుకు బేగం బజార్లో అభినందన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి రాంచందర్ రావు పాల్గొన్నారు. పెద్ద ఎత్తున కార్యకర్తలు ఈ సమావేశానికి వచ్చి రాంచందర్ రావును సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడుతూ.. అధ్యక్షుడిగా తాను ప్రతి కార్యకర్తకు అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఎవరి నుంచి ఎటువంటి హాని వచ్చినా తాను ముందుండి.. వారిని ఎదుర్కొంటానని కార్యకర్తల్లో ఉత్సాహాన్ని నింపారు. అలాగే త్వరలో జీహెచ్ఎంసీ కి జరిగే ఎన్నికల్లో బీజేపీ పార్టీ అత్యధిక కార్పోరేటర్లను గెలుచుకొని.. గ్రేటమ్ మేయర్ పీఠం కైవసం చేసుకుంటుందని.. ఆ దిశగా ప్రతి కార్యకర్తలతో కలిసి ముందు వెళ్తామని ఈ సందర్భంగా బీజేపీ చీఫ్ రాంచందర్ రావు చెప్పుకొచ్చారు.

## ఘనంగా గాంధీ జ్ఞాన్ ప్రతిష్టాన్ స్వర్ణోత్సవాలు..!

**టీపీఎన్, హైదరాబాద్ :** గాంధీ జ్ఞాన్ ప్రతిష్టాన్ ఏర్పాటై 50 సంవత్సరాలు పూర్తి చేసుకుందన్నారు మంత్రి సీతక్క. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. "మహాత్మా గాంధీ గారి ఆలోచనా విధానాన్ని ప్రజల్లోకి మరింతగా తీసుకెళ్లేందుకు ఇటువంటి కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయం. 1500 గాంధీ విగ్రహాలను ఏర్పాటు చేసి, వారి త్యాగాన్ని, ఆలోచనా విధానాన్ని దేశానికి, సమాజానికి గుర్తు చేస్తున్నారు. ఎప్పటికైనా భారత దేశానికి గాంధీ సిద్ధాంతమే శ్రీరామ రక్ష. శాంతియుత మార్గంలోనే మనకు విజయం సిద్ధిస్తుంది. గాంధీ బాటలో నడిచి నియంతలను, దుర్మార్గులను తరిమికొట్టాము. మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి నాయకత్వంలో గాంధీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్తున్నాము. మహాత్మా



గాంధీ, రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ గారి ఆలోచనా విధానాన్ని గ్రామగ్రామానికి తీసుకెళ్తున్నాము. అందులో భాగంగా 'జై బాపూ, జై భీమ్, జై సంవిధాన్' కార్యక్రమాన్ని చేపట్టాము. మహనీయుల దారిలో నడిచి ప్రజలకు మేలు చేస్తాము. ఎప్పటికైనా శాంతి, సామరస్యమే గెలుస్తాయి. లాంగ్ లివ్ గాంధీ" అని చెప్పారు.



## మహిళా సాధికారతే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం : మల్లు భట్టి విక్రమార్క

**టీపీఎన్, మంచిర్యాల :** మహిళా సంఘాలకు సోలార్ విద్యుత్తు ఉత్పత్తి ప్రాజెక్టుల కేటాయింపుపై ప్రత్యేక దృష్టి సారించాం, మహిళా సాధికారత కోసం రాష్ట్ర ప్రభుత్వం ఎంత దూరమైనా వెళుతుంది, ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ మహిళల ఆర్థిక అభివృద్ధికి ప్రజా ప్రభుత్వం ముందుకు పోతుందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. ఆదివారం మంచిర్యాల జిల్లా లక్షెట్టిపేట మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేసిన అనంతరం భారీ బహిరంగ సభలో డిప్యూటీ సీఎం ప్రసంగించారు. జనాభాలో సగభాగమైన మహిళలకు గత కాంగ్రెస్ ప్రభుత్వాలు వడ్డీ లేని రుణాలు ఇవ్వగా పదేళ్లపాటు పరిపాలించిన టిఆర్ఎస్ వడ్డీ లేని రుణాల పథకాన్ని గాలికి వదిలేసింది, తిరిగి కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే వడ్డీ లేని రుణాల పథకం అన్నారు ప్రారంభించిందని తెలిపారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేస్తామని మేము ప్రకటించినప్పుడు ఇది సాధ్యమా అని కొద్దిమంది అవహేళన చేశారు కానీ మొదటి సంవత్సరంలోనే లక్ష్యానికి మించి 21, 600 కోట్ల రూపాయలు వడ్డీలేని రుణం చెక్కులను మహిళా సంఘాలకు అందజేశామని తెలిపారు.

ఈనెల 12 నుంచి 20 వరకు రాష్ట్రవ్యాప్తంగా మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు పంపిణీ చేస్తామని అందులో భాగంగా ఆదివారం మంచిర్యాలలో వడ్డీ లేని రుణం చెక్కులు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఆమ్ ఆద్మీ బీమా పథకం కింద మహిళా సంఘాలకు భద్రత, మహిళా సంఘాలకు రుణ సదుపాయం కల్పించి వారితో బస్సులు కొనుగోలు చేయించి ఆర్టీసీకి అద్దెకు ఇప్పించినట్టు తెలిపారు. మొత్తం 600 బస్సులు ఇప్పించే కార్యక్రమంలో భాగంగా ఇప్పటికీ 150 బస్సులలో ఆర్టీసీకి అనుసంధానం చేసి లీజు మొత్తం కోటి రూపాయల చెక్కును ఇటీవల ఆర్టీసీ నుంచి మహిళా సంఘాలకు అందజేశామని డిప్యూటీ సీఎం తెలిపారు. మిగిలిన 450 బస్సులను త్వరలో ఆర్టీసీకి లీజుకు ఇప్పిస్తామని అన్నారు. మహిళా సంఘాలతో క్యాంటీన్లో, పెట్రోల్ బంకులు, ప్రతి ప్రాంతాల్లో వ్యాపారాలు చేసుకోవడానికి స్థలాలు ఇచ్చామని తెలిపారు.

ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో మైక్రో ఇండస్ట్రీస్ పెట్టుకొని మహిళలు వ్యాపారాలు చేసుకునే కార్యక్రమాలు చేపట్టినట్టు డిప్యూటీ సీఎం వివరించారు. సాధారణ ఎన్నికల ముందు ఆదిలాబాద్ జిల్లా కు ఏసిసి అధ్యక్షుడు ఖర్గే వచ్చినప్పుడు కాంగ్రెస్ అధికారంలోకి వస్తుంది మేము అడిగిన పనులు చేయాలని జిల్లా ప్రజలు, కాంగ్రెస్ నాయకులు కోరిన విషయాన్ని డిప్యూటీ సీఎం గుర్తు చేశారు. సీఎం రేవంత్ రెడ్డి తో పాటు యావత్ క్యాబినెట్ ఆదిలాబాద్, మంచిర్యాల జిల్లా అభివృద్ధికి దృష్టి సారిస్తామని తెలియజేశారు. ఆదిలాబాద్ జిల్లా అభివృద్ధికి ప్రత్యేక కార్యక్రమం తీసుకునే ఆలోచనలో రాష్ట్ర ప్రభుత్వం ఉందని, బాబాసాహెబ్ అంబేద్కర్ ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టును చేపడతామని ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం తెలిపారు. ఆనాడు రాష్ట్రంలోని రాచరిక పాలనలో, రాష్ట్ర మొత్తం దోపిడీ జరుగుతుంటే టిఆర్ఎస్ ప్రభుత్వాన్ని ఎదిరించి ప్రజాస్వామ్యంతో కూడిన పాలనను తీసుకురావడంలో ఆదిలాబాద్ జిల్లా ప్రజల పాత్ర మరువలేనిది అన్నారు. ఎన్నికల ముందు పీపుల్స్ మార్చ్ పేరిట తాను పాదయాత్ర చేపట్టగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ప్రజలు తన అడుగులు అడుగు వేసిన జ్ఞాపకాలు ఇంకా పచ్చగా తేలి ఆడుతున్నాయి అన్నారు. నాటి పిసిసి అధ్యక్షుడిగా సీఎం రేవంత్ రెడ్డి భారీ బహిరంగ సభ పెట్టి ఆదిలాబాద్ జిల్లా నుంచి శంఖారావాన్ని పూరించగా, సీఎల్పీ నేతగా పీపుల్స్ మార్చ్ పాదయాత్రను ఆదిలాబాద్ నుంచి ప్రారంభించిన విషయాన్ని గుర్తు చేశారు. ఎన్నికల ముందు రాష్ట్ర ప్రజలకు ఏ ఏ వాగ్దానాలు చేశామో అధికారంలోకి వచ్చాక ఒక్కొక్కటిగా అమలు చేసుకుంటూ ముందుకు వెళుతున్నామని తెలిపారు. గుట్ట నిండా లక్ష మంది పైగా ప్రజలు తరలిరావడం చూస్తుంటే ఆశ్చర్యమేస్తుంది, ప్రజల గుండెల్లో ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు స్థానం పదిలం చేసుకున్నారని ఈ జన సందోహాన్ని చూస్తుంటే స్పష్టం అవుతుంది అన్నారు. ప్రేమ్ సాగర్ రావు నిండు నూరేళ్లు జీవించాలని వెనుకబడిన ప్రాంతమైన మంచిర్యాల జిల్లా అభివృద్ధికి వారి సేవలు అవసరమని డిప్యూటీ సీఎం తెలిపారు. రైతు భరోసా కింద తొమ్మిది రోజుల్లో తొమ్మిది వేల కోట్లు 70 లక్షల రైతు కుటుంబాల ఖాతాల్లో జమ చేశామని తెలిపారు. అధికారులకి వచ్చిన మూడు నెలల వ్యవధిలోనే 21 వేల కోట్లు రైతు రుణమాఫీ తెలిపారు. 93 లక్షల కుటుంబాలకు రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకాన్ని అమలు చేస్తున్నారు. రైతు సోదరులకు ఇన్సూరెన్స్, ప్రకృతి విపత్తుతో పంట నష్టం జరిగితే పరిహారం, రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్ తో ప్రజా ప్రభుత్వం అందిస్తుందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వివరించారు. రాష్ట్రంలోని 51 లక్షల కుటుంబాలకు 200 యూనిట్లు కొరకు ఉచిత విద్యుత్తు సరఫరా చేస్తున్నామని, ఇల్లు లేని పేదల కోసం ఐదు లక్షలతో ఇందిరమ్మ ఇల్లు నిర్మిస్తున్నాం మొదటి సంవత్సరం రాష్ట్రంలో 4.50 లక్షల ఇల్లు 22, 500 కోట్లతో ఇందిరం నిర్మాణం మొదలు పెట్టామని తెలిపారు. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం, 500 కే గ్యాస్ సిలిండర్, గత ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన షాది ముబారక్ వంటి సంక్షేమ పథకాలను కొనసాగిస్తున్నామని తెలిపారు. సంక్షేమ పథకాలకు అదనంగా 55 వేల కోట్లు ఖర్చు చేస్తున్నామని తెలిపారు.

పేద విద్యార్థులకు ఇంటర్నేషనల్ స్టాండర్డ్స్ తో విద్యను బోధించేందుకు యంగ్ ఇండియా ఇంటర్నేషనల్ స్కూల్స్ స్థాపిస్తున్నాం, రైతులకు పెట్టుబడి సాయం, చదువుకున్న యువతకు ఉద్యోగాలు, ఉద్యోగాలు రాని వారికి స్వయం ఉపాధి పథకాలు తీసుకువస్తున్నట్టు తెలిపారు. గతంలో అటవీ అధికారులతో ఇబ్బందులు పడిన గిరిజనులు వారి భూములు సాగు చేసుకునేందుకు ఇందిరా సౌర గిరిజల వికాసం పథకాన్ని ప్రభుత్వం తీసుకువచ్చిందని తెలిపారు. ఈ పథకం కింద ఉచితంగా సోలార్ పంపుసెట్లు, స్ప్రింక్లర్లు, డ్రిప్పు, ఉద్యాన శాఖ ద్వారా ఉచితంగా అవకాడో వెదురు వంటి మొక్కలను పంపిణీ చేస్తామని చెప్పారు.

ప్రజా ప్రభుత్వం మనందరికీ రూపాయి రూపాయి పోగుచేసి ప్రజల కోసమే ఖర్చు పెడతామని తెలిపారు. తనకు మదిర నియోజకవర్గమైన తో మంచిర్యాల అంటే అంతే ప్రత్యేక స్థానం తన గుండెల్లో ఉంటుందని డిప్యూటీ సీఎం తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, డీసీపీ భాస్కర్, డీసీసీ అధ్యక్షురాలు సురేఖ,పెద్ద సంఖ్యలో ప్రజలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కేసీఆర్ విజన్‌కు సీతారామా ప్రాజెక్టే సజీవ సాక్ష్యం : కేటీఆర్



**టీపీఎన్, హైదరాబాద్ :** పరిపాలన అంటే కేవలం శంకుస్థాపనలు చేయడం మాత్రమే కాదని.. అభివృద్ధి, ప్రగతి అంటే రాజకీయ హంగులు ఆర్భాటాలు ఏమాత్రం కాదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు వ్యాఖ్యానించారు. నిజమైన నాయకుడు ఒక తరం లేదా ఒక ఎన్నిక గురించి మాత్రమే ఆలోచించరని చెప్పుకొచ్చారు. తరతరాలపాటు తెలంగాణ రాష్ట్రానికి ప్రయోజనాలు కలిగించే ప్రణాళికలే నిజమైన నాయకుడి పనితనమని తెలిపారు కేటీఆర్. ఈ మేరకు సోషల్ మీడియా మాధ్యమం ఎక్స్ వేదికగా కేటీఆర్ ట్వీట్ చేశారు. అలాంటి నాయకుడు కేసీఆర్ దూరదృష్టి ఫలితంగా రెండు అద్భుత ఫలితాలను తెలంగాణ ఈరోజు సాధించిందని ఉద్ఘాటించారు. సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ కేసీఆర్ విజన్‌కు మరో జీవన సాక్ష్యమని నొక్కిచెప్పారు. సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ మోటార్లు ఆన్ చేయడంతో.. ఖమ్మం జిల్లాలోని ప్రతి ఎకరానికి, వ్యవసాయ భూమికి సాగునీరు అందుతోందని వెల్లడించారు. కేసీఆర్ హయాంలోని మరో అద్భుతం యాదాద్రి థర్మల్ ప్లాంట్. దామరచర్ల అల్ట్రా మెగా థర్మల్ పవర్ ప్లాంట్‌లోని యూనిట్ వన్‌లో 72 గంటల కోడ్‌ని విజయవంతంగా పూర్తి చేసిందని చెప్పుకొచ్చారు. తమ నాయకుడు కేసీఆర్ పాలన, విజన్ మా అందరికీ గర్వకారణమని కేటీఆర్ పేర్కొన్నారు.


## కాళేశ్వరం ప్రాజెక్టుకు ఎలాంటి ప్రమాదం లేదు : జగదీశ్ రెడ్డి

**టీపీఎన్, పెద్దపల్లి :** కాళేశ్వరం లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టును సందర్శించిన మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి, పెద్దపల్లి జిల్లాలో మాజీ రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ నివాసంలో పత్రికా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన కాంగ్రెస్ నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం యొక్క నీటిపారుదల, నీటి నిర్వహణ విధానాలపై తీవ్ర విమర్శలు చేశారు. జగదీశ్ రెడ్డి కన్నెపల్లి పంప్ హౌస్, మేడిగడ్డ, అన్నారం, సుందిల్లా బ్యారేజీలను స్వయంగా పరిశీలించినట్లు తెలిపారు. "కాళేశ్వరం ప్రాజెక్టుకు ఎలాంటి ప్రమాదం లేదు. కన్నెపల్లి పంప్ హౌస్ వద్ద నీరు ఇంకా అందుబాటులో ఉంది, మేడిగడ్డపై ఆధారపడకుండానే నీటిని తీసుకోవడం సాధ్యం," అని ఆయన స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఈ ప్రాజెక్టు విశ్వసనీయతను దెబ్బతీసేందుకు కుట్ర చేస్తోందని ఆయన ఆరోపించారు. "ఇక్కడి నుండి నీరు ఇప్పటికే నల్గొండకు చేరింది. ఇప్పటికీ నీటిని సరఫరా చేసే అవకాశం ఉంది. లోపమేమిటంటే, ప్రభుత్వానికి ఉద్దే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మరియు నీటిపారుదల శాఖ మంత్రిని అజ్ఞానులుగా విమర్శిస్తూ, "నీటి నిర్వహణ గురించి



తెలియని మంత్రి, పట్టించుకోని ముఖ్యమంత్రి వల్ల రైతులు నష్టపోతున్నారు. ప్రాజెక్టులు నిర్మిస్తున్నారు కానీ, నీటిని వ్యవసాయానికి ఉపయోగించడం లేదు," అని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. కాళేశ్వరం పంప్ హౌస్‌లను వెంటనే ఆన్ చేయాలని డిమాండ్ చేస్తూ, "కాంగ్రెస్ నాయకులకు సాధ్యం కాకపోతే, కేసీఆర్‌ను అడగండి. మేము మూడు రోజుల్లో నీటిని సరఫరా చేస్తాం," అని సవాల్ విసిరారు. రేవంత్ రెడ్డికి సూటిగా సవాల్ విసిరిన జగదీశ్ రెడ్డి, "పెన్ను, కాగితం తీసుకొని కేసీఆర్ వద్దకు రండి. నీవు కూడా అర్థం చేసుకునేలా ఆయన వివరిస్తారు. పొలాలకు నీరు చేరకపోతే ఏం చేయాలో ఆయనకు తెలుసు," అని అన్నారు.

ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల ఇప్పటికే రెండు పంట సీజన్లు వృథా అయ్యాయని, ప్రభుత్వం యొక్క తప్పిదాలను ఎండగట్టారు. "మీ దురాశ, మూర్ఖత్వం, అజ్ఞానం వల్ల రాష్ట్రం వెనక్కి వెళ్తోంది. కేసీఆర్ హయాంలో 10 ఏళ్లపాటు అంతరాయం లేని విద్యుత్ సరఫరా ఇప్పుడు అనిశ్చితంగా మారింది," అని ఆయన ఆరోపించారు. బీఆర్ఎస్ హయాంలో ఆదాయ స్థాయి ₹60,000 నుండి ₹2 లక్షలకు రెట్టింపు అయిందని, కానీ కాంగ్రెస్ పాలనలో గత ఏడాది ₹15,000 కోట్ల నష్టం వాటిల్లిందని ఆయన పేర్కొన్నారు. "రేవంత్ రెడ్డి ఒక్క రోజు కూడా కేసీఆర్ పేరు చెప్పకుండా ఉండలేదు. ఇది అన్నీ చెప్పకనే చెబుతోంది," అని ఆయన వ్యాఖ్యానించారు.



# ఘనంగా సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి బోనాల జాతర..!

**టీపీఎన్, సికింద్రాబాద్:**

సికింద్రాబాద్‌లోని ఉజ్జయిని మహంకాళి బోనాల జాతరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హాజరయ్యారు. సీఎంకు అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అర్చకులు ముఖ్యమంత్రికి వేదాశీర్వచనాలు అందించారు. సీఎం వెంట మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాస రెడ్డి ఉన్నారు. రాష్ట్రంలో ప్రజలందరికీ మంచి జరగాలని సీఎం రేవంత్ రెడ్డి అమ్మవారిని ప్రార్థించారు. సికింద్రాబాద్‌లో మహంకాళి బోనాల జాతర ఘనంగా సాగుతోంది. ఆలయం వద్ద భక్తులకు ఇబ్బందులు లేకుండా 6 వరుసలుగా క్యూలైన్లు ఏర్పాటు చేశారు. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు భారీగా తరలి వస్తున్నారు. నేడు బోనాలు, ఫలహారబండ్ల ఊరేగింపు, 14న రంగం, పోతరాజుల గావు, అంబారీపై అమ్మవారి ఊరేగింపు జరగనుంది. ఆలయ పరిసరాల్లో నగర పోలీసులు పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేశారు.

**పట్టు వస్త్రాలు, తొలి బోనం**

సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి బోనాల జాతర ఘనంగా ప్రారంభమైన సందర్భంగా తెల్లవారుజామున అమ్మవారికి మహా మంగళ హారతి ఇచ్చారు. హైదరాబాద్ జిల్లా ఇంఛార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ దంపతులు అమ్మవారిని దర్శించుకున్నారు. తెలంగాణ ప్రభుత్వం తరపున పట్టు వస్త్రాలు, తొలి బోనం సమర్పించారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాష్ట్ర ప్రజలకు మంత్రి పొన్నం బోనాల ఉత్సవ శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా మంచి వర్షాలు కురిసి, పాడి పంటలతో రైతులు సుభిక్షంగా ఉండాలని ప్రార్థించినట్లు తెలిపారు. దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ కూడా అమ్మవారికి బోనం సమర్పించారు. అమ్మవారిని బీఆర్ఎస్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్, కుటుంబసమేతంగా కేంద్రమంత్రి కిషన్ రెడ్డి, సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మా రావు దర్శించుకుని బోనం సమర్పించారు. హిమాచల్ ప్రదేశ్ గవర్నర్ దత్తాత్రేయ, మాజీ మంత్రి మల్లారెడ్డి, దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్, మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ నేరెళ్ల శారద, సింగర్ మంగ్లీ తదితరులు కూడా అమ్మవారిని దర్శించుకున్నారు. హైదరాబాద్, సికింద్రాబాద్ జంట నగరాల్లో శోభాయమానంగా జరిగే అతిపెద్ద ఉత్సవం బోనాల పండుగ. మొదటగా గోల్కొండ జగదంబ ఆలయంలో బోనాల ఉత్సవం ఆరంభమవుతుంది. అనంతరం బల్కంపేట ఎల్లమ్మ, సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి, లాల్ దర్వాజా సింహవాహిని మాత మహేశ్వరి, అక్కన్న మాదన్న మహంకాళి ఆలయాల్లో ఆషాఢం బోనాల జాతర శోభాయమానంగా జరుగుతుంది. ఉజ్జయిని మహంకాళికి నిర్వహించే బోనాల పండుగ సంబరంతో నగరంలో ఆధ్యాత్మిక బలాన్ని నింపుతుంది.



## ఎఫ్‌టీపీసీ మీడియా డైరెక్టర్‌గా చంద్రశేఖర్..!

**టీపీఎన్, సికింద్రాబాద్ :**

సికింద్రాబాద్ సీతాఫల్‌మండికి చెందిన చంద్రశేఖర్ (మున్నూరు చందు)ను ఫిలిం అండ్ టెలివిజన్ ప్రమోషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (ఎఫ్‌టీపీసీ) తెలంగాణ రాష్ట్ర మీడియా డైరెక్టర్‌గా నియమించారు. ఈ కార్యక్రమంలో ఎఫ్‌టీపీసీ జాతీయ అధ్యక్షుడు చైతన్య జంగా, ప్రధాన కార్యదర్శి వర్మ, తెలంగాణ చైర్మన్ కిరణ్ బేజారి, కళ్యాణ వెంకటేశ్వర స్వామి దేవస్థానం ఫౌండర్ అండ్ చైర్మన్ నోముల ప్రకాష్ చేతుల మీదుగా చంద్రశేఖర్‌కు నియామక పత్రం అందజేయబడింది. ఈ కార్యక్రమానికి బాలీవుడ్ నటి పూజా గంగూలీ, సినీ నటుడు శుభోదయం సుధాకర్, గాయనులు అస్మిత, రోజా భారతి, బుల్లితెర నటులు కవిత తదితరులు అతిథులుగా హాజరయ్యారు. నూతన మీడియా డైరెక్టర్ చంద్రశేఖర్‌ను శాలువాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎఫ్‌టీపీసీ తెలంగాణ చైర్మన్ కిరణ్ బేజారి మాట్లాడుతూ, "ఎఫ్‌టీపీసీ ఇండియా రాష్ట్రంతోపాటు దేశవ్యాప్తంగా సినీ రంగం, బుల్లితెర, మీడియా రంగాల్లో ఆసక్తి ఉన్న యువతకు అనేక అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తాం" అని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో న్యూస్ యాంకర్ ప్రతిభ, జర్నలిస్టు సంఘం అధ్యక్షుడు సత్యం రాంపల్లి, బీజేపీ మహిళా మోర్చా నాయకురాలు భానుమతి, యాంకర్ ఉమామహేశ్వరి తదితరులు పాల్గొని ఎఫ్‌టిపిసి ఇండియా కమిటీకి అభినందనలు తెలిపారు.

## 'సంకల్ప్ సే సిద్ధి' కార్యక్రమంలో పాల్గొన్న ఈటల రాజేందర్



**టీపీఎన్, జీడిమెట్ల:**

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో 11 సంవత్సరాల సందర్భంగా నిర్వహించిన "సంకల్ప్ సే సిద్ధి" కార్యక్రమంలో భాగంగా, బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ కుత్బుల్లాపూర్ అసెంబ్లీ నియోజకవర్గంలోని జీడిమెట్ల గ్రామంలో జూలై 13న జరిగిన మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రకృతి ఎన్విరాన్‌మెంట్ సొసైటీ సహకారంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో, గాంధీ విగ్రహం వద్ద 500 మొక్కలను పంపిణీ చేసి నాటారు. కేంద్ర మరియు రాష్ట్ర బీజేపీ యూనిట్ల మార్గదర్శకాల ప్రకారం, జూలై 5 నుండి 15 వరకు దేశవ్యాప్తంగా జరుపుకునే పర్యావరణ దినోత్సవ వేడుకల్లో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహించబడింది. ముఖ్య అతిథిగా హాజరైన ఈటల రాజేందర్‌తో పాటు, బీజేపీ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు మల్లారెడ్డి, జనరల్ సెక్రటరీ గిరివర్ధన్ రెడ్డి, కుత్బుల్లాపూర్ అసెంబ్లీ కన్వీనర్ శేఖర్ యాదవ్, 132 డివిజన్ కార్పొరేటర్ తారా చంద్ర రెడ్డి, మరియు ఇతర పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణ మరియు దేశాన్ని మరింత పచ్చగా, సుస్థిరంగా మార్చడంలో సామూహిక బాధ్యత యొక్క ప్రాముఖ్యతను నొక్కిచెప్పారు. ఈ మొక్కలు నాటే కార్యక్రమం పౌరులను పర్యావరణ సమతుల్యత మరియు వాతావరణ స్థిరత్వానికి చురుకుగా దోహదపడేలా ప్రేరేపించడానికి ఉద్దేశించబడింది.


# ఉజ్జయిని మహాకాళి ఆలయంలో ఈటల ప్రత్యేక పూజలు..!

**టీపీఎన్, సికింద్రాబాద్:**

బోనాల ఉత్సవాల సందర్భంగా చారిత్రాత్మక ఉజ్జయిని మహాకాళి ఆలయాన్ని సందర్శించి, అధిష్ఠాన దేవత అయిన మహాకాళి అమ్మవారికి ఎంపీ ఈటల రాజేందర్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఈటల రాజేందర్ మాట్లాడుతూ.. "బోనాల సంప్రదాయం యొక్క మూలాలను వివరిస్తూ, 1805లో హైదరాబాద్‌లో కలరా వ్యాధి అనేక ప్రాణాలను బలిగొన్నప్పుడు, అప్పయ్య ముదిరాజ్ ఉజ్జయిని నుండి దేవతను తీసుకొచ్చి, ప్రతిష్ఠించి, ఆ విపత్తు తొలగిపోవాలని మొదటి బోనం సమర్పించారు. నేటి, ఈ రోజు వారి ఏడవ తరం గొప్ప భక్తి, వైభవంతో బోనాల ఉత్సవాన్ని జరుపుకుంటోంది," అని తెలిపారు. బోనాల సాంస్కృతిక ప్రాముఖ్యతను గురించి ఆయన మాట్లాడుతూ, "గోల్కొండ నుండి ప్రారంభమై లాల్ దర్వాజా వద్ద ముగిసే ఈ ఉత్సవం, తెలంగాణ ఆధ్యాత్మిక, సాంస్కృతిక సంప్రదాయాలకు శక్తివంతమైన చిహ్నం. ప్రతి ఇంటిలో భక్తితో బోనం సమర్పిస్తారు," అని అన్నారు.

ఈ సందర్భంగా తన వ్యక్తిగత ప్రార్థనల గురించి ఈటల తెలిపారు: "మేము పిల్లజల్ల (చిన్న పిల్లలు) రక్షణ కోసం, ప్రజలకు సంతోషం, శ్రేయస్సు కోసం, పాడి, పంటలు సమృద్ధిగా లభించేలా ప్రార్థించాము." ఆయన ముగించుతూ, "మేము ప్రతి సంవత్సరం భక్తితో మా వాగ్దానాలను సమర్పిస్తాము. బీజేపీ యొక్క దృష్టి, ప్రజలకు సేవ, భక్తి ద్వారా నెరవేర్చాలని కోరుకుంటున్నాము," అని అన్నారు.





# నెహ్రూ జంతుప్రదర్శనశాలలో సర్వల్ క్యాట్స్ ఆవిష్కరణ

**టీపీఎన్, హైదరాబాద్ :**

నెహ్రూ జంతుప్రదర్శనశాలలో వన మహోత్సవం 2025 వేడుకల్లో భాగంగా, జూలై 13న భారీ మొక్కలు నాటే కార్యక్రమం మరియు అనేక కొత్త కార్యక్రమాలు ప్రారంభించబడ్డాయి. ప్రిన్సిపల్ చీఫ్ కన్సర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్స్ (పీసీసీఎఫ్) & హెడ్ ఆఫ్ ఫారెస్ట్ ఫోర్స్ (హెచ్ఓఎఫ్ఎఫ్) డాక్టర్ సి. సువర్ణ, ఐఎఫ్ఎస్, పీసీసీఎఫ్ (వైల్డ్‌లైఫ్) శ్రీ ఎలూసింగ్ మేరు, ఐఎఫ్ఎస్, మరియు ఇతర అటవీ అధికారులతో కలిసి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ ప్రముఖులు రెప్టైల్ హౌస్ సమీపంలో ఫైకస్ మరియు ఇతర పండ్లు, నీడనిచ్చే మొక్కలను నాటారు, హరిత కవచాన్ని పెంచే థీమ్‌ను ప్రోత్సహించారు. ఈ రోజు ఒక ప్రధాన ఆకర్షణగా, ఆఫ్రికాకు చెందిన అరుదైన విదేశీ జాతి సర్వల్ క్యాట్స్ జంటను ప్రజలకు ఆవిష్కరించారు. ఈ రెండేళ్ల వయస్సు గల పిల్లులను డాక్టర్ సి. సువర్ణ స్మాల్ క్యాట్స్ ఎన్‌క్లోజర్‌లో విడుదల చేశారు. ఈ జంతువుల చేరికతో నెహ్రూ జూ యొక్క జాతుల సంఖ్య 195కి చేరింది. డాక్టర్ సువర్ణ కొత్తగా పునరుద్ధరించబడిన ఫాసిల్ పార్క్ గార్డెన్‌ను కూడా ఉద్ఘాటించారు, ఇది తెలంగాణ రాష్ట్ర ఆకారంలో వివిధ మొక్కల జాతులతో రూపొందించబడింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, నెహ్రూ జూ యొక్క బందీ ప్రజనన విజయాన్ని ప్రశంసించారు మరియు "ఏక్ పెడ్ మా కే నామ్" (అమ్మ పేరిట ఒక చెట్టు) అనే మొక్కలు నాటే కార్యక్రమ నినాదాన్ని అందరూ అనుసరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జూ పార్క్స్ డైరెక్టర్ డాక్టర్ సునీల్ ఎస్. హిరేమఠ్, ఐఎఫ్ఎస్, మాజీ జూ అధికారులు, వెటర్నరీ సిబ్బంది, అటవీ అధికారులు, పరిపాలన సిబ్బంది పాల్గొన్నారు. ఈకార్యక్రమం తెలంగాణలో జీవవైవిధ్యం, పర్యావరణ సమతుల్యత, మరియు పర్యావరణ స్టీవార్డ్‌షిప్ పట్ల బలమైన నిబద్ధతను ప్రతిబింబించింది.



## దుండిగల్ దుర్గమ్మ తల్లి బోనాల పండగ

**టీపీఎన్, మేడ్చల్ :**

కుత్బుల్లాపూర్ దుండిగల్ మున్సిపాలిటీలో శ్రీ శ్రీ దుర్గమ్మ దేవి బోనాల పండుగ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ ముఖ్యతిధిగా పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి హారతి సమర్పించారు. అనంతరం కండ్లకోయ సాయి గీత ఆశ్రమం పిఠాధిపతి శ్రీ శ్రీ సాయికుమార్ బాబా మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ ని శాలువాతో సత్కరించి ఆశీర్వదించారు. ఈ సందర్భంగా కూన శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ దుండిగల్ దుర్గమ్మ తల్లి బోనాల పండుగలో పాల్గొనడం చాలా సంతోషంగా ఉందన్నారు. బోనాల పండుగ సందర్భంగా ఆదిశక్తి అమ్మవారు శ్రీ దుర్గమ్మ తల్లి ఆశీస్సులు దుండిగల్ ప్రజలపైన అలాగే రాష్ట్ర ప్రజలందరిపై ఉండాలని కోరుకున్నారు. తెలంగాణ రాష్ట్రంలో బోనాల పండుగకు చాలా ప్రత్యేకత ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ సిఎచ్. వేంకటేశం, జిల్లా పరిషత్ మాజీ వైస్ చైర్మన్ ప్రభాకర్ రెడ్డి, మాజీ సర్పంచ్ కావలి గణేష్, లింగం గౌడ్, ఆకుల ప్రేమ్ కుమార్, ఉదయ్, విశ్వనాథ్ గౌడ్, జక్కుల మల్లేశ్, అమరం ముత్యం రెడ్డి, కొత్తపేట శ్రీను, నవీన్, నర్సింగ రావు, బాల్ రెడ్డి, లక్ష్మణ్, సదానంద్, కోటేశ్వరరావు తో పాటు ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## అంగరంగ వైభవంగా అమ్మవారి ఘటస్థాపన..!

**టీపీఎన్, హైదరాబాద్ :** ఆషాడ మాసం బోనాల ఉత్సవాలు పురస్కరించుకొని పాతబస్తీ శాలిబండ ప్రాంతంలోని శ్రీ కాశీ విశ్వనాథ స్వామి దేవాలయం నుంచి పాతబస్తీలోని 22 ఆలయాలకు చెందిన అమ్మవారి ఘటస్థాపన సామూహిక ఊరేగింపు అంగరంగ వైభవంగా జరిగాయి. ఈ ఊరేగింపులో పోతరాజుల నృత్యాలు. ఆకట్టుకునేలా వివిధ వేషధారణతో పలువురిని ఆకర్షించాయి .లాల్ దర్వాజా మోడ్ ప్రాంతంలో భాగ్యనగర్ శ్రీ మహంకాళి బోనాల ఉత్సవాల ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటీ అధ్యక్షులు గోపిశెట్టి రాఘవేందర్ ఏర్పాటు చేసిన స్వాగత వేదికపై నుంచి ముఖ్య అతిథిగా హైదరాబాద్ ఇన్ ఛార్జ్ పొన్నం ప్రభాకర్.బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్, గౌలిపుర కార్పొరేటర్ ఆలే భాగ్యలక్ష్మి హాజరై అమ్మవారి ఘటాలకు స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి దేవాలయాల కమిటీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు .ఎక్కడ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా సౌత్ జోన్ డీసీపీ స్నేహమెహ్రా నేతృత్వంలో అదనపు డీసీపీ ఎంఏ మాజీద్, ఛత్రినాక ఏసీపీసీ హెచ్ చంద్రశేఖర్, ఛత్రినాక, మొగల్‌పుర.శాలిబండ ఇన్ స్పెక్టర్‌లతో కలిసి భారీ బందోబస్తు నిర్వహించారు.

## బోనాల సందర్భంగా ఎమ్మెల్యే మల్లారెడ్డి ప్రత్యేక పూజలు..!

**టీపీఎన్, శామీర్‌పేట్ :**



తెలంగాణ సంప్రదాయ పండుగ బోనాల పండుగ. ఆషాఢ మాసంలో తెలంగాణ రాష్ట్రమంతటా గ్రామ గ్రామాన, వాడ వాడలా ప్రజలు బోనాల పండుగను ఎంతో ఇష్టంగా జరుపుకుంటారు. ఉమ్మడి శామీర్ పేట్ మండలంలోని పలు గ్రామాల్లో బోనాల పండుగను భక్తులు ఘనంగా జరుపుకున్నారు. శామీర్ పేట్, అలియాబాద్, జగన్ గూడ, లక్ష్మాపూర్, ఉద్దెమర్రి గ్రామాలలో బోనాల పండుగను ప్రజలు సంతోషంగా జరుపుకున్నారు. బోనాల పండుగ సందర్భంగా మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి పలు గ్రామాల్లో నిర్వహించిన బోనాల పండుగలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. శామీర్ పేట్ మండలం లోని అలియాబాద్, మూడుచింతలపల్లి మండలంలోని జగన్ గూడ, లక్ష్మాపూర్ గ్రామాల్లో ఎమ్మెల్యే మల్లారెడ్డి పాల్గొన్నారు. బోనాల పండుగ కు విచ్చేసిన మల్లారెడ్డి కి గ్రామ నాయకులు ఘన స్వాగతం పలికారు. నైవేద్యాలతో కూడిన బోనాలను భక్తులు అమ్మవార్లకు సమర్పించారు.



## టీపీసీసీ డాక్టర్స్ సెల్, మెడికల్ అండ్ హెల్త్ వింగ్ చైర్మన్‌గా డాక్టర్ ఎం. రాజీవ్

**టీపీఎన్, హైదరాబాద్:**
టీపీసీసీ డాక్టర్స్ సెల్, మెడికల్ అండ్ హెల్త్ వింగ్ చైర్మన్‌గా నియమితులైన డాక్టర్ ఎం. రాజీవ్, శనివారం మంత్రి దామోదర రాజనర్సింహ గారిని వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. చైర్మన్‌గా తన నియామకానికి సహకరించిన మంత్రిగారి ఆశీస్సులు తీసుకుని, డాక్టర్ రాజీవ్ కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా మంత్రి దామోదర రాజనర్సింహ డాక్టర్ రాజీవ్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఉన్నత విద్యావంతులు రాజకీయాల్లోకి రావడం అభినందనీయమని అన్నారు. ఉస్మానియా మెడికల్ కాలేజీలో చదివిన డాక్టర్ రాజీవ్ సేవలు వైద్య రంగంలో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. రాష్ట్రంలో ప్రజారోగ్య వ్యవస్థను మరింత మెరుగుపర్చడానికి కృషి చేయాలని రాజీవ్‌కు సూచించారు. రోగ నివారణ, ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకునే విషయంలో ప్రజలకు అవగాహన కల్పించడంపై దృష్టి పెట్టాలని సలహా ఇచ్చారు. డాక్టర్లు, వైద్య సిబ్బంది సంక్షేమం కోసం ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వారికి తెలియజేసేలా కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు.




## మేడ్చల్‌లో ఓ వ్యక్తి హత్య

**టీపీఎన్, మేడ్చల్ :**
మేడ్చల్ పోలీస్ స్టేషన్ పరిధిలో భార్యాభర్తలు కలిసి ఓ వ్యక్తిని హత్య చేసిన దారుణ సంఘటన చోటుచేసుకుంది. మేడ్చల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, నిజామాబాద్‌కు చెందిన ఎదునూరి నర్సింహ అలియాస్ చిన్న (32) తన భార్య అనిత (30)తో కలిసి మేడ్చల్ మున్సిపల్ పరిధిలోని చెక్‌పోస్ట్ వద్ద నివాసం ఉంటున్నారు. వృత్తిరీత్యా వీరు కాగితాలు ఏరుకుంటూ జీవనం సాగిస్తున్నారు. మెదక్ జిల్లాకు చెందిన నర్సింహులు (37) శనివారం మధ్యాహ్నం మేడ్చల్ చెక్‌పోస్ట్ వద్ద ఉన్న వెంకటరమణ లిక్కర్ ల్యాండ్‌లో మద్యం సేవిస్తుండగా, నర్సింహ అలియాస్ చిన్న మరియు అనితలతో స్క్రాప్ విషయంలో గొడవ జరిగింది. ఈ గొడవలో చిన్న మరియు అనిత కలిసి నర్సింహులను కర్రలతో దారుణంగా కొట్టారు. దీంతో నర్సింహులు తీవ్ర గాయాలతో మృతి చెందాడు. స్థానిక వైన్ షాప్ క్యాషియర్ మహేష్ రాత్రి 8 గంటల సమయంలో నర్సింహులు మృతి చెందినట్లు గమనించి, స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న మేడ్చల్ పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం గాంధీ ఆసుపత్రికి తరలించారు. హత్యకు పాల్పడిన భార్యాభర్తలను పోలీసులు అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## ఆదిపోచమ్మ ఆలయాన్ని సందర్శించిన మహేశ్వరం బీజేపీ ఇంచార్జ్ శ్రీరాములు

**టీపీఎన్, రంగారెడ్డి జిల్లా :**
మహేశ్వరం నియోజకవర్గంలోని బడంగ్పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న నాదర్ గుల్ గ్రామ శివారులో వెలసిన ప్రాచీన ఆదిపోచమ్మ ఆలయంలో గ్రామస్థులంతా కలిసి బోనాల సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా మహేశ్వరం బీజేపీ ఇంచార్జ్ అందేలా శ్రీరాములు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో అందేలా శ్రీరాములు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, శ్రీ ఆదిపోచమ్మ తల్లి కృపతో మహేశ్వరం నియోజకవర్గ ప్రజలు మరియు నాదర్ గుల్ గ్రామ రైతులు సుఖసంతోషాలతో, శాంతితో జీవించాలని కోరుకు



న్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు చిర్ర రాజు, మర్రి ప్రభాకర్ రెడ్డి, మంత్రి మహేష్, బి. భాస్కర్ మరియు కమిటీ ఎగ్జిక్యూటివ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



## సీతారాముల కళ్యాణం కోసం కోటి గోటి తలంబ్రాల తయారీకి అంకురార్పణ

**టీపీఎన్, జయశంకర్ భూపాలపల్లి :**
భద్రాచల సీతారాముల కళ్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించబడుతుందని అందరికీ తెలిసిన విషయమే. 2026 శ్రీరామనవమి సందర్భంగా స్వామివారి కళ్యాణ మహోత్సవంలో వినియోగించే కోటి గోటి తలంబ్రాల తయారీ కోసం జయశంకర్ భూపాలపల్లి జిల్లాకు చెందిన శ్రీరామదాసు భక్త మండలి, చెల్పూర్ వారు నేడు వేదబ్రాహ్మణుల మంత్రోచ్చారణల నడుమ వడ్ల పూజ నిర్వహించి కార్యక్రమానికి అంకురార్పణ చేశారు.ఈ వడ్లను శ్రీమతి & శ్రీ రామదాసు తిరుపతమ్మతిరుపతి పుణ్య దంపతులు తమ స్వంత క్షేత్రంలో పలుమార్లు పూజలు నిర్వహించి పండిస్తారు. ఇలా పండించిన వడ్లను భక్తుల సహకారంతో అత్యంత భక్తి శ్రద్ధలతో గోటితో ఒలిచి, సీతారాముల కళ్యాణానికి తలంబ్రాలుగా వినియోగిస్తామని, ఈ కార్యక్రమాన్ని గత 9 సంవత్సరాలుగా నిర్వహిస్తున్నామని రామదాసు తిరుపతి గారు తెలిపారు. శ్రీరామదాసు భక్త మండలి, చెల్పూర్ వారు గత తొమ్మిది సంవత్సరాలుగా భద్రాచల సీతారాముల కళ్యాణం కోసం శ్రీ రామదాసు తిరుపతి గారి స్వంత క్షేత్రంలో పండించిన వడ్లను భక్తుల సహకారంతో గోటితో ఒలిచి తలంబ్రాలుగా అందజేస్తున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా నేడు స్వామివారి సన్నిధిలో పంటకు వినియోగించే విత్తనపు వడ్లకు ఆలయ పూజారులచే పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు, టెంపుల్ ఇంచార్జ్ సాయిబాబా, సీసీ శ్రీనివాసరెడ్డి, భక్త రామదాసు పదవతరం వారసుడు కంచర్ల శ్రీనివాసరావు, రామభక్తులు, ఉషారాణి, కొమ్మిడి రజిత రెడ్డి, విజయ టీచర్, రమ, అంజలి మొదలైనవారు పాల్గొన్నారు.

## మార్కండేయనగర్ పోచమ్మ తల్లి దేవాలయ కమిటీ అధ్యక్షునిగా శిరందాసు నరేందర్

**టీపీఎన్, రాజేంద్రనగర్ :**
మైలార్ దేవ్ పల్లి డివిజన్ పరిధిలోని మార్కండేయనగర్ పోచమ్మ తల్లి దేవాలయ అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేయడం జరుగుతుందని కమిటీ నూతన అధ్యక్షుడు శిరందాసు నరేందర్ తెలిపారు. ఆదివారం ఆయన కమిటీ అధ్యక్షునిగా నియమితులు అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆలయ అభివృద్ధికి కాలనీ ప్రజలను అందరినీ కలుపుకొని పని చేయడం జరుగుతుందన్నారు. అమ్మవారి ఆలయంలో భక్తులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా తన వంతుగా చర్యలు తీసుకుంటానన్నారు. కనీస మౌలిక సదుపాయలను కల్పించేలా చొరవ చూపుతానని వెల్లడించారు. శ్రీ పోచమ్మ దేవాలయ కమిటీ ముఖ్య సలహాదారులుగా ఏర్వ సత్యనారాయణ, గద్దె కృష్ణ, పగడి ముర్రి సూర్యనారాయణ, వీడెం రమేష్, పగిడిమర్రి వాసు, మునగపాటి విష్ణు, గద్దె యాదగిరి, కోట జగదీష్, వర్కల చందు, అధ్యక్షుడిగా శిరందాస్ నరేందర్ ఉపాధ్యక్షులుగా మామిడి శెట్టి శ్రీనివాస్, యాదగిరి భాస్కర్, భూసం భానుచందర్, ప్రధాన కార్యదర్శి కోట



పవన్, సహాయ కార్యదర్శి ఉడుత సురేష్, గుత్తి మల్లేష్, కోశధికారి కోట శ్యామ్, కార్యవర్గ సభ్యులు కైరం కొండ శంకర్, శిరందాసు ప్రభాకర్, అరుణ్ రెడ్డి, ఏర్వ మహేష్, ఆర్ నవీన్, బోనకుర్తి రాము, విజయ్ యాదవ్, శశిరాజ్, ముసం నరేష్, రాజు తదితరులను ఎన్నుకున్నారు.



## ధర్మ పరిరక్షణ కోసం వికారాబాద్‌లో గీతా పారాయణం ఆధ్యాత్మికోత్సవం

**టీపీఎన్, వికారాబాద్ :**
స్థానిక అనంతగిరి పరిధిలో గీతా వాహిని బృందం ఆధ్వర్యంలో, కన్యాలాల్ బాగ్ కాలనీకి చెందిన మహిళల సహకారంతో, గౌతమి కాలేజ్ ప్రాంగణంలో భగవద్గీత పూజ మరియు గీతా పారాయణం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యక్షులు శ్రీదేవి సదానంద రెడ్డి మాట్లాడుతూ.. "హిందూ ధర్మ పరిరక్షణ కోసం వికారాబాద్ జిల్లా కేంద్రంతో పాటు చుట్టుపక్కల కాలనీల్లో కూడా భగవద్గీత పారాయణం నిర్వహిస్తున్నాము. మా గురువు కీర్తిశేషులు రామకృష్ణ గురువు దివ్య ఆశీస్సులతో ఈ మహత్తర కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్తున్నాము. భగవద్గీత సారాంశం ప్రతి ఇంటికి చేరాలని గీతా వాహిని బృందం ఆకాంక్షిస్తోంది" అని తెలిపారు. వికారాబాద్ పట్టణంలోని వివిధ కాలనీల్లో గీతా పారాయణం కొనసాగుతోంది. చివరగా, మారుతి నగర్‌లోని వైభవ లక్ష్మి గుడిలో ఈ కార్యక్రమం ముగియనుంది.

## రూ.5.97 లక్షల చోరీ నగదుతో పట్టుబడ్డ పాత నేరస్తుడు..!

**టీపీఎన్, హైదరాబాద్:**
హైదరాబాద్ కమిషనర్ టాస్క్ ఫోర్స్ సౌత్ ఈస్ట్ జోన్ బృందం, రీన్ బజార్ పోలీసులతో కలిసి, పదేపదే ఆస్తి నేరాలకు పాల్పడే నిందితుడిని అరెస్ట్ చేసి, ₹5,97,800 మొత్తం చోరీ నగదును స్వాధీనం చేసుకుంది.నిందితుడు షేక్ హఫీజుద్దీన్ (22), డబీర్‌పురలోని షా కాలనీలో నివాసముంటున్న వాల్ పెయింటర్‌గా గుర్తించబడ్డాడు. గతంలో ఇలాంటి చోరీలకు జైలు శిక్ష అనుభవించినప్పటికీ, తన విలాసవంతమైన కోరికలను తీర్చుకోవడానికి, చెడు అలవాట్లకు బానిసై, నేర కార్యకలాపాలను కొనసాగించాడు.పోలీసుల వివరాల ప్రకారం, జూలై 11న మధ్యాహ్నం 2:00 గంటల సమయంలో, గంగా నగర్ నాలా వద్ద వహీదున్నిసా బేగం మసీదు సమీపంలో గుండెలు కట్టుకున్న జనసమూహాన్ని గమనించిన హఫీజుద్దీన్, ఆ గందరగోళాన్ని సద్వినియోగం చేసుకున్నాడు. నకిలీ కీని ఉపయోగించి, ఒక స్కూటీ డిక్కీని తెరిచి, అందులో ఉన్న ఒక నల్లని పాలిథీన్ బ్యాగ్‌లో పెద్ద మొత్తంలో నగదును కనుగొని, వెంటనే దొంగిలించి పరారయ్యాడు. రీన్ బజార్ పోలీసులు క్రిమినల్ కేసు నం. 108/2025, భారతీయ న్యాయ సంహిత (BNS) సెక్షన్ 303(2) కింద కేసు నమోదు చేసి, దర్యాప్తు ప్రారంభించారు. సమాచారం ఆధారంగా, టాస్క్ ఫోర్స్ మరియు రీన్ బజార్ పోలీసులు హఫీజుద్దీన్‌ను గుర్తించి అరెస్ట్ చేసి, చోరీ చేసిన నగదును స్వాధీనం చేసుకున్నారు. ఈ అరెస్ట్ ఇన్‌స్పెక్టర్ ఎస్. సైదాబాబు పర్యవేక్షణలో, సబ్ఇన్‌స్పెక్టర్లు రామారావు, ఎం. మధు మరియు వారి బృందం ప్రయత్నాలతో జరిగింది.





# ప్రేమపై కోర్సు.. అవును ఉండాల్సిందే..!

ఇంజనీర్, డాక్టర్ లేదా టీచర్ కావడానికీ కోర్సులు ఉంటాయి. మరి ప్రేమించడానికేంటి? ఇది వినడానికి విచిత్రంగా అనిపించవచ్చు కానీ వాస్తవానికి చాలా అవసరం. చదువు మనకు ఉద్యోగానికై సిద్ధం చేస్తే, ప్రేమపై కోర్సు మన జీవితానికి సిద్ధం చేస్తుంది. దీన్ని గుర్తించిన ఢిల్లీ యూనివర్సిటీ, విద్యార్థుల కోసం ప్రేమపై ప్రత్యేక సిలబస్‌తో కోర్సు ప్రవేశపెట్టింది. నేటి పరిస్థితిలో, ప్రేమపై గందరగోళంతో జీవిస్తున్న యువతకు ఇది అత్యంత అవసరం.

**ప్రేమ – శాశ్వతమైన శక్తి**

ప్రేమ అనేది సదాకాలికమైన విషయం. ప్రతి ఒక్కరూ దీనిని అనుభవిస్తారు - స్నేహం, కుటుంబం లేదా రొమాన్స్ రూపంలో. ప్రేమ వల్లే బలమైన బంధాలు, దీర్ఘకాలిక పెళ్లిళ్లు ఏర్పడతాయి. ప్రేమ జీవితాన్ని మారుస్తుంది. కానీ దీని గురించి సరిగ్గా అర్థం చేసుకోకపోతే, బాధకీ, నష్టానికీ కారణమవుతుంది. నేటి యువత ప్రేమ అంటే ఏమిటో పూర్తిగా అర్థం చేసుకోలేకపోతున్నారు. భ్రమలే ఎక్కువ, నిజమైన ప్రేమ అర్థం కాకపోవడం వల్ల అస్థిరత, భావోద్వేగ సమస్యలు తలెత్తుతున్నాయి.

**జెన్ Z – కొత్త ప్రేమ పదజాలం**

నేటి ప్రేమకి జెన్ Z తనదైన పదజాలాన్ని కల్పించింది: సిట్యుయేషన్‌షిప్, ఘోస్టింగ్, బెంచింగ్, బ్రెడ్‌క్రంబింగ్ లాంటి పదాలు ఇవాళ్టి ప్రేమలోని భావోద్వేగ రాహిత్యాన్ని సూచిస్తున్నాయి. ప్రేమను శారీరక లేదా ఆర్థిక మార్పిడి వరకు పరిమితం చేస్తున్నారు. భావోద్వేగం, మానసిక అనుబంధం తక్కువైపోతుండటమే యువత ఈ ప్రేమలో విఫలమవడానికీ, బాధపడటానికీ ప్రధాన కారణం.

**ప్రేమ – ఒక శక్తివంతమైన ప్రేరణ**

నిజమైన ప్రేమ ఒక వ్యక్తిని ప్రేరేపించే శక్తిగా మారుతుంది. ఉదాహరణకు, ఒక గ్రామీణ యువకుడు పోలీస్ ఆఫీసర్ గౌరవాన్ని చూసి ఐపీఎస్ కావాలని నిశ్చయించుకున్నాడు. కోచింగ్ సమయంలో కలిసిన యువతితో ఏర్పడ్డ ప్రేమానుభంధం అతనికి భావోద్వేగ మద్దతుగా మారింది. తన ఆర్థిక స్థితిని దృష్టిలో పెట్టుకొని కష్టపడి విజయాన్ని సాధించి, చివరికి ఆమెను పెళ్లిచేసుకున్నాడు - ఈ కథ 12th ఫెయిల్ చిత్రంగా ప్రేరణనిస్తుంది. మరో వ్యక్తి భార్య జ్ఞాపకార్థంగా కొండను కోసి రోడ్డు వేశాడు. ఇవన్నీ ప్రేమ ఎంతటి శక్తివంతమైన ప్రేరణగా మారుతుందో చూపుతున్నాయి. హార్వర్డ్ యూనివర్సిటీ పరిశోధనల ప్రకారం, ప్రేమతో కూడిన బంధాలు ఉన్నవారు ఎక్కువ ఆనందంగా, ఆరోగ్యంగా జీవిస్తారు. కానీ యువత ఈ ప్రేమ శక్తిని కొంతకాలం నెమ్మదిగా నాశనం చేసుకుంటూ తాత్కాలిక అవసరాలకు వాడుతున్నారు.

**అపరిపక్వ ప్రేమ గోతులు**

కళాశాల విద్యార్థులు తక్కువలోపే ప్రలోభాలకు లోనై, పాటలు, బహుమతులతో మొదలై, అవసరాలు తీరిన తర్వాత మోసం చేసే ప్రేమలో పడతారు. దీన్ని లవ్ బాంబింగ్ అంటారు. ఈ తతంగం మనోభంగానికి దారితీస్తుంది. మరో ప్రమాదకర మాయాజాలం క్యాట్‌ఫిషింగ్ - నకిలీ సోషల్ మీడియా ఖాతాల ద్వారా ఇతరులను మోసం చేయడం. 40 సంవత్సరాలపైబడినవారూ దీనికి గురవుతున్నారు. ఇంకా గ్యాస్‌లైటింగ్ అనే మానసిక నియంత్రణ పద్ధతిలో, ఒక వ్యక్తి మరోవారిని భావోద్వేగంగా ఒత్తిడికి గురిచేస్తూ వారిని విడివిడిగా చేస్తారు, అవమానిస్తారు. ఇవన్నీ తెలియకపోవడం వల్లే జీవితాలు నాశనమవుతున్నాయి.

మరి నిజమైన ప్రేమ అంటే ఏమిటి?

ప్రేమ అనే భావనను మనోవైద్యులు సంవత్సరాలుగా అర్థం చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. మనిషి ప్రేమలో పడటం వెనుక కారణం ఏంటి? నిజమైన ప్రేమ అంటే ఏమిటి? లైకింగ్ థియరీ, కలర్ వీల్ థియరీ, అటాచ్‌మెంట్ థియరీ, ట్రయాంగిల్ థియరీ వంటి సిద్ధాంతాలు ప్రేమను వివరిస్తాయి. కానీ ఇవాళ్టి యువత వీటిలో ఏదీ తెలుసుకోలేదు. అందుకే ప్రేమలో పదే పదే తప్పులు చేస్తున్నారు.

**నేటి పరిస్థితుల్లో అవగాహన అవసరం**

డేటింగ్ యాప్స్, డిజిటల్ కమ్యూనికేషన్ పెరిగిన ఈ రోజుల్లో సంబంధాలు మరింత క్లిష్టమయ్యాయి. ఆన్లైన్ స్టాకింగ్, భావోద్వేగ నొక్కులు, తేలికపాటి విడిపోనలు - ఇవన్నీ యువతను వేధిస్తున్నాయి. కానీ ఇలాంటి విషయాలపై మాట్లాడే వేదికలు - ఇంట్లోనూ, కళాశాలలలోనూ - లేవు. దారి తప్పిన నిర్ణయాలు, భావోద్వేగ నష్టాలు - ఇవన్నీ మార్గదర్శనం లేకపోవడం వల్లే జరుగుతున్నాయి. కోర్ట్ అనే సినిమాలో చూపించినట్లుగా, చట్టాలు చేయడం సరిపోదు - అవి నేర్పించాలి. అదే ప్రేమ విషయంలోనూ వర్తిస్తుంది. ప్రేమ పట్ల హెచ్చరికలు ఇవ్వడం కంటే ప్రేమను ఎలా అర్థం చేసుకోవాలి, పెంపొందించుకోవాలి, విఫలమైన ప్రేమతో ఎలా నెగ్గుకోవాలి, స్వార్థపూరిత సంబంధాలను ఎలా గుర్తించాలో నేర్పాలి.

**ప్రేమను జీవన నైపుణ్యాలుగా నేర్పాలి**

మన పిల్లలకు నడవడం, మాట్లాడటం, తినడం, ఇతరులతో వ్యవహరించడం నేర్పిస్తాం. అలానే ప్రేమించడం నేర్పించకూడదా? ప్రేమపై సరైన అవగాహన ఉండడం వల్ల యువత భావోద్వేగ విపత్తుల నుంచి తప్పించుకోగలుగుతారు. ప్రేమ శక్తిని సానుకూలంగా ఉపయోగించుకొని విజయవంతమైన జీవితం నిర్మించగలుగుతారు. ప్రేమపై ఒక సదుపాయమైన కోర్సు ద్వారా మనం భావోద్వేగ పరిపక్వత గల, బాధ్యతాయుతమైన తరం తయారు చేయగలుగుతాం.



బీ కృష్ణ, సీనియర్ సైకాలజిస్ట్
99854 28261



## ఓ సినిమా క్లాస్ రూమ్‌నే మార్చేసింది..!

# ఆ రాష్ట్రంలో ఇక బ్యాక్ బెంచీలు లేవు..!!





అనగనగా ఓ సినిమా..ఆ సినిమా స్ఫూర్తితో కేరళ రాష్ట్రంలో క్లాస్ రూం స్టైల్ మారిపోయింది. కొల్లం జిల్లాలోని ఆర్.వి.వి సెకండరీ హయ్యర్ స్కూల్‌కు విద్యార్థులు వెళ్లి క్లాస్‌రూమ్‌లోకి అడుగు పెట్టి ఆశ్చర్యపోయారు. ఎందుకంటే అక్కడ బెంచీలు ఒకదాని వెనుక ఒకటి లేవు. బెంచీలన్నీ రౌండ్‌గా వేసున్నాయి. పాపినిశ్శేరిలోని స్కూల్, అదూర్‌లోని స్కూల్, తూర్పు మంగడ్‌లోని స్కూల్, పాలక్కాడ్‌లోని స్కూల్... ఈ స్కూళ్లన్నింటిలోనూ విద్యార్థులకు ఇదే ఆశ్చర్యం. కారణం... అక్కడ కూడా క్లాస్‌లలో బెంచీలు ఒకదాని వెనుక ఒకటి లేవు. చుట్టూ వేసి ఉన్నాయి. గత నెల రోజులుగా కేరళలోని ఒక్కోబడి ఒక్కోబడి ఈ మార్పు చేసుకుంటూ వస్తోంది.


**ఈ మార్పుకు కారణం 'శనార్ధి శ్రీకుట్టన్' సినిమా**


కేరళ రాష్ట్రంలో ఉన్నట్టుండి అక్కడ తరగతి గదులలో బ్యాక్ బెంచీలన్నీ రౌండ్ బెంచీలవడానికి కారణం రిలీజైనప్పుడు ఎవరూ పట్టించుకోని ఒక సినిమా. నెల క్రితం ఓటీటీలోకి వచ్చాక అందరూ దాన్నే చూస్తున్నారు. ఆ చూసే వారిలో విద్యార్థులు, టీచర్లు, పాఠశాల కరెస్పాండెంట్‌లు, తల్లిదండ్రులు ఉన్నారు... వారందరినీ ఆ సినిమా కదిలించింది. అందుకే వారందరూ క్లాస్‌రూమ్‌లో బ్యాక్‌బెంచ్ ఉండకూడదని నిశ్చయించుకున్నారు. నిజమే. క్లాస్‌రూమ్‌లో బ్యాక్‌బెంచ్ ఎందుకు? అంటూ ఆ సినిమా స్ఫూర్తితో క్లాస్ రూమ్ స్టైల్ మార్చేశారు.

సినిమా కథ...క్లుప్తంగా చెప్పాలంటే కె.ఆర్. నారాయణన్ అప్పర్ ప్రైమరీ స్కూల్, కారెట్టు, తిరువనంతపురం. ఈ పల్లెటూరు స్కూల్లోని ఏడో తరగతి సి సెక్షన్‌లో జరిగే సినిమా కథే 'శనార్ధి శ్రీకుట్టన్'. శ్రీకుట్టన్ అనే కుర్రవాడు ఇంట్లోని పరిస్థితుల వల్ల రోజూ స్కూల్‌కి లేట్‌గా వస్తుంటాడు. తను వచ్చేసరికి ముందు బెంచీలన్నీ ఫిల్ అవడం వల్ల తప్పని పరిస్థితుల్లో బ్యాక్‌బెంచ్‌లో కూచుంటుంటాడు. వాడికి ముగ్గురు ఫ్రెండ్స్. వీళ్లంతా అల్లరి గ్యాంగ్ అని క్లాస్‌లో ఫ్రంట్ బెంచ్‌లో కూచునేవారి అభిప్రాయం. నిజానికి ఏ క్లాస్ రూం అయినా లాస్ట్ బెంచ్ స్టూడెంట్స్ పై సహజంగా అందరికీ ఉండే అభిప్రాయం కూడా ఇదే. క్లాస్‌కు వచ్చే ఒక ఉపాధ్యాయుడైతే వీరి మీద పగపడతాడు. వీరు దేనికీ పనికి రారన్నది ఆ స్కూల్ టీచర్ల అభిప్రాయం. ఇక్కడే కథ మలుపు తిరుగుతుంది. శ్రీకుట్టన్ స్కూల్ ఎలక్షన్‌లో నిలబడాలనుకుంటాడు. వీడి మీద పోటీగా ఫ్రంట్ బెంచ్‌లో కూచునే అంబడి అనే కుర్రవాడు నిలబడతాడు. ఎవరు గెలుస్తారు అనేది కథ. క్లాసురూముల్లో వివక్ష ఎన్ని రూపాల్లో ఉంటుంది... వివక్షకు కారణమైన నిర్మాణం ఎలా ఉంటుంది... క్లాస్‌రూమ్‌లోనే వివక్ష పాటించిన విద్యార్థి బయటకు వెళ్లాక పాటించడని గ్యారంటీ ఏమిటీ... పైకి ఇదే కథ అనిపించినా దీనిని ముందు నుంచే మార్చాలి అని దర్శకుడు వినేష్ విశ్వనాథ్ చెప్పదలుచుకున్నాడు...చాలా బాగా చెప్పాడు.

**1996లో కేంద్రం చెప్పినా...**

క్లాస్‌రూమ్‌లో విద్యార్థుల సీటింగ్ వారిలో వివక్షకు కారణం కాకూడదని, పిల్లల తెలివితేటలు... ఆర్థిక స్థితి... ప్రవర్తనను ఆధారంగా ముందు బెంచీలకు కొందరిని, వెనుక బెంచీలకు కొందరిని పరిమితం చేయకూడదని 1996లో కేంద్ర ప్రభుత్వం ఆరు రాష్ట్రాలను మోడల్‌గా తీసుకుని మార్పులకై ప్రతిపాదించింది. అయితే ఆ మార్పులను ఎవరూ పట్టించుకోలేదు. మన దేశంలో స్కూళ్లు మొదలైనప్పటి నుంచి 'మొద్దు'లుగా భావించే పిల్లలను వెనుక కూచోబెట్టడం టీచర్లకు అలవాటైపోయింది. వెనుక కూచుని వెనుకబడితే మళ్లీ వారిదే తప్పుగా నిలబెట్టడం కూడా ఆనవాయితీనే. విద్యార్థిగా పొందే గౌరవం వెనుక బెంచీ విద్యార్థులకు చాలామందికి ఉండదు. ఈ పరిస్థితి మారాలని ఒక వెనుకబెంచీ కుర్రాడిని హీరోగా చేసి అతనిలోని తెలివితేటలను, చురుకుదనాన్ని చూపుతూ నిరూపించాడు దర్శకుడు ఈ సినిమాలో. అందుకే అది కేరళ బడుల్లో కదలిక తెచ్చింది. ఇక దేశం మొత్తం ఇలాంటి సినిమాలో ఆలోచనలు వచ్చి మార్పు తేవాల్సి ఉంటుంది. మార్పు మంచిదైతే అందరికీ మంచే కదా?





## నబా చిరుత మృతిపై పలు అనుమానాలు

**టీపీఎన్, కునో నేషనల్ పార్క్ :**

భారత ప్రభుత్వం చేపట్టిన ప్రాజెక్ట్ చీతా కింద నమీబియా నుంచి కునో నేషనల్ పార్క్కు తీసుకువచ్చిన ఎనిమిదేళ్ల ఆడ చిరుత తీవ్ర గాయాలతో చనిపోయింది. వేటాడే ప్రయత్నంలో తీవ్రగాయాలైన వారం తర్వాత చనిపోయిందని అటవీశాఖ అధికారులు తెలిపారు. చికిత్స పొందినప్పటికి కోలుకోలేక పోయిందని చీతా ప్రాజెక్ట్ ఫీల్డ్ డైరెక్టర్ ఉత్తమ్ శర్మ అన్నారు. నమీబియా నుంచి తీసుకువచ్చిన చిరుతల్లో నబా ఒకటి. రెండు దశల్లో కునో నేషనల్ పార్క్కు విదేశాల నుంచి చిరుతలను తీసుకువచ్చారు. మొదటి బ్యాచ్ 2022 సెప్టెంబర్ లో రెండవ బ్యాచ్ ఫిబ్రవరి 2023లో దక్షిణాఫ్రికా నుంచి తీసుకువచ్చారు. వీర , నిర్వా అనే రెండు ఆడ చిరుతలు కూడా ఇటీవలే పిల్లలకు జన్మనిచ్చాయి. నభా మరణానికి ఖచ్చితమైన కారణాన్ని తెలుసుకోవడానికి పోస్ట్‌మార్టం నివేదిక కోసం వెయిట్ చేస్తున్నారు అధికారులు.



## నవీన్ పట్నాయక్‌కు ఘన స్వాగతం పలికిన బీజేడీ

**టీపీఎన్, ,భువనేశ్వర్ :**

బిజు జనతాదళ్ (బిజెడి) పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ శనివారం ఒడిశా రాజధానికి తిరిగి వచ్చారు. ఇటీవల ఆయన అనారోగ్యానికి గురికావడంతో ముంబైలో శస్త్రచికిత్స చేసుకుని ఒడిశాకు తిరిగి వచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా వందలాది మంది పార్టీ కార్యకర్తలు బిజు పట్నాయక్ అంతర్జాతీయ విమానాశ్రయం , పట్నాయక్ నివాసానికి భారీగా తరలివచ్చారు. నవీన్ పట్నాయక్ ఇంటికి వెళ్లే మార్గంలో ఆయనకు దారిపొడవునా ఘన స్వాగతం పలికారు. అసెంబ్లీలో ప్రతిపక్ష నాయకుడు అయిన పట్నాయక్ జూన్ 22న ముంబైలోని ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో ఆపరేషన్ చేయించుకున్నారు. సోమవారం ఆసుపత్రి నుండి డిశ్చార్జ్ అయ్యారు. ఒడిశాకు తిరిగి రావడానికి ముందు ఒక వారం పాటు మందులు తీసుకున్నాడు. బిజెడి అధినేతకు స్వాగతం పలికేందుకు ఎమ్మెల్యేలు, ఎంపీలు, సీనియర్ నాయకులు సహా పలువురు బిజెడి నాయకులు విమానాశ్రయంకు చేరుకున్నారు. ఒడిశాను అభివృద్ధి పథంలో నడిపించిన నవీన్ పట్నాయక్ పట్ల ప్రజలకు ఉన్న ప్రేమను ఈ జనసమూహమే నిదర్శనంగా నిలుస్తుంది.



## వచ్చేవారం చైనా పర్యటనకు జై శంకర్

**టీపీఎన్, న్యూఢిల్లీ :**

LAC ప్రతిష్టంభన తర్వాత భారత విదేశాంగ మంత్రి జైశంకర్ తొలిసారి వచ్చే వారం చైనాను సందర్శించనున్నారు. SCO విదేశాంగ మంత్రుల మండలి సమావేశం ఈనెల 15న టియాంజిన్‌లో జరుగుతుంది. ఈ సమావేశానికి జైశంకర్ హాజరుకానున్నారు. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ SCO రక్షణ మంత్రుల శిఖరాగ్ర సమావేశానికి చైనాను సందర్శించిన దాదాపు రెండు వారాల తర్వాత, విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ వచ్చే వారం షాంఘై సహకార సంస్థ (SCO) విదేశాంగ మంత్రుల సమావేశంలో పాల్గొనడానికి చైనాలోని టియాంజిన్‌కు వెళ్లనున్నారు. SCO విదేశాంగ మంత్రుల మండలి సమావేశం జూలై 15న టియాంజిన్‌లో జరుగుతుందని చైనా విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి ఒక ప్రకటనలో తెలిపారు, వార్తా సంస్థ PTI నివేదించింది ."వివిధ రంగాల్లో SCO సహకారం, అంతర్జాతీయ , ప్రాంతీయ సమస్యలపై అభిప్రాయాలను పంచుకుంటారని చైనా విదేశాంగ మంత్రిత్వ శాఖ పేర్కొంది.



## పార్లమెంట్ వర్షా కాల సమావేశాలపై కాంగ్రెస్ కసరత్తు

**టీపీఎన్, న్యూఢిల్లీ :**

రాబోయే పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో కేంద్ర ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టేందుకు కాంగ్రెస్ వ్యూహాలను రచిస్తోంది.కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నాయకురాలు సోనియా గాంధీ అధ్యక్షత కీలక సమావేశం నిర్వహించారు. ఈ భేటీలో దేశంలో నెలకొన్న రాజకీయ పరిస్థితులు..పార్లమెంట్ సమావేశాల్లో అనుసరించాల్సిన అంశాలపై చర్చించినట్టు తెలుస్తోంది. బీహార్‌లో ఎన్నికల సంఘం స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) చేపట్టడంపై ప్రతిపక్ష పార్టీలు తీవ్ర ఆందోళనలు వ్యక్తం చేస్తాయని భావిస్తున్నారు. అలాగే, పహల్గామ్ దాడి, ఆపరేషన్ సిందూర్ తర్వాత జరిగిన దౌత్యపరమైన చర్యలపై చర్చ జరగాలని కాంగ్రెస్ డిమాండ్ చేస్తోంది. పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ఈనెల 21న ప్రారంభమై ఆగస్టు 21 వరకు కొనసాగుతాయని ప్రభుత్వం ప్రకటించింది, ఇది ముందుగా అనుకున్న దానికంటే ఒక వారం ఎక్కువ సమయం.కాంగ్రెస్ వ్యూహాన్ని ఖరారు చేయడానికి సోనియా గాంధీ అధ్యక్షతన ఈనెల 15న సమావేశం కానున్నారు.

ఏప్రిల్ 22న పహల్గామ్‌లో జరిగిన ఉగ్రవాద దాడికి ప్రతిస్పందనగా భారత సాయుధ దళాలు పాకిస్తాన్‌లోని ఉగ్రవాద స్థావరాలపై జరిపిన ఆపరేషన్ సిందూర్ దాడిపై చర్చకు ప్రతిపక్షం డిమాండ్ చేస్తోంది. అణు యుద్ధాన్ని నివారించడానికి భారతదేశంపాకిస్తాన్ వివాదంలో మధ్యవర్తిత్వం వహించినట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన వాదనలపై ప్రతిపక్ష పార్టీలు ప్రభుత్వం నుండి సమాధానాలు కోరుతున్నాయి. గత నెలలో జరిగిన ఫోన్ కాల్‌లో, భారతదేశం ఎప్పుడూ మధ్యవర్తిత్వాన్ని అంగీకరించలేదని, భవిష్యత్తులో కూడా దానిని అంగీకరించదని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ట్రంప్ వాదనలను ప్రభుత్వం తిరస్కరించింది.

## ఛత్తీస్‌గఢ్‌లో 23 మంది మావోయిస్టులు లొంగుబాటు

**టీపీఎన్, సుక్మా :**

ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మాలో 23 మంది మావోయిస్టులు పోలీసుల ముందు లొంగిపోయారు. సరెండర్ అయిన వారిలో డివిజనల్ కమిటీ సభ్యుడు , మావోయిస్టు అగ్ర నాయకుడు మద్వి హిద్మా గార్డు కమాండర్ కూడా ఉన్నారు. వీరికి రూ.1.18 కోట్ల నజరానా ప్రకటించారు. భారత కమ్యూనిస్ట్ పార్టీ (మావోయిస్ట్) సాయుధ విభాగమైన పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ (PLGA) యొక్క బలీయమైన బెటాలియన్ 1 నుండి ఎనిమిది మంది కఠినమైన మావోయిస్టులు లొంగిపోయిన వారిలో ఉన్నారు. లొంగిపోయిన వారిలో లోకేష్ అలియాస్ పొడియం భీమ (35) అనే డివిజనల్ కమిటీ సభ్యుడు (DVCM) కూడా ఉన్నాడు. 2007 నుండి, అతను బస్తర్ ప్రాంతంలో కనీసం తొమ్మిది దాడుల కేసుల్లో పాల్గొన్నాడు, దీనివల్ల అనేక మంది భద్రతా సిబ్బంది మరణించారని సుక్మా పోలీసు సూపరింటెండెంట్ కిరణ్ చవాన్ అన్నారు. లొంగిపోయిన మరో మావోయిస్టును రమేష్ అలియాస్ కల్మ (35)గా గుర్తించారు, ఇతను మావోయిస్టు అగ్ర నాయకుడు మద్వి హిద్మా గార్డు కమాండర్. ఇద్దరికీ ఒక్కొక్కరికి రూ.8 లక్షల బహుమతి ఉంది. 2024 నుంచి నక్సల్ వ్యతిరేక కార్యకలాపాలు తీవ్రతరం అయిన తర్వాత, 1,450 మందికి పైగా మావోయిస్టులు పోలీసులకు లొంగిపోయారు. వీటి వెనుక అనేక అంశాలు ఉన్నాయని చవాన్ అన్నారు. లొంగిపోయిన మావోయిస్టులు కూడా గిరిజనులపై జరిగిన హింసను ఇష్టపడలేదని చవాన్ అన్నారు. ప్రతి మావోయిస్టుకు లొంగిపోయిన మొత్తంగా రూ. 50,000 ఇవ్వడంతో పాటు నైపుణ్య శిక్షణ కూడా పొందుతారు.



## వచ్చే ఐదేళ్లలో కోటి మంది యువతకు ఉద్యోగావకాశాలు

**టీపీఎన్, బీహార్ :**

ఈ ఏడాది చివర్లో జరగనున్న అసెంబ్లీ ఎన్నికలకు నేపథ్యంలో బీహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్ ప్రజలకు వరాల జల్లు కురిపిస్తున్నారు. మళ్లీ అధికారంలోకి వచ్చే రాబోయే ఐదేళ్లలో కోటి మంది యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. యువతకు స్వయం ఉపాధి అవకాశాలను కల్పించడానికి నైపుణ్యాభివృద్ధి శిక్షణ ఇవ్వడానికి రాష్ట్ర ప్రభుత్వం జననాయక్ కర్పురి ఠాకూర్ నైపుణ్య విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేస్తుందని ఆయన అన్నారు. రాబోయే ఐదు సంవత్సరాలకు, కోటి మంది యువతకు ప్రభుత్వ ఉద్యోగాలు , ఉపాధి అవకాశాలను కల్పించడం ద్వారా 202025 లక్ష్యాన్ని రెట్టింపు చేయాలని తాము లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు.. దీనిని సాధించడానికి, ప్రైవేట్ రంగంలో, ముఖ్యంగా పారిశ్రామిక ప్రాంతాలలో ఉపాధి అవకాశాలు కూడా సృష్టించబడతాయి. దీని కోసం ఒక ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేస్తున్నామని ఎక్స్ లో ఒక పోస్ట్‌లో తెలిపారు.రాష్ట్రంలో ఇప్పటివరకు 10 లక్షల మంది యువతకు ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించామని.. ప్రైవేట్ రంగంలో దాదాపు 39 లక్షల మందికి ఉపాధి కల్పించామని తెలిపారు. మొత్తంగా 50 లక్షల మందికి పైగా యువతకు ప్రభుత్వ ఉద్యోగాలు..ఉపాధి కల్పించామనే చెప్పడానికి తాను గర్వంగా ఫీలవుతున్నాయని చెప్పారు. 2005 నుంచి 2020 మధ్య బీహార్‌లోని 8 లక్షల మంది యువతకు ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించామని నితీష్ కుమార్ పేర్కొన్నారు.





## తమిళనాడులో గూడ్స్ రైలులో మంటలు

**టీపీఎన్, తిరువళ్లూరు :**

తమిళనాడులో ఘోర రైలు ప్రమాదం జరిగింది. తిరువళ్లూరులోని చెన్నైఅరక్కోణం మార్గంలో ఓ గూడ్స్‌రైలు భారీ ప్రమాదానికి గురైంది. డీజిల్ ట్యాంకరుతో వెళ్తున్న రైలుకు మంటలు అంటుకున్నాయి. మొత్తం నాలుగు వ్యాగన్లు మంటల్లో చిక్కుకున్నాయి. నల్లని దట్టమైన పొగలు అంటుకున్నాయి. సమాచారం అందుకున్న వెంటనే రైల్వే, అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశాయి. అయితే ఈ ఘటనలో ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగలేదని రైల్వే అధికారులు తెలిపారు. గూడ్స్ రైలులో పెద్ద ఎత్తున ఇంధనం ఉండటంతో అప్రమత్తమైన అధికారులు చెన్నైఅరక్కోణం మార్గంలో అన్ని రైళ్లను తాత్కాలికంగా నిలిపివేశారు. ప్రమాదానికి సంబంధించిన ఫొటోలు, వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. అగ్ని ప్రమాదానికి గల కారణాలు, నష్టాన్ని అంచనా వేసేందుకు అధికారులు దర్యాప్తు ప్రారంభించారు.



# దలైలామా వారసుడి ఎంపికపై చైనా ఆగ్రహం ఎందుకు?

దలైలామా వారసుడి అంశాన్ని భారత దేశం , చైనా మధ్య సంబంధాలలో ఒక ముల్లులా అభివర్ణించారు చైనా రాయబార కార్యాలయం ప్రతినిధి. దలైలామా పునర్జన్మ గురించి కొంతమంది భారతీయ నిపుణులు, విద్యావేత్తలు తప్పుడు ప్రకటనలు చేశారని అన్నారు. టిబెటన్ బౌద్ధుల ఆధ్యాత్మిక నాయకుడు దలైలామా తన 90వ పుట్టినరోజును హిమాచల్ ప్రదేశ్‌లోని ధర్మశాలలోని సుగ్లఖాంగ్ ఆలయ సముదాయంలో బౌద్ధ సమాజ ప్రజల మధ్య జరుపుకున్నారు. కేంద్ర మంత్రులు కిరణ్ రిజిజు, రాజీవ్ రంజన్ సింగ్, అరుణాచల్ సీఎం పెమా ఖండు, సిక్కిం మంత్రి సోనమ్ లామా ఈ పుట్టినరోజు వేడుకలకు హాజరయ్యారు. దలైలామా పుట్టినరోజు సందర్భంగా భారత ప్రభుత్వ ప్రతినిధులు అక్కడ ఉండటంపై చైనా ఆగ్రహం వ్యక్తం చేస్తోంది. దలైలామా వారసుడి అంశం చైనా, భారతదేశం మధ్య సంబంధాలలో అడ్డంకిగా ఉందని ఢిల్లీలోని చైనా రాయబార కార్యాలయం ఆదివారం అభివర్ణించింది. 2020 సరిహద్దు ఘర్షణల తర్వాత భారత విదేశాంగ మంత్రి తొలిసారిగా చైనాను సందర్శించడానికి సిద్ధమవుతున్న తరుణంలో ఈ ప్రకటన వెలువడింది. తన వారసుడిని ఎన్నుకోవడంలో చైనాకు ఎటువంటి పాత్ర ఉండదని తన పుట్టినరోజు సందర్భంగా దలైలామా స్పష్టం చేశారు. మరో 30 నుంచి 40 సంవత్సరాలు జీవించాలనే కోరికను ఆయన వ్యక్తం చేశారు. ఒక గొప్ప సన్యాసి మరణించినప్పుడు, అతని ఆత్మ మరొకరిలో పునర్జన్మ పొందుతుందని టిబెటన్లు నమ్ముతారు. కానీ దలైలామా తదుపరి వారసుడిని తమ నాయకుల ఆమోదంతో మాత్రమే నిర్ణయిస్తామని చైనా చెబుతోంది.దలైలామా 1959లో చైనా పరిపాలనా టిబెట్ నుండి పారిపోయి భారతదేశంలో ఆశ్రయం పొందారు. అప్పటి నుండి, ఆయన భారతదేశంలో నివసిస్తున్నారు. చైనా ప్రభుత్వానికి వ్యతిరేకంగా తన స్వరాన్ని వినిపిస్తున్నారు. భారతదేశంలో సుమారు 70 వేల మంది టిబెటన్ శరణార్థులు నివసిస్తున్నారు.

# బంగ్లాదేశ్‌లో ఓ వ్యాపారి దారుణ హత్య




**టీపీఎన్, ఢాకా :**

బంగ్లాదేశ్ రాజధాని ఢాకాలో ఓ హిందూ వ్యాపారవేత్తను కాంక్రీట్ స్లాబ్‌తో కొట్టి చంపారు దుండగులు. అనంతరం మృత దేహంపై నృత్యం చేస్తున్నవీడియో సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. ఈ నేపథ్యంలో దేశవ్యాప్తంగా భారీగా నిరసనలు జరిగాయి. వందలాది మంది విద్యార్థులు వీధుల్లోకి వచ్చి తాత్కాలిక ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ప్లకార్డులు ప్రదర్శించారు. లాల్ చంద్ సోదరి మంజురా బేగం కొత్వాలి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు పోలీసులు. ఇందులో 19 మంది నిందితులతో పాటు 15 నుంచి 20 మంది గుర్తుతెలియని వ్యక్తులను కూడా నిందితులుగా చేర్చారు. పోలీసులు ఇప్పటివరకు 5 మందిని అరెస్టు చేశారు, వీరిలో ఇద్దరు అక్రమ ఆయుధాలను కలిగి ఉన్నట్లు కూడా గుర్తించారు.

# అమెరికా, జపాన్, దక్షిణకొరియాలకు రష్యా వార్నింగ్

- **ఉత్తరకొరియా జోలికి వస్తే చూస్తూ ఊరుకోం**



ఉత్తర కొరియాను లక్ష్యంగా చేసుకుంటే తీవ్ర పరిణమాలు ఉంటాయని అమెరికా, జపాన్, దక్షిణ కొరియాలను రష్యా హెచ్చరించింది. ఉత్తర కొరియా అణు కార్యక్రమానికి ప్రతిస్పందనగా అమెరికా, జపాన్ , దక్షిణ కొరియా తమ త్రైపాక్షిక సైనిక విన్యాసాలను ముమ్మరం చేసిన సమయంలో ఈ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. శుక్రవారం మూడు దేశాలు కొరియా ద్వీపకల్పం సమీపంలో ఉమ్మడి వైమానిక విన్యాసాలు నిర్వహించాయి. దీనిలో అణ్వాయుధాలను మోసుకెళ్లగల అమెరికన్ బాంబర్లు కూడా పాల్గొన్నాయి. రష్యా విదేశాంగ మంత్రి సెర్గీ లావ్‌రోవ్ శనివారం తూర్పు ఉత్తర కొరియా నగరమైన వోన్సాన్‌లో అమెరికా నేతృత్వంలోని భద్రతా కూటమికి వ్యతిరేకంగా తీవ్ర హెచ్చరిక జారీ చేశారు. ఉత్తర కొరియాకు వ్యతిరేకంగా ఎటువంటి సైనిక కూటమికి దూరంగా ఉండాలని అమెరికా, దక్షిణ కొరియా, జపాన్‌లకు లావ్‌రోవ్ వార్నింగ్ ఇచ్చారు. ఉత్తర కొరియా నాయకుడు కిమ్ జోంగ్ ఉన్‌ను కలిసిన తర్వాత ఆయన ప్రకటన వెలువడింది. ఉత్తర కొరియా లేదా రష్యాకు వ్యతిరేకంగా కూటమిని నిర్మించడానికి ఉపయోగించకూడదని ఉత్తర కొరియా విదేశాంగ మంత్రి చో సన్ హుయ్‌తో చర్చల తర్వాత లావ్‌రోవ్ విలేకరుల సమావేశంలో హెచ్చరించారు. ఉత్తర కొరియా ఈ సైనిక విన్యాసాలను దాడికి సన్నాహకంగా భావిస్తోంది. అందుకే అది తన అణ్వాయుధాలను ఆత్మరక్షణ సాధనంగా అభివర్ణిస్తోంది. ఈ విషయంపై లావ్రోవ్ మాట్లాడుతూ ఉత్తర కొరియా అణు కార్యక్రమం దాని శాస్త్రవేత్తల కృషి ఫలితమే. వారి అణు అభివృద్ధి వెనుక గల కారణాలను మేము అర్థం చేసుకున్నామని.. గౌరవిస్తామని అన్నారు.ఈ సమావేశంలో, ఉత్తర కొరియా విదేశాంగ మంత్రి చో ఉక్రెయిన్ యుద్ధంలో రష్యాకు తమ దేశం బేషరతుగా మద్దతు ఇస్తుందని పునరుద్ఘాటించారు. రష్యాలోని కుర్స్క్ సరిహద్దు ప్రాంతంలో ఉక్రెయిన్ చొరబాట్లను ఆపడంలో ఉత్తర కొరియా దళాల సహకారానికి లావ్రోవ్ కృతజ్ఞతలు తెలిపారు.గత సంవత్సరాల్లో ఉత్తర కొరియా , రష్యా మధ్య సైనిక , ఆర్థిక సహకారం మరింతగా పెరిగింది. ఉత్తర కొరియా రష్యాకు ఆయుధాలు , మందుగుండు సామగ్రిని అందిస్తుంది, అయితే రష్యా సైనిక సాంకేతికత, ఆర్థిక సహాయాన్ని అందిస్తుంది. దీని వలన రష్యా ఉత్తర కొరియాకు అటువంటి సున్నితమైన సాంకేతికతను అందించవచ్చని, ఇది దాని అణు , క్షిపణి కార్యక్రమాన్ని మరింత ప్రమాదకరంగా మారుస్తుందని అమెరికా, జపాన్ , దక్షిణ కొరియా ఆందోళన వ్యక్తం చేశాయి.లావ్రోవ్ పర్యటన వోన్సాన్ నగరంలో జరిగింది, అక్కడ ఉత్తర కొరియా ఇటీవల 20,000 మందికి వసతి కల్పించగల ఒక గొప్ప సముద్ర రిసార్ట్‌ను ప్రారంభించింది. రష్యన్ పర్యాటకులు ఇక్కడికి రావాలని కోరుకుంటారని నాకు ఖచ్చితంగా తెలుసు. విమాన ప్రయాణంతో సహా వారిని ఇక్కడికి తీసుకురావడానికి మేము సాధ్యమైన ప్రతి సౌకర్యాన్ని అందిస్తామని సమావేశం ప్రారంభంలో లావ్రోవ్ అన్నారు.ఉత్తర కొరియా నాయకుడు కిమ్ జోంగ్ ఉన్ తన శిథిలావస్థలో ఉన్న ఆర్థిక వ్యవస్థను పర్యాటకం ద్వారా పునరుద్ధరించాలనే ప్రణాళికలో వోన్సాన్‌కల్మా పర్యాటకం అభివృద్ధిని ప్రోత్సహిస్తున్నారు. అయితే, ఉత్తర కొరియా తన సరిహద్దులను ఎప్పుడు పూర్తిగా తెరుస్తుందో, పాశ్చాత్య పర్యాటకులను స్వాగతిస్తుందో ఇంకా స్పష్టంగా తెలియలేదు.

# శాంతియుత ప్రయోజనాల కోసం మా అణు కార్యక్రమం

**టీపీఎన్, పాకిస్తాన్ :**



భారత్ ఇటీవల చేపట్టిన ఆపరేషన్ సిందూర్ సమయంలో అణు ఉద్రిక్తతలు దారితీశాయని.. పాకిస్థాన్ అణుదాడికి సిద్ధమైందని వచ్చిన కథనాలపై ఆ దేశ ప్రధానమంత్రి షెహబాజ్ షరీఫ్ స్పందించారు. అవన్నీ అసత్య ప్రచారమేనని కొట్టిపారేశారు. పాకిస్థాన్ అణ్వాయుధ కార్యక్రమం శాంతియుత ప్రయోజనాల కోసం, ఆత్మరక్షణ కోసమే తప్ప, ఇతరులపై దాడుల కోసం కాదని ఆయన స్పష్టం చేశారు. భారత్, పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతలు పెరుగుతున్న నేపథ్యంలో ఈ ప్రకటన ప్రాధాన్యం సంతరించుకుంది. గతంలో పాకిస్థాన్ నుంచి "అణు బ్లాక్‌మెయిల్" కుట్రలు జరిగాయని ఆరోపణలు రావడంతో, భారత్ వాటిని ద్వైపాక్షికంగా ఎదుర్కొంటామని శపథం చేసింది. ఆపరేషన్ సిందూర్ సమయంలోనే, భారత్ సింధు నదీ జలాల ఒప్పందాన్ని తాత్కాలికంగా నిలిపివేయడంతో ఉద్రిక్తతలు మరింత పెరిగాయి. దీనికి ప్రతిస్పందనగా, పాకిస్తాన్ ప్రతీకారం తీర్చుకుంటామని హెచ్చరించింది. ఈ ప్రకటన అణు బెదిరింపుగానే భావించాల్సి ఉంటుందని విస్తృతంగా ప్రచారం జరిగింది.ఏప్రిల్ 22న పహల్గామ్ దాడికి ప్రతీకారంగా మే 7న భారత్ 'ఆపరేషన్ సిందూర్'ను ప్రారంభించింది. ఈ ఆపరేషన్‌లో పాకిస్థాన్, పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్‌లోని ఉగ్రవాద స్థావరాలను లక్ష్యంగా చేసుకుని సైనిక చర్యలు చేపట్టారు. ఈ నేపథ్యంలోనే షెహబాజ్ షరీఫ్ అణ్వాయుధాల గురించి చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశమయ్యాయి. పాకిస్థాన్ యొక్క అణ్వాయుధ సామర్థ్యం దేశ భద్రతకు కట్టుబడి ఉందని, కానీ అది దౌర్జన్యం చేసేందుకు ఉద్దేశించినది కాదని ఆయన పునరుద్ఘాటించారు. ఈ ప్రాంతంలో శాంతి, స్థిరత్వాన్ని కాపాడటమే పాకిస్థాన్ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు.



## శత్రువు రక్షణ వ్యవస్థను

# నాశనం చేసే ఆయుధం

- **2030 లో భారత సైన్యంలోకి పినాకా-4**

భారతదేశ రక్షణ పరిశోధన అభివృద్ధి సంస్థ (DRDO) తదుపరి తరం గైడెడ్ రాకెట్ వ్యవస్థ పినాకా4 ను అభివృద్ధి చేస్తోంది. దీని పరిధి 300 కిలోమీటర్లు ఉంటుంది. పినాకా 4 యొక్క పరీక్షలు 2028 లో ప్రారంభమవుతాయి. దీనిని 2030 లో భారత సైన్యంలోకి చేర్చనున్నారు. ఈ వ్యవస్థ DRDO యొక్క ప్రలే షార్ట్‌రేంజ్ బాలిస్టిక్ క్షిపణి (SRBM) నుండి ప్రేరణ పొందిన శత్రు వాయు రక్షణ వ్యవస్థలను తప్పించుకోవడానికి అధునాతన లక్షణాలను కలిగి ఉంటుంది.

పినాకా4 అనేది ఒక విప్లవాత్మక అడుగు. ఇది దాని లక్ష్య పరిధిని 300 కి.మీ.లకు విస్తరిస్తుంది. ఇది వ్యూహాత్మక బాలిస్టిక్ క్షిపణులకు చౌకైన , మరింత ఖచ్చితమైన ప్రత్యామ్నాయంగా మారుతుంది. DRDO యొక్క ఆయుధ పరిశోధన అభివృద్ధి స్థాపన (ARDE) , సోలార్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ వంటి ప్రైవేట్ పరిశ్రమ భాగస్వాముల సహకారంతో అభివృద్ధి చేయబడిన పినాకా 4, కమాండ్ సెంటర్లు, లాజిస్టిక్స్ హబ్‌లు , శత్రు కోటల లక్ష్యాలపై ఖచ్చితమైన దాడులు చేస్తోంది.

**పినాకా-4 యొక్క లక్షణాలు**

పినాకా4 యొక్క 300 mm క్యాలిబర్, మునుపటి 214 mm వెర్షన్ల కంటే పెద్దది. ఇది ఎక్కువ ప్రొపెల్లెంట్ లోడ్‌ను 250 కిలోల వార్‌హెడ్‌ను మోయగల సామర్థ్యాన్ని ఇస్తుంది. దీని విధ్వంసక శక్తిని పెంచుతుంది.

**అధునాతన మార్గదర్శక వ్యవస్థ**

DRDO యొక్క రీసెర్చ్ సెంటర్ ఇమారత్ (RCI) అభివృద్ధి చేసిన గైడెన్స్, నావిగేషన్ కంట్రోల్ (GNC) వ్యవస్థ 10 మీటర్ల కంటే తక్కువ వృత్తాకార దోష సంభావ్యత (CEP) తో ఖచ్చితత్వాన్ని నిర్ధారిస్తుంది, ఇది చైనా యొక్క PHL16 , రష్యా యొక్క స్మెర్చ్ MBRL వంటి వ్యవస్థలతో పోటీ పడుతోంది.

**వాయు రక్షణను తప్పించుకునే సామర్థ్యం**

పినాకా4 యొక్క అతి ముఖ్యమైన లక్షణం ఏమిటంటే ఇది శత్రు వాయు రక్షణ వ్యవస్థలను తప్పించుకోగలదు. ఇది 150-500 కిలోమీటర్ల పరిధి .. క్వాసీబాలిస్టిక్ పథంతో, మానియోవెలబుల్ రీఎంట్రీ వెహికల్ (MaRV), జెట్ వేన్‌ల ద్వారా థ్రస్ట్ వెక్టర్ నియంత్రణ , డెకాయ్ డిప్లాయ్‌మెంట్‌ను ఉపయోగిస్తుంది. పినాకా4 రాడార్ గుర్తింపు , అంతరాయాన్ని ఎదుర్కోవడానికి మిడ్‌కోర్స్ యుక్తి, ఫ్లాట్ ఫ్లైట్ పథం , అధునాతన ఎలక్ట్రానిక్ కౌంటర్‌మెజర్స్ (ECCM) కలిగి ఉంటుంది.

**ప్రాంతీయ సవాళ్లు**

పినాకా4 ను చైనా పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ రాకెట్ ఫోర్స్ (PLARF) నుండి వచ్చే ముప్పును దృష్టిలో ఉంచుకుని అభివృద్ధి చేశారు, ఈ రాకెట్ ఫోర్స్ PHL16 (250-500 కి.మీ పరిధి) వంటి వ్యవస్థలను నిర్వహిస్తుంది. 300 కి.మీ వేరియంట్‌ను అభివృద్ధి చేయడం ద్వారా, DRDO చైనా రాకెట్ ఫిరంగిదళంలోని సంఖ్యలు, శ్రేణి ప్రయోజనాన్ని ఎదుర్కోవడం లక్ష్యంగా పెట్టుకుంది.




## టాటా ఎలక్ట్రిక్ కార్లపై బంపర్ ఆఫర్

ఇండియాలో కార్ల వినియోగం బాగా పెరిగింది. పెట్రోల్ అలాగే డీజిల్ ధరలు విపరీతంగా పెరిగిన నేపథ్యంలో... చాలామంది ఎలక్ట్రిక్ వాహనాలకు మొగ్గు చూపుతున్నారు. దీనికి తగ్గట్టుగానే కంపెనీలు రకరకాల కార్లను లాంచ్ చేస్తున్నాయి. ఇలాంటి నేపథ్యంలో టాటా మోటార్స్ అదిరిపోయే శుభ వార్త చెప్పింది. తమ ఎలక్ట్రిక్ కార్ల పై డిస్కౌంట్ ప్రకటించింది. గత సంవత్సరం కంటే ఈ సంవత్సరం.. 15% సేల్స్ తగ్గాయని.. ఈసారి డిస్కౌంట్ ప్రకటించింది. ఇందులో భాగంగానే హారియర్ ఎలక్ట్రిక్ కారుపై లక్ష రూపాయల వరకు డిస్కౌంట్ అందించేందుకు సిద్ధమైంది. అయితే ఇందులో కొన్ని మోడల్స్ పైనే ఈ ఆఫర్ ఉంది. కొన్ని నగరాలకు మాత్రమే ఈ ఆఫర్లు పరిమితం చేసింది. అదే సమయంలో టాటా టియాగో ఎలక్ట్రిక్ కారు లాంగ్ రేంజ్ మోడల్ పైన 40,000 వరకు డిస్కౌంట్ అందిస్తున్నారు.
వినియోగదారులు తమ పాత కారును అమ్మేస్తే 20,000 డిస్కౌంట్ కూడా ఇవ్వనున్నారు. ఎక్స్చేంజ్ బోనస్ కింద 20,000 పొందే అవకాశాలు ఉన్నట్లు ప్రకటన చేసింది. టాటా నెక్సన్ EV పైన 30 వేల ఎక్స్చేంజ్ బోనస్ అందిస్తున్నారు. అదనంగా ఆరు నెలల పాటు టాటా పవర్ చార్జింగ్ స్టేషన్ లో 1000 యూనిట్ల ఉచిత చార్జింగ్ కూడా ఇచ్చేందుకు సిద్ధమయ్యారు. టాటా కరువు ఎలక్ట్రానిక్ కారుపై... 50 వేల వరకు ఎక్స్చేంజి బోనస్ కూడా అందిస్తున్నారు. ఈ ఆఫర్ కొన్ని రోజుల వరకు మాత్రమే ఉంటుందని ప్రకటన చేశారు.

## ముంబైలో టెస్లా షోరూం ప్రారంభం




**టీపీఎన్, ముంబై :**

టెస్లాకార్లు భారత్ రోడ్లపై పరుగులు పెట్టేందుకు రెడీ అయ్యాయి. అంతర్జాతీయ ఈవీ కార్ల దిగ్గజం టెస్లా..భారత్‌లో అడుగుపెట్టబోతున్నది. దేశంలో తన తొలి షోరూంను వచ్చేవారంలో ప్రారంభించబోతున్నట్టు తెలుస్తున్నది. ముంబైలోని బాంద్రా కుర్లా కాంప్లెక్స్ నెలకొల్పిన తన తొలి ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌ను ఈ నెల 15న ప్రారంభించబోతున్నది. ఎలాన్ మస్క్ నాయకత్వంలో నడుస్తున్న టెస్లా..ఈ షోరూం ప్రారంభోత్సవానికి ఎంపిక చేసిన వ్యక్తులకు మాత్రమే ఆహ్వానాలు పంపింది.

# ఆచితూచి అడుగు వేయండి

**టీపీఎన్, ముంబై :**

దేశీయ స్టాక్‌మార్కెట్లు ఈ వారం మిశ్రమంగా చలించొచ్చు. అంతర్జాతీయ పరిణామాలు, అమెరికాతో వాణిజ్య ఒప్పందం వంటివి సూచీల గమనాన్ని నిర్దేశిస్తాయి. చివరి స్వింగ్ హై నుంచి 9 సెషన్లలో నిఫ్టీ దాదాపుగా 587 పాయింట్లే మేర పతనమైంది. 25,000 పైన సూచీకి బలమైన మద్దతు ఉంది. ఇప్పటికే స్వల్పకాలంలో ఎక్కువగా పతనమవ్వడం, కొనుగోళ్ల మద్దతు దొరికితే మళ్లీ బుల్ రంకెల్ వేయొచ్చు. ప్రస్తుతం ఎఫ్ఎంసీజీ, ఎంఎన్‌సీ, బ్యాంకింగ్, ఫైనాన్స్ షేర్లు బలంగా ఉన్నాయి. ఐటీ, మీడియా, కన్జూమర్ డ్యూరబుల్స్, మెటల్, ఆటో షేర్లలో స్వల్పకాల బలహీనత కనిపిస్తోంది.



**స్టాక్ రికమెండేషన్స్**

ఎస్బీఐ లైఫ్: 52వారాల కనిష్ఠం నుంచి 33 శాతం మేర ఎగిసిన ఈ షేర్లు ప్రస్తుతం 52 వారాల గరిష్ఠ స్థాయిని తాకేందుకు సిద్ధమవుతున్నాయి. మూమెంటమ్, రిలేటివ్ స్ట్రెంత్ బలంగా ఉన్నాయి. చివరి 3 నెలల్లో ఈ కౌంటర్ 23 శాతం మేర రాబడి అందించింది. గత శుక్రవారం రూ.1835 వద్ద ముగిసిన ఇందులో ఇన్వెస్టర్లు రూ.1950 టార్గెట్ ధరతో రూ.1800 శ్రేణిలో పొజిషన్ తీసుకోవాలి. రూ.1740 వద్ద స్టాప్‌లాస్ పెట్టుకోవాలి.

**కొటక్ బ్యాంకు:**

సుదీర్ఘకాలం సైడ్‌వేస్‌లో చలించిన ఈ షేర్లు ప్రస్తుతం జీవితకాల గరిష్ఠాన్ని తాకేందుకు దూకుడు కనబరుస్తున్నాయి. బేస్ పైన బేస్ ఏర్పడటం సానుకూల అంశం. దీనిని బ్రేకౌట్ చేసేందుకు రెడీగా ఉంది. బ్యాంకింగ్ రంగానికి మూమెంటమ్ రాగానే ఇది మెరుగైన రాబడి ఇవ్వొచ్చు. నిఫ్టీతో పోలిస్తే మెరుగ్గా రాణిస్తోంది. గత శుక్రవారం రూ.2220 వద్ద ముగిసిన ఈ కౌంటర్లో ఇన్వెస్టర్లు రూ.2320 టార్గెట్ ధరతో రూ.2200 శ్రేణిలో ప్రవేశించాలి. రూ.2150 వద్ద స్టాప్‌లాస్ ఉంచుకోవాలి.

**జైడస్ లైఫ్:**

కొన్ని నెలలుగా డౌన్‌ట్రెండులో కొనసాగిన ఈ షేర్లు ప్రస్తుతం రివర్సల్ అవుతున్నాయి. హయ్యర్ లోస్ ఫామ్ చేస్తూ 52వారాల కనిష్ఠం నుంచి 23శాతం మేర ఎగిసింది. గత శుక్రవారం నాటి నష్టాల మార్కెట్లోనూ ఈ షేర్లు 0.68% మేర లాభపడి 979 వద్ద ముగిశాయి. ఇన్వెస్టర్లు రూ.1050 టార్గెట్ ధరతో రూ.960 శ్రేణిలో ఈ కౌంటర్లో ప్రవేశించాలి. రూ.910 వద్ద స్టాప్‌లాస్ పెట్టుకోవాలి.

**జేఎస్‌డబ్ల్యూ ఇన్ఫ్రా:**

జీవితకాల గరిష్ఠం తర్వాత 40% మేర దిద్దుబాటుకు లోనైన ఈ షేర్లు ప్రస్తుతం దూకుడు కనబరుస్తున్నాయి. ఈ ఏడాది ఫిబ్రవరి నుంచి రివర్సల్ మొదలైనప్పటి నుంచి మంచి రాబడి అందిస్తున్నాయి. ప్రస్తుతం ఇందులో ఒడుదొడుకులు తగ్గాయి. రిలేటివ్ స్ట్రెంత్ పెరుగుతోంది. గత శుక్రవారం రూ.317 వద్ద ముగిసిన ఈ కౌంటర్లో మదుపరులు రూ.385 టార్గెట్ ధరతో రూ.310 శ్రేణిలో పొజిషన్ తీసుకోవాలి. రూ.300 వద్ద స్టాప్‌లాస్ తప్పనిసరి.

**ఎటర్నల్:**


52వారాల కనిష్ఠం నుంచి 5% ఎగిసిన ఈ షేర్లు ప్రస్తుతం స్వల వ్యవధి బ్రేకౌట్‌కు రెడీ అయ్యాయి. గత శుక్రవారం నాటి పతనంలో ఈ షేర్లు తట్టుకొని లాభాల్లో ముగిశాయి. రిలేటివ్ స్ట్రెంత్ క్రమంగా పెరుగుతోంది. రేంజ్ కాంట్రాక్షన్ కనిపిస్తోంది. ప్రస్తుతం రూ.263 వద్ద చలిస్తున్న ఈ కౌంటర్లో ఇన్వెస్టర్లు రూ.290 టార్గెట్ ధరతో రూ.260 శ్రేణిలో ప్రవేశించాలి. రూ.250 వద్ద స్టాప్‌లాస్ పెట్టుకోవాలి.

మూర్తి నాయుడు పాదం
నిఫ్ట్ మాస్టర్
స్టాక్ మార్కెట్ అనలిస్ట్
+91 988 555 9709

# 2026లో భారత్ వాణిజ్య లోటు $300 బిలియన్లు : ICICI బ్యాంక్ నివేదిక


**టీపీఎన్, ముంబై :**

ICICI బ్యాంక్ తాజా అంచనాల ప్రకారం, 202526 ఆర్థిక సంవత్సరంలో భారత్ వాణిజ్య లోటు $300 బిలియన్లకు పెరిగే అవకాశం ఉంది. ఇది గత సంవత్సరాలతో పోలిస్తే మరింత పెరుగుదల. 202425లో వాణిజ్య లోటు $287 బిలియన్లు కాగా, 202324లో ఇది $245 బిలియన్లు. తాజా అంచనాల ప్రకారం, ఇది **జీడీపీలో సుమారు 7%**ను సూచిస్తుంది.
బ్యాంక్ తెలిపిన ప్రకారం, వాణిజ్య లోటు పెరుగుతున్న ప్రధాన కారణం నాన్‌ఆయిల్ ఎగుమతుల బలహీనత. ఇవి వేగంగా పెరుగుతున్న దిగుమతులతో పోలిస్తే సరిపడలేకపోతున్నాయి. అంతేకాక, బలమైన దేశీయ ఆర్థిక వృద్ధి కారణంగా దిగుమతుల పరిమాణం పెరుగుతుంది, దీని వలన ఎగుమతులుదిగుమతుల మధ్య తేడా మరింత విస్తరిస్తోంది.
అయితే, ఈ లోటుతోపాటు ఒక సానుకూల అంశం కూడా ఉంది. సర్వీసుల ఎగుమతులు మరియు ప్రవాస భారతీయుల రెమిటెన్సులు వంటి స్థిరమైన ఆదాయాలు, కరెంట్ అకౌంట్ లోటును (CAD) **జీడీపీలో 0.7% (దాదాపు $30 బిలియన్లు)**గా నియంత్రించగలవని ICICI అంచనా వేస్తోంది. కరెంట్ అకౌంట్ లోటులో వాణిజ్య లోటుతో పాటు పెట్టుబడి ఆదాయాలు, రెమిటెన్సులు వంటి ఇతర విదేశీ ఆదాయాలు కూడా ప్రభావం చూపుతాయి.



వాణిజ్య లోటు అంటే, దేశం దిగుమతి చేసుకునే వస్తువుల విలువ, ఎగుమతుల విలువ కంటే అధికంగా ఉన్నప్పుడు ఏర్పడే పరిస్థితి. భారత్‌లో ఇది ఒక పదేపదే ఎదురయ్యే సమస్యగా మారింది. ముఖ్యంగా చమురు రంగం తప్ప మిగిలిన రంగాల్లో ఎగుమతుల పోటీతత్వం మరింత మెరుగుపడాల్సిన అవసరం ఉంది.
ఈ నేపథ్యంలో, నాన్‌ఆయిల్ ఎగుమతులను ప్రోత్సహించడం, దిగుమతులపై ఆధారాన్ని తగ్గించడం ద్వారా **దేశం మొత్తం బహిరంగ ఆర్థిక స్థిరత్వం (బ్యాలెన్స్ ఆఫ్ పేమెంట్స్)**ను మెరుగుపరచాల్సిన అవసరం ఉందని బ్యాంక్ నివేదిక స్పష్టం చేసింది. వేగంగా అభివృద్ధి చెందుతున్న దేశీయ ఆర్థిక వ్యవస్థ నేపథ్యంలో, రాబోయే రోజుల్లో ఈ వాణిజ్య అసమతుల్యతలను సమర్థవంతంగా ఎదుర్కోవడం చాలా కీలకమని హెచ్చరించింది.

# సానుకూల గ్లోబల్ సంకేతాలతో భారత స్టాక్ మార్కెట్ స్థిర ప్రారంభం..!



**టీపీఎన్, ముంబై :**

సానుకూల అంతర్జాతీయ సంకేతాలు, అలాగే PSU బ్యాంకులు మరియు ఐటీ రంగాల్లో ప్రారంభంలో ఉన్న కొనుగోళ్ల ఆసక్తి కారణంగా, భారత స్టాక్ మార్కెట్ సోమవారం స్థిరంగా ప్రారంభమైంది. ఉదయం 9:27 IST సమయంలో, BSE సెన్సెక్స్ స్వల్పంగా 1.35 పాయింట్లు పెరిగి 84,057.55 వద్ద ట్రేడవుతుండగా, NSE నిఫ్టీ కూడా 6.50 పాయింట్లు లేదా 0.03% పెరిగి 25,644.30 వద్ద కొనసాగింది. నిఫ్టీ బ్యాంక్ 15.15 పాయింట్ల లాభంతో 57,459.05 వద్ద కొనసాగింది. మార్కెట్ విశ్లేషకుల ప్రకారం, పశ్చిమాసియాలో భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు తగ్గుతుండడం, అలాగే బ్రెంట్ క్రూడ్ ధరలు బ్యారెల్‌కు $67కి పడిపోవడం వంటి అంశాలు మార్కెట్ మనోభావాలకు మద్దతు ఇవ్వడంలో కీలకంగా నిలిచాయి. అమెరికాచైనా, అమెరికాభారత్ మధ్య వాణిజ్య చర్చల్లో సానుకూలత కనబడుతున్నట్టు వచ్చిన నివేదికలు పెట్టుబడిదారుల విశ్వాసాన్ని పెంచుతున్నాయి.
జియోజిత్ ఇన్వెస్ట్‌మెంట్స్ చీఫ్ ఇన్వెస్ట్‌మెంట్ స్ట్రాటజిస్ట్ డాక్టర్ వీకే విజయకుమార్ మాట్లాడుతూ, గత రెండు వారాల మార్కెట్ ర్యాలీలకు HDFC బ్యాంక్, ICICI బ్యాంక్, రిలయన్స్ ఇండస్ట్రీస్, లార్సెన్ & టూబ్రో వంటి లార్జ్ క్యాప్ స్టాక్స్ ప్రధాన కారణమని తెలిపారు. ఇవి బలమైన సంస్థాగత కొనుగోళ్లకు కేంద్రంగా నిలిచాయని ఆయన పేర్కొన్నారు.

**మిడ్క్యాప్ మరియు స్మాల్‌క్యాప్ స్టాక్‌లు కూడా లాభాలు నమోదు చేశాయి.**

- నిఫ్టీ మిడ్‌క్యాప్ 100 సూచీ 220.90 పాయింట్లు (0.37%) పెరిగి 59,606.05 వద్దకు చేరింది.
- నిఫ్టీ స్మాల్‌క్యాప్ 100 సూచీ 153.35 పాయింట్లు (0.81%) పెరిగి 19,130.15 వద్ద స్థిరపడింది.

**సెన్సెక్స్‌లో నష్టపోయిన టాప్ షేర్లు:**

- M&M
- కోటక్ మహీంద్రా బ్యాంక్
- భారతి ఎయిర్‌టెల్
- HDFC బ్యాంక్
- NTPC
- అల్ట్రాటెక్ సిమెంట్


**లాభాల్లో కొనసాగిన షేర్లు:**

- ట్రెంట్
- SBI
- లార్సెన్ & టూబ్రో
- ఆక్సిస్ బ్యాంక్
- హిందుస్తాన్ యూనిలీవర్

డాలర్ ఇండెక్స్ బలహీనత విదేశీ పెట్టుబడిదారులకు లాభదాయకంగా మారింది. రిటైల్ పెట్టుబడిదారుల్లో కొనసాగుతున్న ఆశావాదం దేశీయ పెట్టుబడుల ప్రవాహాన్ని సమర్థిస్తోంది.
నిపుణుల సూచన ప్రకారం, ప్రస్తుత బుల్లిష్ మార్కెట్ ట్రెండ్‌ను దృష్టిలో ఉంచుకుని పెట్టుబడి కొనసాగించడం సమంజసం. అయితే, మార్కెట్ ఇప్పటికే ఎక్కువగా విలువపడినందున కొత్త పెట్టుబడులు చేపడుతున్నప్పుడు జాగ్రత్త అవసరమని హెచ్చరిస్తున్నారు.

**జూన్ 27న:**

- విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు (FIIs) ₹1,397.02 కోట్ల విలువైన ఈక్విటీలను కొనుగోలు చేశారు.
- దేశీయ సంస్థాగత పెట్టుబడిదారులు (DIIs) ₹588.93 కోట్ల విలువైన షేర్లను విక్రయించి నికర విక్రేతలుగా నిలిచారు.






# దేశంలో కొత్త బ్యాంకులు?

**టీపీఎన్, న్యూఢిల్లీ :**

దేశంలో కొత్త బ్యాంకులు రాబోతున్నాయి. దశాబ్దకాలం తర్వాత రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) మళ్లీ బ్యాంకింగ్ లైసెన్సులను జారీ చేయబోతున్నట్టు తెలుస్తున్నది. దీర్ఘకాలిక ఆర్థిక వృద్ధికి దోహదపడేలా బ్యాంకింగ్ రంగ విస్తరణపై కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ, ఆర్బీఐ చర్చిస్తున్నట్టు చెప్తున్నారు. 2014 తర్వాత మరోసారి నూతన బ్యాంకుల కోసం ఆర్బీఐ లైసెన్సులు ఇచ్చే వీలుందని ఓ కథనంలో బ్లూంబర్గ్ తెలిపింది. అయితే అటు ఆర్థిక శాఖ నుంచిగానీ, ఇటు ఆర్బీఐ నుంచిగానీ దీనిపై ఎలాంటి స్పందనా రాలేదు.



# మే 2025లో 9 నెలల కనిష్ఠానికి భారత పారిశ్రామిక వృద్ధి

**టీపీఎన్, న్యూఢిల్లీ :**

భారతదేశ పారిశ్రామిక ఉత్పత్తి వృద్ధి **మే 2025లో కేవలం 1.2%**కు పరిమితమైందని జాతీయ గణాంక కార్యాలయం (NSO) వెల్లడించింది. ఇది గత 9 నెలల కనిష్ఠ స్థాయిగా నిలిచింది. విద్యుత్ ఉత్పత్తి మరియు గనుల రంగాల్లో తీవ్ర మందగమనం ఈ వృద్ధి తగ్గుదలకు ప్రధాన కారణాలుగా గుర్తించబడింది.
ఈ గణాంకం ఏప్రిల్‌లో నమోదైన 2.6% వృద్ధితో పోలిస్తే గణనీయమైన క్షీణతను చూపుతోంది. అంతేకాక, ఏప్రిల్ గణాంకాన్ని మునుపటి అంచనా 2.7% నుంచి దిగువకు సవరించారు.
ఇండెక్స్ ఆఫ్ ఇండస్ట్రియల్ ప్రొడక్షన్ (IIP) ప్రకారం, విద్యుత్ ఉత్పత్తి 5.8% క్షీణించగా, గనుల ఉత్పత్తి 0.1% తగ్గుదలను ఎదుర్కొంది. ఈ రంగాలలోని బలహీనత పారిశ్రామిక ఉత్పత్తిపై ప్రభావాన్ని చూపుతోంది.
అయితే, తయారీ రంగం మాత్రం కొంత ఉపశమనాన్ని ఇచ్చింది. యంత్రాలు, ప్రాథమిక లోహాలు, నాన్ మెటాలిక్ ఖనిజాలు వంటి ఉపరంగాల్లో వృద్ధితో కలిపి తయారీ రంగం 2.6% వృద్ధిని నమోదు చేసింది. కానీ ఇది గత సంవత్సరం మే నెలలో నమోదైన 5.1% వృద్ధితో పోలిస్తే తక్కువగా ఉంది.
రంగాల వారీగా విశ్లేషిస్తే:

- వినియోగ వస్తువుల ఉత్పత్తి బలహీనంగా కొనసాగుతోంది — ఇది వినియోగ డిమాండ్‌లో మందగమనాన్ని సూచిస్తోంది.
- క్యాపిటల్ గూడ్స్ మరియు మౌలిక సదుపాయాల ఉత్పత్తి మాత్రం కొంత హోరుతెచ్చాయి, అయితే ఇవి మొత్తం పారిశ్రామిక వృద్ధిపై మరింత బలమైన ప్రభావాన్ని చూపలేకపోయాయి.

మేలో IIP సూచీ విలువ 156.6గా ఉండగా, ఇది మే 2024లోని 154.7తో పోలిస్తే స్వల్ప పెరుగుదలే అయినప్పటికీ, వృద్ధి రేటు మందగించింది. ఇది అంతర్జాతీయ అనిశ్చిత పరిస్థితులు మరియు దేశీయ డిమాండ్ లోపం మధ్య పారిశ్రామిక పునరుద్ధరణ సుస్థిరతపై సందేహాలను కలిగిస్తోంది.
ఈ వృద్ధి మందగమనం రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (RBI) యొక్క ద్రవ్య విధాన నిర్ణయాలపై ప్రభావం చూపే అవకాశం ఉంది. ఇప్పటికే అధిక ద్రవ్యోల్బణ ఒత్తిళ్ల మధ్య, ఆర్బీఐ వృద్ధిని ఎలా ప్రోత్సహించాలి అన్నదానిపై చర్చలు కీలకంగా మారే అవకాశం ఉంది.

# చిరుద్యోగి టు సీఈఓ జర్నీ..



ప్రియా నాయర్.. వ్యాపార ప్రపంచంలో ఈమె తెలియనివారుండరు. 2014 లో చాలా రాష్ట్రాల్లో కరెంటు కోతలెక్కువ. ఇంటర్నెట్ పరిచయమే లేదు. టీవీల్లేని పల్లెటూర్లే ఎక్కువగా ఉండేవి. హెచ్‌యూఎల్ దేశంలోనే పేరున్న ఫాస్ట్ మూవింగ్ కన్జ్యూమర్ గూడ్స్ సంస్థ. దీని వినియోగదారులు ఎక్కువగా గ్రామీణులే. మరి వారికి కొత్త ఉత్పత్తులను పరిచయం చేయడమెలా? అప్పుడే ఓ కొత్త క్యాంపెయిన్‌కి శ్రీకారం చుట్టారు ప్రియ. తక్కువ ధరకే వస్తుండటంతో బేసిక్ ఫోన్ అందరి ఇళ్లల్లో కనిపించడం మామూలైంది. దీంతో పాట, జోక్, చిన్న సీన్స్ వినాలనుందా... మా నంబరుకి ఒక్క మిస్డ్ కాల్ ఇవ్వండి అని ప్రచారం మొదలుపెట్టారు. డబ్బులెలాగూ ఖర్చవ్వవు అని చాలామంది ట్రై చేశారు. మిస్డ్ కాల్ ఇస్తే తిరిగి కాల్ రావడమే కాదు... చెప్పినట్టుగానే ఎంటర్‌టైన్‌మెంట్ ఉండేది. కాకపోతే మధ్యలో యాడ్‌లూ వస్తాయి. అప్పట్లోనే మూడు కోట్ల మందికి చేరువైందీ క్యాంపెయిన్. అంతేకాదు పల్లెలకి రిన్, క్లోజ్‌అప్, వీల్ వంటి ఎన్నో ఉత్పత్తులు పరిచయమయ్యాయి. ఆస్కార్ ఆఫ్ అడ్వర్టైజ్‌మెంట్ గా చెప్పే కేన్స్ లయన్స్ ఇంటర్నేషనల్ ఫెస్టివల్ ఆఫ్ క్రియేటివిటీ నుంచి మూడు గోల్డెన్ లయన్స్ అవార్డులూ వచ్చాయి. ఒకప్పుడు ఇది చాలామంది బిజినెస్ విద్యార్థులకు బిజినెస్ లెసన్ కూడా. ప్రియ వాళ్లది మలయాళం ఫ్యామిలీ. కానీ ఆమె పెరిగిందంతా ముంబయిలో. బీకాం, సింబయాసిస్ ఇన్‌స్టిట్యూట్ నుంచి ఎంబీఏ పూర్తిచేశారు. చదువవ్వగానే హెచ్‌యూఎల్ సేల్స్ అండ్ మేనేజ్‌మెంట్ విభాగంలో ఉద్యోగంలో చేరారు. అంచెలంచెలుగా ఎదుగుతూ 2012కల్లా మేనేజ్‌మెంట్ బోర్డులో స్థానం సంపాదించారు. 2022లో బ్యూటీ అండ్ వెల్‌బీయింగ్ విభాగానికి గ్లోబల్ సీఎంఓ అయ్యారు. ప్రస్తుతం అదే విభాగానికి ప్రెసిడెంట్‌గా చేస్తున్నారు. తాజాగా సీఈఓ అండ్ ఎండీగా సెలెక్ట్ అయ్యారు. దాదాపు ముప్పై ఏళ్ల అనుభవం. అలాగని సులువుగా ఏమీ సాగలేదామె ప్రయాణం. ఫస్ట్ డేస్ లో మార్కెటింగ్‌లో, ఫ్యాక్టరీల్లో అమ్మాయిలే కనిపించేవారు కాదు. ఎంత కష్టమైన పనైనా చేస్తూ వెళ్లారామె. ఫ్యాక్టరీల్లో మహిళలకు టాయ్‌లెట్లూ ఉండేవి కాదు. అవి వచ్చేలా చూశారు. మార్గం లేదా? అయితే సృష్టించడమే అనే సిద్ధాంతాన్ని నమ్మేవారు ప్రియ. తను పడిన ఇబ్బందులు తరవాతి తరం మహిళలు పడొద్దు అనుకునేవారట. మనసుతో ఆలోచిస్తారు.. ప్రియ గురించి చాలామంది చెప్పే మాటలివి. ఆమె నడిపిన బ్రాండ్‌లన్నీ ఏదోక సందేశాన్ని మోసుకెళ్లేలా చూసేవారు. సస్టెయినబిలిటీ, కార్బన్ ఉద్గారాలు తగ్గించడం, తక్కువ నీరు వాడకం... ఇలా ఎన్నో మార్పులకు అనుగుణంగా ఉత్పత్తులను తీసుకొచ్చారు. నేను రెండు ప్రధాన సూత్రాలను బలంగా నమ్ముతా. మనం చేసే ప్రతి పనికీ ఓ కారణం ఉండాలి. అది నలుగురికీ సాయపడాలి అనుకుంటా. సహానుభూతితో ఆలోచించినప్పుడే వాటి గురించి తెలుసుకోగలం. అందుకే ఈగోలకు తావివ్వను. బోర్డు సభ్యులైనా, పల్లెటూరి వినియోగదారుడైనా... ఎవరు చెప్పినా వింటాను. శక్తిమంతమైన వ్యక్తులు, బ్రాండ్‌లుగా ఎదిగే ఎవరైనా పాటించే నియమాలే ఇవి. ఇక రెండోది.. నేర్చుకోవడానికి వయసు, స్థాయి అంటూ ఉండవు. ఇదో నిరంతర ప్రక్రియ అనే ప్రియ.. ఉద్యోగంలో పాతికేళ్ల అనుభవం వచ్చాక హార్వర్డ్ బిజినెస్ స్కూల్ నుంచి ఎగ్జిక్యూటివ్ కోర్సుని చేశారు. ఇందుకు స్ఫూర్తి మాత్రం తల్లే అంటారామె. అమ్మ డాక్టర్. పేదలకు ఉచితంగా వైద్యం అందించేవారు. 70ఏళ్ల వయసులోనూ కొవిడ్ సమయంలో ముంబయి మురికివాడల్లో తిరుగుతూ సేవలందించారామె. కరోనా సోకినా భయపడలేదు. నా మీద అమ్మ ప్రభావం చాలా ఎక్కువ అంటారామె. అంతేకాదు, ఎదగడానికి మారాల్సిన పనిలేదు. మనసుతో ఆలోచించేతత్వం, దృఢమైన సంకల్పం, మనం చేసే దానికో ప్రయోజనం ఉంటే చాలు... ఎవరైనా అగ్రస్థానానికి చేరుకోవచ్చనే ప్రియ ప్రయాణం... గాజు తెరలను బద్ధలు కొడుతూ సీసూట్‌లో స్థానం సంపాదించాలనుకునే ఎంతోమంది అమ్మాయిలకు స్ఫూర్తిదాయకమే. ఆమె నడిచిన మార్గం నేడు ఎంతోమందికి మర్గదర్శకంగా నిలిచింది. అంతేకాకుండా ఆమె చూపించిన మార్గంలో ఇప్పటికే ఎంతోమందికి ఉపాధి లభించింది. అందుకే ప్రియ ఎంతో మందికి స్ఫూర్తి మాత్రమే కాదు.. ఆమె అంటే ఎంతోమంది ఉద్యోగులకు అపారమైన గౌరవం.

# నైట్ మొత్తం మీ ఫోన్‌ను ఛార్జ్ చేస్తున్నారా?




ఇప్పటి డిజిటల్ వరల్డ్ లో స్మార్ట్ ఫోన్ లు మన లైఫ్ లో చాలా వరకు ఒక భాగంగా మారాయి. ఫోన్ కాల్స్, మెసేజ్‌లు, చెల్లింపులు, పని, వీడియోలు లేదా సోషల్ మీడియా కోసం అయినా స్మార్ట్‌ఫోన్ లేకుండా మనం ఏమీ చేయలేము. స్మార్ట్‌ఫోన్‌లు మన జీవితాల్లో చాలా వరకు కీ రోల్ ను ప్లే చేస్తున్నాయి. అలాంటి స్మార్ట్‌ఫోన్ లను సరిగ్గా నిర్వహించడం చాలా ముఖ్యం. ముఖ్యంగా ఛార్జింగ్ విషయంలో మనం చాలా తప్పులు చేస్తాం. చాలా మంది తమ ఫోన్‌లను రోజంతా ఉపయోగిస్తారు కాబట్టి వారు రాత్రిపూట మాత్రమే వాటిని ఛార్జ్ చేసి ఉదయం వాటిని బయటకు తీస్తారు. ఇది చాలా ప్రమాదకరమని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. మీరు మీ ఫోన్‌ను రాత్రంతా ఛార్జ్ చేసినప్పుడు ఏం జరుగుతుందో ఇప్పుడు తెలుసుకుందాం. చాలా మంది తమ ఫోన్‌లను రోజంతా ఉపయోగిస్తారు. అందుకే రాత్రిపూట వాటిని ఛార్జ్ చేస్తారు. ఇది ప్రపంచవ్యాప్తంగా ఒక సాధారణ పద్ధతి. రాత్రంతా ఫోన్‌ను ఛార్జ్‌లో ఉంచడం వల్ల బ్యాటరీ లైఫ్, ఫోన్ పనితీరుపై ప్రభావం చూపుతుందని వారు హెచ్చరిస్తున్నారు. దీని వల్ల మన ఫోన్ బ్యాటరీ దెబ్బతింటుంది. కొన్ని గంటల ఉపయోగం తర్వాత అది త్వరగా ఛార్జ్ కోల్పోయే ప్రమాదం ఉంది. దీని వల్ల మీరు దాన్ని తరచుగా ఛార్జ్ చేయాల్సి వస్తుంది. నేటి స్మార్ట్‌ఫోన్ కంపెనీలు లిథియంఅయాన్ బ్యాటరీలను ఉపయోగిస్తున్నాయి. ఇవి లేటెస్ట్ టెక్నాలజీతో రూపొందించబడినప్పటికీ, కొన్ని సమస్యలను నివారించలేము. ముఖ్యంగా ఫోన్ పూర్తిగా ఛార్జ్ అయినప్పుడు అది పూర్తిగా ఖాళీ అయిన తర్వాత మాత్రమే ఛార్జ్ అవుతుంది. అదే విధంగా పూర్తిగా ఛార్జ్ అయిన తర్వాత కూడా ఛార్జర్ నుండి బ్యాటరీని తీసివేయకపోవడం కూడా ప్రమాదకరం. 100% ఛార్జ్ అయిన తర్వాత కూడా ఫోన్‌ను ఎక్కువసేపు ఛార్జ్‌లో ఉంచడం వల్ల అది వేడెక్కుతుంది. ఇది బ్యాటరీ నిర్మాణాన్ని దెబ్బతీయడమే కాకుండా, కొన్ని సందర్భాల్లో ఫోన్ పేలిపోవడానికి లేదా మంటలు చెలరేగడానికి కారణమవుతుంది. ఫోన్లు పేలి కొంతమంది మరణించిన సంఘటనల గురించి మనం వార్తల్లో ఎన్నో చూశాము. అందుకే ఫోన్ 0% చేరకముందే ఛార్జ్ చేయండి. ఫోన్ 100% ఛార్జ్ అయిన తర్వాత ఛార్జర్ నుండి తీసివేయండి. అవసరం అనుకుంటే 80 శాతం మాత్రమే ఛార్జ్ చేస్తే ఇంకా మంచిది. అలాగే, ఛార్జింగ్‌లో ఉన్నప్పుడు ఫోన్‌ను ఉపయోగించవద్దు. దీనివల్ల వేడి పెరుగుతుంది. రాత్రంతా ఛార్జింగ్ పెట్టే అలవాటు మానుకోండి. నేటి స్మార్ట్‌ఫోన్‌లలో బ్యాటరీని రక్షించడానికి బ్యాటరీ రక్షణ వ్యవస్థలు ఉన్నాయి. మీరు 100 లేదా 80 శాతం వరకు మాత్రమే ఛార్జ్ కావాలంటే ఆటో ఫీచర్‌ను ఆన్ చేస్తే ఆటోమెటిక్‌గా నిలిచిపోతుంది. ఇంకో విషయం ఏంటంటే మీ ఫోన్ బ్యాటరీ కనీసం 20 శాతం ఉండగానే ఛార్జ్ చేయడం మంచిది.

# సెన్సేషనల్ యాప్.. ఫోన్‌లో నెట్ లేకున్నా ఉపయోగం?


పాపులర్ టెక్నాలజీ సంస్థ గూగుల్ మరో సంచలనానికి తెరతీసింది. ఇప్పటి వరకు ఏ యాప్ యూజ్ చేయాలన్నా మన ఫోన్‌లో ఇంటర్నెట్ ఉండాల్సిందే. అయితే.. తాజాగా గూగుల్ ఏఐ ఎడ్జ్ గ్యాలరీ పేరిట ఓ కొత్త AI యాప్‌ను తీసుకొచ్చింది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రోజు రోజుకూ కొత్త తరహా ఫీచర్లు తీసుకొస్తున్న టైమ్ లో.. మన స్మార్ట్ ఫోన్లలో ఏఐ వినియోగాన్ని డిఫరెంట్ అండ్ ఇంట్రెస్టిగా మార్చే ఈ క్రేజీ యాప్‌ను తీసుకొచ్చింది. ఈ క్రేజీ యాప్ ద్వారా మన ఫోన్‌లో ఇంటర్నెట్ లేకున్నా మనం ఏఐ మోడల్స్‌ను ఉపయోగించుకోవచ్చు. ఈ ఏఐ ఎడ్జ్ గ్యాలరీ యాప్ ద్వారా మీ ఫోన్‌లో ఇంటర్నెట్ లేకున్నా ఏఐ మోడల్స్‌ను ఉపయోగించుకోవచ్చు. ఇంటర్నెట్ లేకున్నా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ తో ఇమేజ్‌లను క్రియేట్ చేయడం, కోడ్ రాయడం, సమాధానాలు రాబట్టడం వంటివి సులభంగా చేయొచ్చు. ఇందులో మరో మెయిన్ విషయం ఏమిటంటే.. యూజర్ ప్రైవసీకి ఎలాంటి ఇబ్బంది ఉండదు. ఎందుకంటే యూజర్లు అందించే డేటా క్లౌడ్ సర్వర్లకు వెళ్లకుండా మొత్తం మొబైల్ ఫోన్లో బ్యాక్‌ఎండ్‌లో రన్ అవుతుంది. ఇది సెక్యూరిటీ రిస్క్‌ను కూడా తగ్గిస్తుంది. అలాగే పనితీరు కూడా చాలా చాలా వేగంగా ఉంటుంది. సర్వర్ కోసం వేచి చూడాల్సిన అవసరం లేకుండా యూజర్లు అడిగే ప్రశ్నలకు వెంటనే రిప్లయ్ ఇచ్చే ఆస్కారం ఏఐకి ఉంటుంది. అయితే గూగుల్ ఏఐ ఎడ్జ్ యాప్ గెమ్మా 31బీ అనే లాంగ్వేజ్ మోడల్‌పై ఆధారపడి పనిచేస్తుంది. కేవలం 529 ఎంబీ పరిమాణంలో వచ్చే కాంపాక్ట్ మోడల్. అపాచీ 2.0 లైసెన్స్‌తో వస్తోంది. ఇది విద్య, బిజినెస్ అవసరాలకు కూడా వినియోగించుకునేందుకు అనుమతిస్తుంది. ఇది ఒక సెకనుకు 2,585 టోకెన్లను ప్రాసెస్ చేయగలదు. పెద్ద మొత్తంలో టెక్ట్స్‌ను ఇట్టే క్షణాల్లో జనరేట్ చేయగలదు.




గెమ్మా పరిమాణం చిన్నదైనప్పటికీ కంటెంట్ క్రియేట్ చేయడం, డాక్యుమెంట్లను విశ్లేషించడం, స్మార్ట్ రిప్లయ్ ఇవ్వడం వంటి పనులను క్షణాల్లో చేయగలదు. ప్రస్తుతానికి ఈ Google AI Edge Gallery యాప్ ఓపెన్ సోర్స్‌లో అందుబాటులో ఉంది. త్వరలోనే ఈ గూగుల్ ఏఐ ఎడ్జ్ గ్యాలరీ యాప్ ఐఓఎస్ వెర్షన్‌ను కూడా విడుదల చేయనున్నట్లు గూగుల్ ప్రకటించింది.

# కొలెస్ట్రాల్ కంట్రోల్.. సూపర్ ఫుడ్స్ ఇవే..

శరీరంలో కొలెస్ట్రాల్ స్థాయిలు పెరగడం అనేది ఇప్పటి లైఫ్ స్టైల్ లో మెయిన్ హెల్త్ ప్రాబ్లెమ్ గా మారింది. అధిక కొలెస్ట్రాల్ గుండె జబ్బులకు, స్ట్రోక్‌కు దారితీసే ప్రధాన కారణాలలో ఒకటి. అయితే మనం తీసుకునే ఆహారంలో కొన్ని రకాల సూపర్‌ఫుడ్స్ చేర్చడం ద్వారా చెడు కొలెస్ట్రాల్ ను తగ్గించి, మంచి కొలెస్ట్రాల్ ను పెంచవచ్చు. అందుకే తినే ఆహారం విషయంలో చాలా జాగ్రత్తలు తీసుకోవాలి. ఓట్స్, బార్లీ, బ్రౌన్ రైస్ వంటి తృణధాన్యాలలో సాల్యుబుల్ ఫైబర్ పుష్కలంగా ఉంటుంది. ఈ ఫైబర్ జీర్ణవ్యవస్థలో జిగురు లాంటి పదార్థాన్ని ఏర్పరుస్తుంది. అంతే కాకుండా ఇది ఆహారంలో ఉన్న కొలెస్ట్రాల్‌ను రక్తంలోకి గ్రహించకుండా అడ్డుకుంటుంది. రోజుకు ఒక కప్పు వోట్మీల్ లేదా బార్లీ తీసుకోవడం వల్ల చెడు కొలెస్ట్రాల్ స్థాయిలు గణనీయంగా తగ్గుతాయి. బాదం, వాల్‌నట్స్, వేరుశనగ, చియా గింజలు, అవిసె గింజలు వంటి వాటిలో ఆరోగ్యకరమైన మోనో అన్శాచురేటెడ్, పాలీ అన్శాచురేటెడ్ కొవ్వులు, ఫైబర్ , ఫ్లాంట్ స్టెరాల్స్ ఉంటాయి. ఈ పోషకాలు చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించడంలో హెల్ప్ చేస్తాయి. ముఖ్యంగా వాల్‌నట్స్ , అవిసె గింజలలో ఉండే ఒమేగా3 ఫ్యాటీ యాసిడ్స్ గుండె ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. అవకాడోలో మోనోఅన్శాచురేటెడ్ కొవ్వులు అధికంగా ఉంటాయి. ఇవి చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించి, మంచి కొలెస్ట్రాల్‌ను పెంచడంలో సహాయపడతాయి. అంతేకాకుండా.. అవకాడోలో ఉండే బీటాసిటోస్టెరాల్ అనే ఫ్లాంట్ స్టెరాల్, కొలెస్ట్రాల్‌ను గ్రహించడాన్ని నిరోధిస్తుంది. అవకాడో ఆరోగ్య సమస్యలు కూడా రాకుండా చేస్తుంది. శనగలు, రాజ్మా, పెసలు, కందులు వంటి చిక్కుళ్ళు, బీన్స్‌లో ఫైబర్ అధికంగా ఉంటుంది. ఇవి కొలెస్ట్రాల్‌ను కంట్రోల్ చేయడంలో అద్భుతంగా పనిచేస్తాయి. అంతేకాకుండా.. వీటిలో ఉండే ప్రోటీన్, ఇతర పోషకాలు సంపూర్ణ ఆరోగ్యాన్ని కాపాడతాయి. అందుకే వీటిని తినడం చాలా మంచిది. సాల్మన్, మాకెరెల్, సార్డిన్ వంటి కొవ్వు చేపలలో ఒమేగా3 ఫ్యాటీ యాసిడ్స్ పుష్కలంగా ఉంటాయి. ఈ ఆరోగ్యకరమైన కొవ్వులు ట్రైగ్లిజరైడ్స్ స్థాయిలను తగ్గించి.. గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గిస్తాయి. వారానికి కనీసం రెండు సార్లు చేపలు తినడం మంచిది. యాపిల్స్, ద్రాక్ష, సిట్రస్ పండ్లు, బెర్రీస్ వంటి పండ్లలో పెక్టిన్ అనే కరిగే ఫైబర్ ఉంటుంది. ఇది కొలెస్ట్రాల్‌ను తగ్గించడంలో సహాయపడుతుంది. అలాగే, వంకాయ, ఓక్రా, ఆకుకూరలు వంటి కూరగాయల్లో కూడా అధిక మొత్తంలో ఫైబర్ ఉంటుంది. ఈ సూపర్‌ఫుడ్స్‌ను మీ రోజువారీ ఆహారంలో చేర్చుకోవడం ద్వారా కొలెస్ట్రాల్‌ను సహజంగా నియంత్రించుకోవచ్చు. కేవలం ఆహారం మాత్రమే కాకుండా.. క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం, ఆరోగ్యకరమైన జీవనశైలి పాటించడం కూడా చాలా ముఖ్యం. దీంతో పాటు మానసిక ఒత్తిడిని దరికి చేరనివ్వకండి. ప్రస్తుత పరిస్థితుల్లో మానసిక ఒత్తిడి అనేది ప్రతి ఒక్కరి జీవితంలో చాలా సాధారణ విషయంగా మారిపోయింది. అయినా వీలైనంతగా తగ్గించే ప్రయత్నం చేయాలని ఆరోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారు.



## ఇలాంటి ఐడియాలు ఎలా వస్తాయో..

# ఈ ఏసీకి ఫిదా!



ఒక ఐడియా జీవితాన్నే మార్చేస్తుంది.. ఇది చాలామంది జీవితాల్లో ఎన్నో సందర్భాల్లో ప్రూవ్ అయ్యింది కూడా. జీవితాల్ని ఏమోగాని ఈ ఐడియా అక్కడి ప్రజల కష్టాలు మాత్రం మార్చేసింది. జుగాడ్ సహాయంతో తమ పనిని ఎలా నిర్వహించాలో బాగా తెలిసిన ప్రజలు ప్రపంచంలో చాలా దేశాలు ఉన్నాయి. ఈ వ్యక్తులు, సాధారణ వస్తువులను ఉపయోగించి అద్భుతాలు సృష్టిస్తుంటారు. అలాంటి జుగాడ్ వీడియో ఒకటి ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఆఫ్ఘనిస్తాన్‌కు చెందిన ఒక వ్యక్తి జుగాడ్ ఐడియాకు నెటిజన్స్ షాక్ అవుతున్నారు. సంతోషంగా జీవించాలంటే ధనవంతులై ఉండాల్సిన పని లేదని చిన్న చిన్న ఐడియాలో కూడా ఆనందంగా జీవించవచ్చని ఇది చాటి చెబుతుంది. వైరల్ అవుతున్న ఈ వీడియో దక్షిణ ఆఫ్ఘనిస్తాన్‌లోని కాందహార్ జిల్లాకు చెందినది. పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, మండే వేడి ప్రజల పరిస్థితిని మరింత దిగజార్చుతున్నాయి. ఇక్కడ ఉష్ణోగ్రత 40 డిగ్రీల సెల్సియస్ కంటే ఎక్కువగా ఉంటుంది. అటువంటి పరిస్థితిలో, నీలిరంగు టాక్సీ డ్రైవర్ వేడి నుండి తప్పించుకోవడానికి ఓ జుగాడ్ ఆలోచనతో చేశాడు. వెంటనే ఓ పరికరాన్ని అమర్చాడు. ఇది చూసిన తర్వాత నెటిజన్స్ షాక్ అవుతున్నారు. అతను తన వాహనాల్లో చేతితో తయారు చేసిన ఎయిర్ కూలర్ను ఏర్పాటు చేసుకున్నాడు. ఇందులో, చాలా మంది కూలింగ్ సిస్టమ్‌లను ఇన్‌స్టాల్ చేసుకోగా మరొకొంత మంది ఎయిర్ కండిషనింగ్ యూనిట్లను ఇన్‌స్టాల్ చేసుకున్నారు. ప్రపంచంలోని అత్యంత పేద దేశాలలో ఒకటి ఆఫ్ఘనిస్తాన్. వాతావరణ మార్పుల ప్రభావం ఈ దేశంపై ఎక్కువగ ఉంటుంది. అత్యధిక ఉష్ణోగ్రతల ప్రభావం ఇక్కడి ప్రజలపై తీవ్ర ప్రభావం చపుతుంది. ఈ క్రమంలో కారు చౌకగా లభించిఏ వస్తువులతో కారు డ్రైవర్లు ఇలా జుగాడ్ ఏసీలు సృష్టించారు. తమకే కాకుండా ప్రయాణికులకు సైతం చల్లదనాన్ని అందిస్తున్నారు. ఈ వీడియోను చూసిన నెటిజన్స్ ఫన్నీ కామెంట్స్ పెడుతున్నారు. ఇక ఈ వీడియోనే కాదు.. ఈ ఏసీ కూడా చాలామందికి హెల్ప్ అవుతుంది.




# కేఎల్ రాహుల్ సూపర్ సెంచరీ..

లార్డ్స్ వేదికగా టీమిండియా వర్సెస్ ఇంగ్లాండ్ జట్ల మధ్య మూడో టెస్టు జరుగుతుంది. ఈ మ్యాచ్ లో మొదట ఇంగ్లాండ్ జట్టు బ్యాటింగ్ చేసింది. 387 పరుగులు చేసి ఆలౌట్ అయింది. ఇక టీమిండియా బ్యాటింగ్ చేస్తోంది. టీమిండియా 254/5 పరుగులు చేసింది. ఈ నేపథ్యంలో టీమిండియా ఓపెనర్ కే.ఎల్. రాహుల్ అద్భుతమైన సెంచరీ చేశాడు. 176 బంతుల్లో సెంచరీ పూర్తి చేసుకున్నాడు. అతని ఇన్నింగ్స్ లో 13 ఫోర్లు ఉన్నాయి. అయితే లంచ్ సమయానికి ముందు రాహుల్ సెంచరీ చేసేందుకు అవకాశం ఇచ్చేందుకు రన్ కి ట్రై చేశారు. రిషబ్ పంత్ 74 పరుగులు చేసి అనవసర రన్ కి ట్రై చేసి ఔట్ అయ్యాడు. కే.ఎల్. రాహుల్ సెంచరీ చేశాడనే సంతోషం కొద్ది సేపు కూడా నిలవలేకపోయింది. సెంచరీ చేసిన కొద్ది సేపటకే క్యాచ్ ఔట్ గా వెనుదిరిగాడు రాహుల్. దీంతో రాహుల్ ఔట్ కాగానే నితీశ్ రెడ్డి క్రీజులోకి వచ్చేశాడు. అయితే లంచ్ బ్రేక్ సమయానికి టీమిండియా 65.3 ఓవర్లకు 4 వికెట్లు మాత్రమే నష్టపోయింది. లంచ్ కంటే ముందు బషీర్ బౌలింగ్ లో సింగిల్ కోసం ప్రయత్నించిన పంత్ ను బెన్ స్టోక్స్ రన్ ఔట్ చేశాడు. 248 పరుగుల వద్ద టీమిండియా 4వ వికెట్ ను కోల్పోయింది. తర్వాత అంపైర్లు లంచ్ బ్రేక్ ప్రకటించేశారు. కేఎల్ రాహుల్ 98 పరుగుల వద్ద పంత్ రనౌట్ కాగానే.. క్రీజులోకి జడేజా వచ్చాడు. ఆ తరువాత సెంచరీ చేసిన రాహుల్ కొద్ది సేపటికీ క్యాచ్ ఔట్ అయ్యాడు. రాహుల్ కోసం పంత్ రన్ ఔట్ కావడం.. ఇక రాహుల్ కూడా ఔట్ కావడంతో టీమిండియా 5 వికెట్లు కోల్పోయింది. ప్రస్తుతం ఆల్ రౌండర్లు నితీశ్ కుమార్ రెడ్డి, రవీంద్ర జడేజా క్రీజులో ఉన్నారు. భారత బ్యాటర్లు ఆచితూచి ఆడుతున్నారు. ఇద్దరూ ఆల్ రౌండర్లు నెమ్మదిగా ఆడుకుంటున్నారు. ఒకవేళ వికెట్ కోల్పోతే.. టీమిండియా కష్టాల్లో పడుతుందని మెల్లగా ఆడేందుకు ప్రయత్నిస్తున్నారు. వాస్తవానికి మంచి ఫామ్ లో ఉన్న రిషబ్ పంత్, కేఎల్ రాహుల్ ఇద్దరూ లంచ్ కి ముందు ఒకరు ఔట్ అయితే.. లంచ్ తరువాత ఒకరు పెవిలీయన్ కి చేరడం విశేషం. టీమిండియా బ్యాటర్లలో కేఎల్ రాహుల్ ఒక్కడే సెంచరీ చేశాడు. అతనికి తోడు రిషబ్ పంత్ 4 పరుగులు చేసి సెంచరీ మిస్ చేసుకున్నాడు. మరో ఓపెనర్ యశస్వి జైస్వాల్ 1, కరుణ్ నాయర్ 40, గిల్ 16 పరుగులు మాత్రమే చేశారు. మరి ఈ టెస్ట్ లో టీమిండియా ప్రయత్నం ఎలా ఉంటుందో చూడాలి.

# నాకేమీ 21 ఏళ్లు కాదుగా: బుమ్రా

ఇంగ్లాండ్ తో లార్డ్స్ వేదికగా జరుగుతున్న మూడో టెస్టులో భారత పేసర్ జస్ప్రీత్ బుమ్రా ఐదు వికెట్ల ప్రదర్శన చేశాడు. దీంతో లార్డ్స్‌లో ఆనర్స్ బోర్డు పై పేరు నమోదు చేసుకొనే అవకాశం దక్కించుకున్నాడు. ఐదో వికెట్ తీసిన తర్వాత పెద్దగా సంబరాలు చేసుకోలేదు. దీనికి కారణం ఏంటా? అని క్రికెట్ అభిమానుల్లో ప్రశ్నలు తలెత్తాయి. దానికి జస్ప్రీత్ బుమ్రానే సమాధానం ఇచ్చాడు. రెండో రోజు ఆట ముగిసిన తర్వాత బుమ్రా ప్రెస్ కాన్ఫరెన్స్‌లో మాట్లాడాడు. నిజం చెప్పాలంటే నేను బాగా అలసిపోయా. అందుకే ఎక్కువగా సంబరాలు చేసుకోలేకపోయా. మైదానంలో చాలా సమయంపాటు బౌలింగ్ చేశా. దీంతో శారీరకంగా అలసిపోయా. ఎగిరి గంతులు వేయడానికి ఇప్పుడు నేనేమీ 2122 ఏళ్ల కుర్రాడిని కాదు. మామూలుగానే అలా చేయడానికి ఇష్టపడను. అయితే, నా ప్రదర్శనపై ఆనందంగా ఉన్నా. ఐదో వికెట్ వచ్చాక మళ్లీ బౌలింగ్‌ను కొనసాగించడానికి తర్వాత బంతి వేసేందుకు వెళ్లిపోయా అని బుమ్రా చెప్పుకొచ్చారు. లార్డ్స్ టెస్టులో తొలిరోజు 18 ఓవర్లు వేసిన బుమ్రా ఒక వికెట్ తీయగా.. రెండోరోజు 9 ఓవర్లు వేసి నాలుగు వికెట్లు పడగొట్టాడు. ఇందులో నలుగురు ఇంగ్లాండ్ బ్యాటర్లను బౌల్డ్ చేయడం హైలెట్ గా నిలిచింది. టెస్టుల్లో బుమ్రా 15వ సారి ఐదు వికెట్ల ప్రదర్శన చేశాడు. విదేశాల్లో 12వ సారి కావడం గమనార్హం. దీంతో కపిల్ దేవ్ ను అధిగమిస్తూ విదేశాల్లో అత్యధిక ఫైఫర్‌లు నమోదు చేసిన భారత బౌలర్‌గా రికార్డు క్రియేట్ చేశారు. కాగా బుమ్రా బౌలింగ్ లో అత్యధిక వికెట్లు తీసిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో ఆయన సాలిడ్ రికార్డ్ ను సైతం క్రియేట్ చేశారు. దీంతో పాటు బుమ్రా తన ఫ్యామిలీకి కూడా అంతే ఇంపార్టెన్స్ ఇస్తూ.. నిత్యం సోషల్ మీడియాలో యాక్టివ్ గా కూడా ఉంటారు. దీంతో ప్రజంట్ బుమ్రా చేసిన ఈ కామెంట్స్ తెగ వైరల్ అవుతున్నాయి.







# ఆర్చరీ వరల్డ్ కప్.. భారత్‌కు రజతం, కాంస్యం

స్పెయిన్ వేదికగా జరుగుతున్న ఆర్చరీ వరల్డ్ కప్ స్టేజ్ 4లో భారత మహిళా టీమ్ పతకాల వేట కొనసాగిస్తోంది. జ్యోతి సురేఖ, పర్నీత్ కౌర్, ప్రీతికా ప్రదీప్ లతో కూడిన టీమ్ శనివారం జరిగిన కాంపౌండ్ టీమ్ ఈవెంట్లో రజతం కొల్లగొట్టింది. పోడియం మీద మువ్వన్నెల జెండాను ఈ ముగ్గురు రెపరెపలాడించగా.. మిక్స్‌డ్ టీమ్ విభాగంలో సురేఖ గురి అదరడంతో కాంస్యం కూడా వచ్చి చేరింది. క్వాలిఫికేషన్ రౌండ్‌లో 16 ఏళ్ల ప్రీతికా 2,116 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచింది. దాంతో, భారత టీమ్ ఫైనల్ కు దూసుకెళ్లింది. అయితే.. పసిడి పోరులో ఒత్తిడికి లోనైన టీమ్ రెండో స్థానంతో సిల్వర్ మెడల్‌కే పరిమితమైంది. చైనీస్ తైపీ బృందం స్వర్ణం సొంతం చేసుకుంది. తర్వాత జరిగిన మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్లో సురేఖ, రిషభ్ యాదవ్ 1,431 పాయింట్లతో వరల్డ్ రికార్డు నెలకొల్పారు. పదో సీడ్ జంటను చిత్తు చేసి దేశానికి కాంస్యం అందించారు. అయితే.. మహిళల కాంపౌండ్ టీమ్ సెమీఫైనల్లో మాత్రం భారత ఆర్చర్లు తీవ్రంగా నిరాశపరిచారు. నెదర్లాండ్స్‌కు చెందిన 12వ సీడ్‌ల ముందు నిలువలేక వెళ్లిపోయారు. కాగా గత కొన్ని రోజులు భారత టీమ్ తీవ్రంగా కృషి చేస్తున్నారు.

# డ్యూక్స్ బాల్స్ వివాదంపై గావస్కర్ ఏమన్నారంటే?



ఇంగ్లాండ్, టీమిండియా టీమ్స్ మధ్య టెస్టు సిరీస్‌లో ఇప్పుడు బంతులపై చర్చ జరుగుతోంది. డ్యూక్స్ బంతులు త్వరగా తమ ఆకారాన్ని కోల్పోతున్నాయని రెండు టీమ్స్ ప్లేయర్స్ అసహనం వ్యక్తం చేస్తున్నారు. తాజాగా లార్డ్స్ వేదికగా జరుగుతున్న మూడో టెస్టులోనూ ఇదే పరిస్థితి ఎదురైంది. రెండోరోజు కొత్త బంతి కేవలం పది ఓవర్లలోపే ఆకారం మారిపోవడం గమనార్హం. బంతిని మార్చే క్రమంలో అంపైర్లు సరిగ్గా వ్యవహరించలేదని భారత కెప్టెన్ శుభ్‌మన్ గిల్, పేసర్ సిరాజ్ అసహనం వ్యక్తం చేశారు. దీనిపై టీమిండియా క్రికెట్ దిగ్గజం సునీల్ గావస్కర్ కీలక వ్యాఖ్యలు చేశాడు. ఒకవేళ ఇదే పరిస్థితి ఎదురై ఉంటే బ్రిటన్ మీడియా పెద్ద రాద్ధాంతం చేసి ఉండేదని కామెంట్ చేశారు. ఇంగ్లాండ్ మాజీ పేసర్ స్టువర్ట్ బ్రాడ్ కూడా సమస్యను పరిష్కరించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నాడు. మార్చిన బంతిని చూస్తే అదేమీ 10 ఓవర్లు ఆడిన బాల్ మాదిరిగా లేదు. 20 ఓవర్ల కంటే ఎక్కువే అయి ఉండొచ్చు. ఒకవేళ ఇదే బంతి మార్పు అంశం భారత్ లో జరిగి ఉంటే.. కనీసం బంతిని మార్చేంత కూడా లేదా అని బ్రిటీష్ మీడియా దీనిపై పెద్ద రాద్ధాంతం చేసేసేది అని గావస్కర్ అన్నారు. క్రికెట్ బంతి ఇలా త్వరగా ఆకారం మారిపోవడం ఎప్పటికీ ఆమోదయోగ్యం కాదు. గతంలో లేనివిధంగా ఇప్పుడు ఎక్కువగా ఈ బాల్స్ గురించి మాట్లాడుతున్నామంటే సమస్య ఉన్నట్లేగా. ప్రతి ఇన్నింగ్స్‌లోనూ బంతిని మారుస్తున్నట్లు కనిపిస్తోంది. డ్యూక్స్ బంతుల్లో ప్రాబ్లమ్ ఉంది. త్వరగా సమస్యను పరిష్కరించాల్సిన అవసరం ఉంది. బంతి కనీసం 80 ఓవర్ల వరకూ మార్చకుండా ఉండేలా చూడాలి. అంతేకానీ, 10 15 ఓవర్లకే మార్చుకుంటూ పోతే ఎలా? అని తన సోషల్ మీడియాలో పోస్ట్ ను షేర్ చేశారు. డ్యూక్స్ బంతుల తయారీ సంస్థ యజమాని దిలీప్ జగోడియా మాత్రం డిఫరెంట్ గా రెస్పాన్డ్ అయ్యారు. క్రికెట్ సూపర్ స్టార్లకు కాస్త ఓపిక అవసరం. వివాదాస్పదమైన అంశం విషయంలో చర్యలు తీసుకొంటాం. మాది 18వ శతాబ్దం నుంచి వస్తోన్న కంపెనీ. ఎప్పటికప్పుడు మెరుగు పర్చుకుంటూనే వస్తున్నాం. ప్రస్తుతం యూకేలో అసాధారణమైన వేడి వాతావరణం కూడా బంతి ఇలా మారిపోవడానికి కారణమై ఉండొచ్చు. ప్రస్తుతం ఆడుతున్న క్రికెటర్లు బరువైన బ్యాట్‌లను వాడుతున్నారనే విషయాన్ని పరిగణనలోకి తీసుకోవాలి అని వెల్లడించారు. అయితే ఈ పోస్ట్ పై నెటిజన్లు రకరకాలుగా స్పందిస్తున్నారు.

# భారత్ చేతుల్లో మ్యాచ్.. క్రేజీ స్ట్రాటజీ..

మొదటి రెండు టెస్టులకు భిన్నంగా సాగుతోంది లార్డ్స్ టెస్ట్. ఈ మ్యాచ్‌లో సెషన్ సెషన్‌కూ ఆధిపత్యం చేతులు మారుతూ పోతోంది. డే1 రెండు టీమ్స్ బాగా పోరాడాయి. అయితే ఇంగ్లండ్ కాస్త పైచేయి సాధించింది. కానీ రెండో రోజు ఆటలో బౌలర్లు చెలరేగడంతో భారత్ డామినేషన్ నడిచింది. ఆ తర్వాత బ్యాటర్లు కూడా రాణించడంతో డే2ను సానుకూలంగా ముగించింది భారత్. కానీ శుబ్‌మన్ గిల్, అంతకంటే ముందు కరుణ్ నాయర్ వికెట్లను కోల్పోవడంతో ఎడ్జ్ సాధించలేకపోయింది మెన్ ఇన్ బ్లూ. ప్రత్యర్థి స్కోరుకు ఇంకా 242 పరుగుల దూరంలో ఉంది భారత్. మూడ్రోజులు మిగిలి ఉన్న ఈ టెస్టులో ఫలితం రావడం ఖాయంగా కనిపిస్తోంది. అయితే రిజల్ట్ మనకు అనుకూలంగా రావాలంటే మాత్రం ఓ మ్యాజిక్ జరగాల్సిందే. అదేంటంటే.. లార్డ్స్ పిచ్ నుంచి పేసర్లకు మంచి మద్దతు లభిస్తోంది. బంతి ఒక్కోసారి అనూహ్యంగా బౌన్స్ అవుతోంది. స్పిన్నర్లకూ కొంతమేర సపోర్ట్ దొరుకుతోంది. ఒక్కోసారి బాల్ ఊహించిన దాని కంటే కిందకు వస్తుండటంతో బ్యాటర్లు షాట్లు ఆడటం కష్టమవుతోంది. ఈ నేపథ్యంలో ఇంగ్లండ్ స్కోరును దాటాలంటే భారత్ చెమటోడ్చక తప్పని పరిస్థితి. ఒకవైపు వికెట్లను కాపాడుకుంటూనే మరోవైపు స్కోరు బోర్డును పరుగులు పెట్టించాల్సి ఉంటుంది. రాహుల్, పంత్ లీడ్స్‌లో చేసిన మ్యాజిక్‌నే మళ్లీ రిపీట్ చేయాలని అభిమానులు కోరుకుంటున్నారు. ఆ టెస్ట్ రెండో ఇన్నింగ్స్ లో వీళ్లిద్దరూ కలిసి నాలుగో వికెట్ కు 195 పరుగుల భారీ పార్ట్‌నర్‌షిప్ యాడ్ చేశారు. రాహుల్, పంత్ ఔట్ అయినా నితీష్ కుమార్ రెడ్డి, రవీంద్ర జడేజా, వాషింగ్టన్ సుందర్ రూపంలో ఇంకా క్వాలిటీ బ్యాటర్లు టీమిండియాలో ఉన్నారు. అయితే రాహుల్‌పంత్‌కు ఇంగ్లండ్ బౌలర్లను ఎదుర్కొన్న అనుభవం ఉంది. దీనికి తోడు ఒకరు డిఫెన్స్‌తో ప్రత్యర్థుల ఓపికను పరీక్షిస్తే, మరొకరు అటాక్ చేస్తూ భయపెడుతుంటారు. కాబట్టి వీళ్లు సాధ్యమైనంత ఎక్కువ ఓవర్లు ఆడుతూ భారీ భాగస్వామ్యం నమోదు చేయాలని ఫ్యాన్స్ కోరుకుంటున్నారు. తర్వాతి బ్యాటర్లలో జడేజా తప్పితే మిగతా వారికి ఇక్కడ ఆడిన అనుభవం లేదు. నితీష్, సుందర్ పట్టుదలతో ఆడితే భారీ స్కోర్లు కొట్టగలిగే సమర్థులే. దీంతో నితీష్ ఎక్కువసేపు రాణించగలిగితే ఖచ్చితంగా స్కోర్ లో కీలక మార్పులు వస్తాయని క్రికెట్ నిపుణులు అభిప్రాయపడుతున్నారు.




# రణ్‌వీర్‌తో అట్లీ.. భారీ ప్లాన్స్!





సౌత్ ఇండియా స్టార్ డైరెక్టర్స్ లో రాజమౌళి తర్వాత ముందు వరుసలో అట్లీ ఉంటాడు అనడంలో ఎలాంటి డౌట్ లేదు. ఆయన దర్శకత్వంలో వచ్చిన జవాన్ సినిమా వెయ్యి కోట్లకు మించి వసూళ్లు సాధించడంతో పాటు, బాలీవుడ్ కి జీవం పోసినట్లుగా హిట్ అయింది. అందుకే అట్లీ దర్శకత్వంలో సినిమాలు చేసేందుకు బాలీవుడ్ స్టార్స్ క్యూ కడుతున్నారు. అంతే కాకుండా సౌత్ స్టార్ హీరోలు, సూపర్ స్టార్‌లు సైతం ఈయన దర్శకత్వంలో సినిమాలు చేసేందుకు గాను ఆసక్తిగా ఉన్నారు. ఈ సమయంలో అట్లీ సౌత్ లో సినిమాను మొదలు పెట్టాడు. అల్లు అర్జున్ హీరోగా అట్లీ దర్శకత్వంలో సినిమా కన్ఫర్మ్ అయింది. ఇప్పటికే AA22XA6 సినిమా షూటింగ్ ను స్టార్ట్ చేశారు. ప్రజంట్ అల్లు అర్జున్‌తో కీలక సన్నివేశాలను షూట్ చేస్తున్న అట్లీ త్వరలోనే మరో ప్రాజెక్ట్‌ను ప్రారంభించబోతున్నట్లు వార్తలు వస్తున్నాయి. అయితే ఆ ప్రాజెక్ట్ సినిమా కాదని, అది ఒక యాడ్ ఫిల్మ్ అని తెలుస్తోంది. నిమిషం రెండు నిమిషాల డ్యూరేషన్ తో కాకుండా దాదాపు అయిదు నిమిషాల నిడివి ఉండే విధంగా ఆ యాడ్ ఫిల్మ్ ఉంటుందనే విషయం తెలుస్తుంది. ఇప్పటి వరకు అధికారికంగా ఆ యాడ్ ఫిల్మ్ గురించి ఎలాంటి సమాచారం లేదు. కానీ ఆ యాడ్ ఫిల్మ్‌లో బాలీవుడ్ స్టార్ రణ్వీర్ సింగ్ కనిపించబోతున్నాడు. ఆయన ఈ యాడ్ కోసం యాక్షన్ సీన్స్ లో కనిపిస్తాడని, కామెడీ, యాక్షన్ మెయిన్ గా ఈ కమర్షియల్ యాడ్ ఫిల్మ్ ను అట్లీ భారీ ప్లాన్స్ చేస్తున్నారట. రణ్వీర్ సింగ్‌తో పాటు ఈ యాడ్ ఫిల్మ్ లో కిస్సిక్ బ్యూటీ శ్రీలీల కనిపించబోతుంది. పుష్ప 2 సినిమాలోని ఆ ఐటెం సాంగ్ తర్వాత శ్రీలీల రేంజ్ అమాంతం పెరిగింది. అందుకే ఈ యాడ్‌లో రణ్వీర్ సింగ్ కాంబోగా శ్రీలీలను సెలెక్ట్ చేశారని వార్తలు వస్తున్నాయి. రణ్వీర్ సింగ్, శ్రీలీల కాంబోలో షాట్స్ ఉంటాయి, ఒక యాడ్ ఫిల్మ్ కోసం ఇంత భారీ ప్లాన్స్ చేయడం ఇదే మొదటి సారి అంటూ కొందరు కామెంట్ చేస్తున్నారు. ఈ యాడ్ ఫిల్మ్ లో ఈ మధ్య కాలంలో మోస్ట్ హ్యాపెనింగ్ స్టార్‌గా నిలిచిన బాబీ డియోల్ కూడా కనిపించబోతున్నాడు. ఈ మధ్య కాలంలో ఈయనకు స్టైలిష్ యాక్టర్, స్టైలిష్ విలన్ అనే పేర్లను అభిమానులు సోషల్ మీడియాలో పెట్టుకుని మాట్లాడుతున్న విషయం తెల్సిందే. ఇంత భారీ స్టార్ కాస్ట్ ఉండటంతో పాటు, ఇండియాస్ టాప్ దర్శకుల్లో ఒకరు అయిన అట్లీ ఈ యాడ్ ఫిల్మ్ కి డైరెక్షన్ చేస్తున్న నేపథ్యంలో అందరి దృష్టిని అట్రాక్ట్ చేస్తున్నారు. తక్కువ సమయంలోనే ఈ యాడ్ ఫిల్మ్ ను రూపొందించేందుకు గాను ఇప్పటికే ప్రీ ప్రొడక్షన్ వర్క్ ను చేస్తున్నారు. ప్రస్తుతం AA22XA6 షూటింగ్ లో ఉన్న అట్లీ అతి త్వరలోనే ఆ యాడ్ షూటింగ్‌కు హాజరు కాబోతున్నాడు. వచ్చే నెలలో ప్రేక్షకులు ఆ యాడ్ ఫిల్మ్ ను టీవీల్లో చూసే అవకాశాలు ఉన్నాయి. రణ్వీర్ సింగ్ వంటి స్టార్‌తో శ్రీలీలకు నటించే అవకాశం దక్కడంతో ముందు ముందు హీరోయిన్‌గా బాలీవుడ్‌లో మరిన్ని సినిమాలు చేస్తుందేమో చూడాలి అంటూ కొందరు కామెంట్స్ చేస్తున్నారు.




# అరెవ్వా.. పెద్ది నుంచి శివరాజ్ కుమార్ పోస్టర్

గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ హీరోగా జాన్వీ కపూర్ హీరోయిన్ గా దర్శకుడు బుచ్చి బాబు సానా తెరకెక్కిస్తున్న భారీ పాన్ ఇండియా సినిమా పెద్ది కోసం అందరికీ తెలిసిందే. పక్కా మాస్ మసాలా స్పోర్ట్స్ విలేజ్ డ్రామాగా తెరకెక్కిస్తున్న ఈ సినిమా భారీ అంచనాలు సెట్ చేసుకుంది. అయితే ఈ సినిమాకి బుచ్చిబాబు సానా యాక్టర్స్ విషయంలో కానీ తన టెక్నికల్ టీమ్ విషయంలో కానీ ఎక్కడా వెనక్కి తగ్గలేదు. ఇలా కన్నడ నుంచి మాస్ ప్రెజెన్స్ కలిగిన పవర్ఫుల్ నటుడు శివ రాజ్ కుమార్ ని కూడా తీసుకున్న సంగతి తెలిసిందే. మరి శివ రాజ్ కుమార్ పుట్టినరోజు కానుకగా మేకర్స్ తనపై అదిరే పోస్టర్ ని రిలీజ్ చేసారు. ఇందులో పూర్తిగా కొత్త లుక్ లో శివ రాజ్ కుమార్ కనిపిస్తుండడం విశేషం. అంతే కాకుండా తాను గౌర్ నాయుడు అనే క్యారెక్టర్ లో కనిపిస్తారని తన క్యారెక్టర్ ని కూడా రివీల్ చేశారు. మరి సినిమాలో తన రోల్ ఏ లెవెల్లో ఉంటుందో చూడాల్సిందే. ఇక రామ్ చరణ్ సినీ కెరీర్ లో పెద్ది సినిమా మంచి సక్సెస్ అవుతుందని అంచనాలు పెట్టుకున్నారు. ఎందుకంటే రామ్ చరణ్ తీసిన గేమ్ ఛేంజర్ మూవీ భారీ డిజాస్టర్ గా మారడంతో రామ్ చరణ్ తో పాటు మెగా ఫ్యామిలీ ఫ్యాన్స్ కూడా పెద్ది మీదే అన్ని హోప్స్ పెట్టుకున్నారు. ఈ క్రమంలో పెద్ది నుండి వచ్చే ప్రతి అప్డేట్ పై మంచి ఫోకస్ క్రియేట్ అయ్యింది. అందుకే ఆ మూవీ నుండి వచ్చిన లుక్స్, గ్లింప్స్ లాంటివి క్షణాల్లో వైరల్ అవుతున్నాయి. ఇక పెద్ది మూవీతో ఖచ్చితంగా రామ్ చరణ్ పెద్ద సక్సెస్ అందుకోవాలని ఆడియన్స్ ఆసక్తి చూపిస్తున్నారు.

# మయసభ టీజర్.. తెలుగు రాజకీయాలపై టచ్

టాలీవుడ్ ఆడియన్స్ ని ఎంటర్ టైన్ చేసేందుకు మరో పొలిటికల్ స్టోరీ రెడీగా ఉంది. అయితే, ఇది సిల్వర్ స్క్రీన్ పై వచ్చే సినిమా కాదు.. అందుకే పాపులర్ ఓటీటీ సోనీ లివ్ లో స్ట్రీమింగ్ కి రెడీ అవుతుంది. అలాగే మయసభ అనేది కంప్లీట్ వెబ్ సిరీస్. ఈ సిరీస్ ను డైరెక్ట్ చేసేది రిపబ్లిక్ మూవీ ఫేమ్ దేవా కట్ట. ఈ సిరీస్ కు సంబంధించి టీజర్ ను ఫిల్మ్ టీమ్ లేటెస్ట్ గా రిలీజ్ చేశారు. ఈ ప్రాజెక్ట్ కంప్లీట్ గా పొలిటికల్ థ్రిల్లర్ గా రానుంది. ఇక ఈ టీజర్ విషయానికి వస్తే హై ఇంటెన్స్ తో ప్లాన్ చేశారు. అలాగే మన తెలుగు ప్రజలకు ఎంతో పరిచయం ఉన్న ఇద్దరు రాజకీయ నేతలకు సంబంధించిన కథ ఇది అని అర్థమవుతుంది. ఇద్దరు స్నేహితులు, రాష్ట్ర రాజకీయాల్లో పెను సంచలనంగా ఎలా మారారు.. ఆ తర్వాత వారి మధ్య రాజకీయ వైరం ఎలా తయారైంది.. అనే కథతో ఈ సిరీస్‌ను దేవా కట్టా తెరకెక్కించాడు. ఇక ఈ సిరిస్‌లో ఆది పినిశెట్టి, చైతన్య రావు మెయిన్ లీడ్స్ లో యాక్ట్ చేస్తున్నారు. దేవా కట్టా మార్క్ డైలాగులు మనకు ఈ టీజర్‌లో వినిపించాయి. టీజర్ ఆసక్తికరంగా ఉండటంతో ఈ వెబ్ సిరీస్‌ను ఎప్పుడెప్పుడు చూద్దామా అని అందరూ ఆసక్తిగా ఉన్నారు. ఇక ఈ సిరీస్‌ను ఆగస్టు 7 నుంచి స్ట్రీమింగ్ చేయనున్నట్లు సోనీ లివ్ పేర్కొంది. ఇక ఈ సిరీస్ తో మరోసారి దేవా కట్టా తన మార్క్ ను ప్రూవ్ చేసుకోనున్నారు. ప్రీవియస్ గా వచ్చిన రిపబ్లిక్ మూవీ ఇండస్ట్రీలో తనదైన స్టైల్ ఆఫ్ మార్క్ ను క్రియేట్ చేసింది. ఆ తర్వాత ప్రాజెక్ట్స్ పై ఎలాంటి ఫోకస్ చేయని దేవా కట్టా ఇప్పుడు ఈ సిరీస్ తో మళ్లీ ఆడియన్స్ ముందుకు రానున్నారు.






# వార్ 2 ట్రైలర్ పై స్పెషల్ కేర్!

మ్యాన్ ఆఫ్ మాసెస్ ఎన్టీఆర్ తో పాటు బాలీవుడ్ గ్రీక్ గాడ్ హృతిక్ రోషన్ ల కాంబినేషన్ లో డైరెక్టర్ అయాన్ ముఖర్జీ తెరకెక్కించిన భారీ పాన్ ఇండియా మూవీ వార్ 2. ఈ సినిమా కోసం అటు బాలీవుడ్, ఇటు టాలీవుడ్ కూడా చాలా ఈగర్ గా వెయిట్ చేస్తున్నారు. నార్త్ లో హృతిక్ చూసుకుంటే సౌత్ సహా యూఎస్ మార్కెట్ లో ఎన్టీఆర్ తన స్టామినా చూపిస్తున్నాడు. అయితే ట్రైలర్ తర్వాత ఇతర పాటలు, ట్రైలర్ లాంటివి ఇంకా రావాల్సి ఉంది. మరి వీటిలో ట్రైలర్ పై ఇంట్రెస్టింగ్ రూమర్ వినిపిస్తుంది. దీనితో అయాన్ ముఖర్జీ స్పెషల్ కేర్ ని విఎఫ్ఎక్స్ విషయంలో తీసుకుంటున్నట్టుగా తెలుస్తుంది. అలాగే ఈసారి ఎన్టీఆర్ పై ఎలివేషన్స్ కూడా గట్టిగా ఉండేలా చూస్తున్నారట. అయితే టీజర్ కి విజువల్ ఎఫెక్ట్స్ విషయంలో వచ్చిన కామెంట్స్ ఇపుడు రాకుండా మరింత నాచురల్ విజువల్ ఎఫెక్ట్స్ కనిపించే విధంగా డిజైన్ చేయిస్తున్నట్టు తెలుస్తుంది. మరి ఈ ట్రైలర్ ఎప్పుడు రిలీజ్ అనేది ఇంకా తెలియాల్సి ఉంది. ఇక ఈ సినిమాలో కియారా అద్వానీ హీరోయిన్ గా వర్క్ చేస్తున్నారు. పైగా ఈమె క్యారెక్టర్ కూడా చాలా సాలిడ్ యాక్షన్ తో ఉండబోతుంది. ముఖ్యంగా ఈ సినిమాలో ఎక్కడా కూడా డిజప్పాయింట్ చేసేలా కనిపించడం లేదు. దీంతో పాటు ఎన్టీఆర్ దేవర మూవీ తర్వాత మరింత ఎఫెక్టివ్ వర్క్ ని అందించే పనిలో ఉన్నట్లు కూడా తెలుస్తుంది. దీంతో ఆడియన్స్ ఆయన లుక్స్ అండ్ యాక్షన్ సీక్వెన్స్ ల కోసం ఎంతగానో వెయిట్ చేస్తున్నారు. ఇక దేవర 2 పై కూడా ఎన్టీఆర్ ఫోకస్ చేయగా.. ప్రశాంత్ నీల్ తో డ్రాగన్ ప్రాజెక్ట్ పై ఫోకస్ చేస్తున్నారు. మరి ఎన్టీఆర్ నుండి నెక్స్ట్ వచ్చే ప్రాజెక్ట్స్ పై కూడా ఆడియన్స్ ఫుల్ గా ఫోకస్ చేస్తున్నారు.

# స్పిరిట్.. మ్యూజిక్ వర్క్ ఫినిష్?

ప్రభాస్ పాన్ ఇండియా క్రేజ్‌తో చేస్తున్న సినిమాల లైన్ లో స్పిరిట్ ప్రాజెక్ట్ పై స్పెషల్ అంచనాలు ఉన్నాయి. సందీప్ రెడ్డి వంగా డైరెక్షన్ లో వస్తున్న ఈ యాక్షన్ డ్రామా సినిమాపై ఇప్పటికే భారీ హైప్ క్రియేట్ అయ్యింది. అర్జున్ రెడ్డి, కబీర్ సింగ్, యానిమల్ వంటి సినిమాలతో భారీ హిట్స్ అందుకున్న వంగా.. ఇప్పుడు ప్రభాస్‌ను పోలీస్ గెటప్‌లో చూపించబోతున్నాడు. ఇది సందీప్ కు, ప్రభాస్ కు కలిసొచ్చే క్రేజీ కాంబినేషన్ గా ఇండస్ట్రీ అంతా ఇంట్రెస్టింగ్ గా వెయిట్ చేస్తుంది. ప్రభాస్ ఈ సినిమాకి సెప్టెంబర్ నుండి పూర్తిగా డేట్స్ కేటాయించనున్నాడు. ఇప్పటికే రాజాసాబ్ షూట్ ను కంప్లీట్ చేసుకోగా.. వేగంగా పనులు జరుపుతున్న ప్రభాస్, ఆ తర్వాత స్పిరిట్ కోసం పూర్తిగా డెడికేట్ అయ్యేలా ప్లాన్ చేసుకున్నట్టు టాక్. కాగా, రీసెంట్ గా రిలీజ్ అయిన అప్డేట్ ప్రకారం.. సందీప్ తన మ్యూజిక్ డైరెక్టర్ హర్షవర్ధన్ రమేశ్వర్‌తో కలిసి ఈ సినిమా మ్యూజిక్ పనులు పూర్తి చేశారట. స్పిరిట్ సినిమాను మ్యూజికల్ బ్లాక్ బస్టర్ గా క్రియేట్ చేయాలని దర్శకుడు, మ్యూజిక్ డైరెక్టర్ కలిసి లక్ష్యంగా పెట్టుకున్నారట. ఇప్పటికే హర్షవర్ధన్ తన అద్భుతమైన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్‌తో అర్జున్ రెడ్డి, యానిమల్ సినిమాలకు స్పెషల్ అట్రాక్షన్ గా నిలిచాడు. ఇప్పుడు స్పిరిట్ కోసం కూడా కంటెంట్ ఉన్న మ్యూజిక్‌తోనే ముందుకు వెళ్తున్నట్లు టాక్. ఈ సినిమాకు సంబంధించి పాటల కంపోజింగ్ పనులు పూర్తయ్యాయని తెలుస్తుండగా, ప్రస్తుతం లిరిక్స్, వోకల్స్ పనులు మాత్రమే మిగిలి ఉన్నాయట. ఈ మ్యూజికల్ స్ట్రాటజీ వల్ల సినిమా నాన్ థియేట్రికల్ మార్కెట్ కూడా పవర్ఫుల్ గా ఉండే అవకాశం ఉంది. ప్రత్యేకంగా ప్రతి ఎమోషన్‌కు తగిన బీజీఎం ప్లాన్ చేయడం, కథనంలో మ్యూజిక్ కు సెంటర్ స్టేజ్ ఇవ్వడం వంటి పాయింట్లపై సందీప్ చాలా సీరియస్‌గా పనిచేశాడట. ఇదే వంగా స్టైల్‌లో ఉండే మరో సినిమా కావడం వలన స్పిరిట్ లోని సాంగ్స్, స్కోర్ భారీగా ఆకట్టుకుంటాయని యూనిట్ అంటోంది. ఇదిలా ఉంటే.. సెప్టెంబర్ రెండో వారం నుండి సినిమా రెగ్యులర్ షూట్ మొదలు పెట్టేందుకు టీమ్ ఏర్పాట్లు పూర్తి చేసింది. హైదరాబాద్‌లో మొదటి షెడ్యూల్ ప్లాన్ చేయగా, తర్వాత యూరప్‌లో మేజర్ పోర్షన్ షూట్ చేయనున్నారు. కథ మొత్తం పోలీస్ పాత్ర చుట్టూ తిరుగుతుందట. అందుకే ఇందులో ప్రభాస్ లుక్, నటన రెండూ కొత్తగా ఉండేలా ప్లాన్ చేస్తున్నారు. ఇక ప్రభాస్ ప్రజంట్ బ్యాక్ టు బ్యాక్ భారీ ప్రాజెక్ట్స్ లో యాక్ట్ చేస్తున్న సంగతి తెలిసిందే.

